


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఆర్ఎస్ఎస్‌లో లైంగిక వేధింపులపై దర్యాప్తు 05

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు 04

స్థానిక ఎన్నికలపై వివరణ ఇవ్వండి : హైకోర్టు 04

సంపుటి 28, సంచిక: 118 | శనివారం | 18-10-2025 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఐ మద్దతు

- బిజెపికి బిఆర్ఎస్ అనుబంధంగా మారే ప్రమాదం ఉన్నందున కాంగ్రెస్ గెలవాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రమాదకర శక్తిగా మారిన బిజెపికి బిఆర్ఎస్ అనుబంధంగా మారే ప్రమాదం ఉన్నందున జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, అందుకే ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తరువాయి 2లో





## తారస్థాయికి దళితుల అణచివేతలు

- రాయ్‌బరేలిలో హరిఓం దారుణ హత్య యావత్ దేశ ప్రజల హృదయాలను కలచివేసింది
- బాధితులను బెదిరించడంలో బిజీగా అధికార యంత్రాంగం
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ధ్వజం
- హరిఓం కుటుంబంతో భేటీ

**కాన్పూర్ :** ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలిలో దళిత గ్రామస్తుడు హరిఓమ్ వాల్మీకి దారుణ హత్య దేశ ప్రజల హృదయాలను కలవరపరిచిందని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి కుటుంబాన్ని బెదిరించడానికి యంత్రాంగం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గురువారం ఆయన ఫతేపూర్ జిల్లాలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని తనను కలవనీయండా ఆపేందుకు అధికారులు ప్రయత్నించారని మండిపడ్డారు. అనంతరం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. హరి ఓమ్ వాల్మీకి దారుణ హత్య మొత్తం దేశ ప్రజలను కలవరపరిచిందన్నారు. అతని కుటుంబం దృష్టిలో బాధతో పాటు ఈ దేశంలో దళితుడిగా ఉండటం ఇప్పటికీ ఘోరమైన నేరమా? అనే ప్రశ్న కూడా మెదులుతోందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అధికార యంత్రాంగం బాధితుడి కుటుంబాన్ని బెదిరించడంలో బిజీగా ఉందని, ఆ కుటుంబాన్ని తనను కలవకుండా నిరోధించడానికి చాలా యత్నించిందన్నారు. బాధితులకు నాయ్యం చేయడంలో వ్యవస్థ పదే పదే వైఫల్యం చెందుతుందని, ఏదైనా ఘటన జరిగిన ప్రతిసారీ నేరస్థులను రక్షించి, బాధితుడిని దోషిగా నిలబెట్టిందని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. న్యాయాన్ని గృహ నిర్బంధంలో ఉంచలేమన్నారు. బిజెపి ప్రభుత్వం బాధితుడి కుటుంబంపై ఒత్తిడిని ముగించి, దోషులకు కఠినమైన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. తాను హరి ఓం కుటుంబంతో పాటు దేశంలో దోపిడీకి గురైన, అణగారిన, దుర్బల పౌరుడికి అండగా నిలుస్తానన్నారు. ఈ పోరాటం హరిఓం కోసం మాత్రమే కాదు ? అన్యాయానికి తలొగ్గడానికి నిరాకరించే ప్రతి గొంతు కోసం అని తరువాయి 2లో

## బిసి రిజర్వేషన్ల అమలుకు
# నేడు రాష్ట్ర బంద్



బిసి సంఘాలు ఇచ్చిన పిలుపునకు అన్ని రాజకీయ పార్టీల మద్దతు

బంద్‌కు సంఘీభావంగా అఖిలపక్ష, బిసి సంఘాల ముందస్తు ర్యాలీలు

బషీర్‌బాగ్ కూడలి నుంచి ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ

03

## బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది బిజెపినే

**నేటి బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు**

సింగరేణి కార్మికులకు బోనస్ : డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/ ఖమ్మం

తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది ముమ్మాటికీ బిజెపినేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ఇప్పటికీ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. దేశంలో ఎక్కడలేనివిధంగా ఆర్థిక సామాజిక విద్య రాజకీయ సర్వే తరువాయి 2లో



## రేపు శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌ల పంపిణీ

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- సులువుగా భూ సేవలు అందడానికి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నామని ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు హైదరాబాద్‌లోని శిల్ప కళావేదికలో ఈ నెల 19వ తేదీన సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లైసెన్సులను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని క్షేత్రస్థాయి ప్రజలకు సులభంగా భూ సేవలు అందే విధంగా ప్రతి మండలానికి కనీసం 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. గత పది సంవత్సరాలుగా సర్వే విభాగం నిర్లక్ష్యానికి గురైందని, క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల ప్రజలకు తగిన సేవలు అందలేదని గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి తరువాయి 2లో





## ‘డిజిటల్ అరెస్టు’ మోసాలపై సుప్రీం ఆందోళన

**స్పందన తెలపాలని కేంద్రం, సిబిఐలకు ఆదేశం**

**న్యూఢిల్లీ :** డిజిటల్ అరెస్టులు... ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎంచుకొన్న కొత్త పంథా. దీని పేరు చెప్పి అవతలి వ్యక్తులను భయాందోళనకు గురిచేస్తూ.. పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేస్తున్నారు. దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి. తాజాగా ఈ మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సుమోటోగా తీసుకున్న ఓ కేసు విచారణ సందర్భంగా కేంద్రం, సిబిఐలకు వారి స్పందన తెలపాలని తరువాయి 2లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్




ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నవీన్ యాదవ్ నామినేషన్ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మేయర్ గద్వాల విజయలక్ష్మి , రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంపి అసదుద్దీన్ ఓవైసీ నవీన్ యాదవ్‌ను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. పదేండ్ల పాటు రాష్ట్ర పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. నువ్వు గెలవాలని నవీన్ యాదవ్‌ను అన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని పోవాలంటూ ఆయనకు సూచించారు. నామినేషన్ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నవంబర్ 11న జరిగే ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరువాయి 2లో

## ఆశన్నసహా 210 మంది లొంగుబాటు

**153 ఆయుధాలను అప్పగించిన మావోయిస్టులు**



**జగ్‌దల్‌పూర్ :** మావోయిస్టు అగ్రనేత, కేంద్రకమిటీ సభ్యుడు ఆశన్న అలియాస్ రూపేశ్ సహా దాదాపు 210 మంది నక్సలైట్లు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ బస్తర్ జిల్లాలోని జగ్‌దల్‌పూర్‌లో శుక్రవారం నిర్వహించిన నక్సలైట్ల లొంగుబాటు కార్యక్రమంలో వారంతా జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. మావోయిస్టు చరిత్రలోనే ఇది అతిపెద్ద లొంగుబాటుగా నిలిచింది. లొంగిపోయిన సీనియర్ మావోయిస్టు నాయకులలో కేంద్ర కమిటీ సభ్యుడు రూపేష్‌తో పాటు నలుగురు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డికెఎస్‌జెడ్‌సి) సభ్యులు భాస్కర్ అలియాస్ రాజ్‌మ్‌న్ మాండవి, తరువాయి 2లో





# ప్రపంచం WORLD NEWS

## అమెరికా—చైనా వాణిజ్య యుద్ధంతో కనిష్ఠస్థాయికి చమురు ధరలు

**న్యూయార్క్:** అమెరికా—చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ముడిచమురు ధరలు ఐదు నెలల కనిష్ఠస్థాయికి తగ్గాయి. 2026 లో చమురు సరఫరాల్లో మిగులు ఉంటుందని అంతర్జాతీయ ఎనర్జీ ఏజెన్సీ ప్రకటించింది. బ్రెంట్ క్రూడ్ 48 సెంట్లు (0.8 శాతం) ధర క్షీణించింది. దీంతో ఒక బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 61.91 డాలర్లు వద్ద స్థిరంగా ఉంది. అదేవిధంగా డబ్ల్యుటిఐ కూడా 43సెంట్లు ధర తగ్గడంతో ముడి డబ్ల్యుటిఐ చమురు ధర బ్యారల్‌కు 58.27 డాలర్లు వద్ద స్థిరంగా ఉంది. అమెరికా—చైనా మధ్య ఉద్రిక్తతలు గనుక మరింతగా పెరిగితే బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు ఒక బ్యారెల్‌కు 50డాలర్ల స్థాయికి పడిపోయే అవకాశాలు ఉన్నా యని బ్యాంక్ ఆఫ్ అమెరికా గురువారం ప్రకటించింది. రెండు ప్రపంచ అగ్ర దేశాలమధ్యా గడచినవారంలో తిరిగి వాణిజ్య యుద్ధం ప్రారంభమైంది. చైనాపై నూరుశాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అత్యంత విలువైన ఖనిజాల ఎగుమతులపై చైనా నియంత్రణలను పెంచడంతో ఆగ్ర హించిన ట్రంప్ చైనాపై సుంకాల భారం వేశారు.

## పాకిస్తాన్—అఫ్గానిస్థాన్ మధ్య
# కొనసాగుతున్న కాల్పుల విరమణ

**ఇస్లామాబాద్/ కాబూల్:** పాకిసాస్తాన్—అఫ్గానిస్థాన్ మధ్య మొదలైన యుద్ధానికి తాత్కాలికంగా తెరపడింది. ఇరు దేశాల అంగీకారంతో, 48 గంటల కాల్పుల విరమణ కొనసాగుతున్నది. పాకిస్తాన్ కాబూల్ నగరంపై డ్రోన్ దాడులు జరిపిందని అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. కాబూల్ పోలీసు చీఫ్ అధికార ప్రతినిధి ఖాలిద్ జద్రాన్, ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ప్రకటనలో ఈ దాడులు బుధవారం మధ్యాహ్నంలో నగరాన్ని విరుచుకుపడ్డాయని చెప్పారు. డ్రోన్ దాడుల్లో ఒక నివాస గృహం, ఒక మార్కెట్ ప్రభావి తమయ్యాయని వివరించారు. మృతుల వివరాలు ఇవ్వలేదుగానీ ఆసుపత్రి డాక్టర్లు ఐదుగురు మరణించారని, వందల్లో మందికి గాయాలయ్యాయని పేర్కొన్నారు. అందుకు సమాధానంగా తాము కూడా ప్రతీకార దాడులు నిర్వహించినట్టు తెలిపారు. ఈనెల 10 తర్వాత ఇరు దేశాల మధ్య ఘర్షణలు తీవ్రస్థాయికి చేరిన విషయం



తెలిసిందే. పాకిస్తాన్ వెనుక ఎంత పెద్ద దేశం ఉన్నా వెనక్కు తగ్గేది లేదని తాలిబన్లు ప్రకటించగా, అఫ్గాన్ దాడుల వెనుక భారత్ హస్తం ఉందని పాక్ అనుమానం వ్యక్తం చేసింది. ఆ ఆరోపణలను భారత్ ఖండించింది. కాగా, యుద్ధాన్ని కోరుకోవడం లేదని కాబూల్ నుంచి వచ్చిన ప్రకటనకు పాక్ కూడా సానుకూలంగా స్పందించడంతో, ఎంతో మంది మరణాలకు, గాయాలకు కారణమైన ఘర్షణలకు ముగింపు పలకాలని ఇరు దేశాలు ఒప్పందానికి వచ్చాయి. ఒకటి రెండు ఘటనలు మినహా, ప్రస్తుతానికి కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉందని తెలుస్తోంది. రెండు దేశాల్లో ఎవరూ కాల్పుల ఉల్లం ఘనపై తాజా ప్రకటనలు చేయలేదు. 2021 తర్వాత రెండు దేశాల మధ్య పదుల సంఖ్యలో మరణాలు సంభవించడం ఇదే మొదటిసారి. ఈ యుద్ధానికి పూర్తిగా తెరపడితే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవు తున్నది.

## స్వాగతించిన చైనా



**బీజింగ్:** పాకిస్తాన్, అఫ్గానిస్థాన్ మధ్య జరిగిన తీవ్రమైన యుద్ధానికి అనంతరం 48 గంటల కాల్పుల విరమణను చైనా గురువారం స్వాగ తించింది. ఇరుదేశాలు తమ భేదాలను పరిష్క రించుకోవడానికి సమగ్ర, శాశ్వత ఒప్పందానికి చేరుకోవాలని పిలుపునిచ్చింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ శుక్ర వారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పాకిస్తాన్—అఫ్గానిస్థాన్ తాత్కాలిక కాల్పుల విర మణ అమలు చేయాలని, నిర్మాణాత్మక చర్చల ద్వారా పరిష్కారం కోరాలని నిర్ణయించిన విష యాన్ని గమనిస్తున్నట్టు చెప్పారు. ఇది రెండు దేశాల పరస్పర ప్రయోజనాలకు, అలాగే ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి తోడ్పడుతుందని అన్నారు. చైనా ఈ ప్రయత్నాన్ని స్వాగతిస్తూ మద్ద తునిస్తుంది అని తెలిపారు. ఇరుదేశాలు శాంత మైన దృక్పథంతో, ఆత్మనిగ్రహంతో వ్యవహరించి, సంపూర్ణమైన, శాశ్వత కాల్పుల విరమణ సాధించే దిశగా కృషి చేస్తారని ఆశిస్తున్నట్టు చెప్పారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా అభిప్రాయభేదా లను పరిష్కరించుకోవాలని రెండు దేశాలకు హితవు పలికారు. అమెరికా కూడా కాల్పుల విర మణ ఒప్పందంపై హర్షం వ్యక్తం చేసింది. రెండు దేశాల మధ్య శాశ్వత యుద్ధ విరమణను కోరు కుంటున్నట్టు వైట్‌హౌస్ ప్రకటనలో తెలిపింది.

# ‘నెస్లే’లో 16 వేలమంది ఉద్యోగులపై వేటు





**జ్యూరిచ్:** ఎస్‌ప్రెస్సో కాఫీ, పెరియర్ వాటర్ వంటి ప్రముఖ ఫుడ్ ప్రోడక్ట్స్‌కు ప్రసిద్ధి చెందిన బ్రాండెడ్ కంపెనీ ‘నెస్లే’ రాబోయే రెం డు సంవత్సరాలలో ప్ర పంచ వ్యాప్తంగా 16,000 మంది ఉద్యోగులపై వేటు వేయను న్నది. కొత్తగా బాధ్యతలు తీసుకున్న నెస్లే చీఫ్ ఎగ్జి క్యూటివ్ ఫిలిప్ నవ్రాతిల్ గురువారం ఈ విష యం చెప్పారు. ప్రపంచం శరవేగంగా మార్పు లు చెందుతోంది, నెస్లే కూడా అందుకు అనుగుణంగా వేగంగా మార్పులు చెందాలి, కొత్త సాకేతికతను అందిపుచ్చుకోవాలి’’ అన్నారు. సెప్టెంబరు మొద టివారంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ గా నవ్రాతిల్ బాధ్య తలు చేపట్టారు. ఇప్పటికే 4,000 మంది ఉద్యోగు లను తొలగించే ప్రక్రియ ప్రారంభమైందని, 12,000 మంది వైట్ కాలర్డ్ ఉద్యోగస్తులను తొల గించడం ద్వారా కంపెనీకి 100 కోట్ల స్విస్ ఫ్రాంక్స్ ఆదా అవుతాయన్నారు. 2027 నాటికి 300 కోట్ల స్విస్ ఫ్రాంక్స్‌ను ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యా ప్తంగా ప్రతి మార్కెట్ నుండీ ‘నెస్లే’లో ఈఉపసం హరణలు జరుగుతాయని, ప్రస్తుత దశలో ఏ మార్కెట్ నుండి ఎంతమందిని తొలగించాలనే విషయం చెప్పలేమని, మార్కెట్‌కు అనుగుణంగా ఎవరి ప్రణాళిక వారే రూ పొందించుకోవాల్సి ఉంటుందన్నారు. బాధాకరమే ఐనప్పటికీ, సంఖ్య తగ్గిం చుకోవాల్సిన నిర్ణయం అనివార్యమన్నారు. గడచిన తొమ్మిది నెలలుగా కంపెనీ లావాదేవీలను ఆయన ప్రస్తావిస్తూ 1.9 శాతం మేరకు విక్ర యాలు క్షీణించిపోయాయని చెప్పారు. దాదా పు 83 బిలియన్ డాలర్ల మేరకు విక్రయాలు క్షీణించా యని చెప్పారు.

# పుతిన్‌తో మరోసారి చర్చలు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్:** రష్యా అధ్యక్షుడు వ్లాది మీర్ పుతిన్‌తో మరోసాని చర్చిస్తా నని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. బుధవారం పుతిన్‌తో ఫోన్‌లో సంభాషించిన ఆయన, ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో సమావేశాన్ని ఖరారు చేశారు. ఈ సమావేశం అనం తరం పుతిన్‌తో మరోసారి చర్చిస్తా నని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఈ చర్చలు ఎప్పుడు, ఎక్కడ జరుగుతాయన్న విషయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఒకటి రెండు వారాల్లో వీరి చర్చలు ఉండవచ్చన్న వార్తలు వినిపిస్తున్నాయి. కాగా, పుతిన్‌తో జరిగిన ఫోన్ సంభాషణతో ఎంతో మంచి పురో గతి సాధ్యమైందని ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టులో రాశారు. ఇదివరకు ఇరువురు నాయకులు ఆగస్టులో అలాస్కాలో కలుసుకుని సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినా, ఆశించిన పురోగతి లేదు. అందుకే, మరోసారి భేటీ అయ్యే అవకాశాలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. పుతిన్ విదేశాంగ సలహాదారు యూరీ ఉష కోవ్ ప్రకారం, ఈ కాల్‌ను రష్యా అధ్యక్షుడే ప్రారంభిం చారు. ఉక్రేన్‌కు టోమాహాక్ క్షిపణులు అమ్మితే, అది ఇరు దేశాల మధ్య సంబంధాలపై తీవ్రమైన ప్రభావాలు కలుగ జేస్తుందని ట్రంప్‌కు పుతిన్ స్పష్టం చేశారు.

# రాజీనామా ప్రసక్తే లేదు

### స్పష్టం చేసిన పెరూ అధ్యక్షుడు



**లిమా:** పెరూలో ‘జెన్ జెడ్’ నిరసనలు ఉవ్వెత్తును ఎగసిపడుతుండగా, గురు వారం నాటి నిరసనలో పాల్గొన్న ప్రదర్శన కారుడు మరణించడంతో పరిస్థితి ఉద్రి క్తంగా మారింది. కొత్తగా పదవీ బాధ్యలు చేపట్టిన జోస్ జెరి రాజీనామా చేయాలన్న డిమాండ్ వినిపిస్తున్నది. అయితే, ఆయన రాజీనామాకు ససేమిరా అంటున్నారు. జెన్ జెడ్ ప్రదర్శనల్లో 80 మంది పోలీ సులు, 10 మంది జర్నలిస్టులుసహా కనీసం 100 మంది గాయపడినట్టు తెలు స్తోంది. ఉద్యమం తీవ్రతరం అవుతున్నప్ప టికీ తాను రాజీనామా చేయబోనని జెరి పేర్కొన్నారు. శుక్రవారం పార్లమెంట్‌ను సందర్శించిన అనంతరం ఆయన మీడి యాతో మాట్లాడుతూ, దేశ స్థిరత్వాన్ని కాపాడటం తన బాధ్యతగా పేర్కొన్నారు. లిమాలో జెన్ జెడ్ ఆందోళనలు సుమారు నెల రోజుల క్రితం మొదలయ్యాయి. ఉద్యోగ కల్పన, వృద్ధులకు పెన్షన్లు, ఉద్యో గులులకు మెరుగైన జీతాలు డిమాండ్ చేస్తూ ఈ ఉద్యమం మొదలైంది. లిమాలో నిరంతరం చోటు చేసుకుంటున్న అస్థిర తకు ఈ నిరసనలు అద్దం పడుతున్నాయి. దశాబ్దకాలంలో ఏడో అధ్యక్షుడిగా జెరి ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, ఆయనతోపాటు పార్లమెంటు సభ్యులు కూడా వెంటనే రాజీనామా చేయాలని ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు.

## ‘వంట బిల్లులు, వేతనాలను’ విడుదలచేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాఠశాల వంట కార్మికుల పెండింగ్ ‘వంట బిల్లులు, వేతనాలను’ వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల మేరకు కార్మి కులకు రూ. 10వేల వేతనాలను వెంటనే అమలు చేయాల న్నారు. హైదరాబాద్, సత్యనా రాయణ రెడ్డి భవన్‌లోని ఎఐటి యుసి రాష్ట్ర కార్యాలయంలో ‘మధ్యాహ్న భోజన పథకం



వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం’ జరిగింది. యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి తోపునూరి చక్రపాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మానికి ఎస్ బాలరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అల్పాహా రంకు సంబంధించిన పాత బకాయిలు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నా యని, మళ్లీ అల్పాహారం పథకాన్ని ప్రవేశ పెడితే ,దీనిని ఎలా అమలు చేస్తా రని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 31వ తేదీన, నవంబర్ 12న ‘టోకెన్ సమ్మె’నునిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యధర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపెల్లి విజయలక్ష్మి ,తోపునూరి చక్రపాణి, ఆధి రంగా రెడ్డి, మీస లక్ష్మ ణ్, ధర్ముల రామ్మూర్తి, నిమ్మటూరి రామకృష్ణ, సంఘం పద్మ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం ఆందోళన (మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం ఆదేశించింది. హర్యానాలోని అంబాలాకు చెందిన 73 ఏళ్ల ఓ మహిళ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌కి ఫిర్యాదు పత్రం రాశారు. అందులో.. తనను డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించార న్నారు. రూ.కోటి ఇస్తే ఈ అరెస్టు నుంచి బయటపడొచ్చని వారు బెదిరింపు లకు పాల్పడ్డారని ఆమె తెలిపారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు చూపించి నేరగాళ్లు సొమ్ములు కాజేయడాన్ని సిజెఐతో సహా సీని యర్ న్యాయమూర్తులు తీవ్రంగా పరిగణించారు. అంబాలా కేసును న్యాయ స్థానం సుమోటోగా తీసుకోగా.. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది.ఈ సందర్భంగా న్యాయమూర్తులకు సంబంధించి నకిలీ సంతకాలు, సుప్రీం, హైకోర్టులు ఆదేశాలు జారీ చేసినట్లు పత్రాలు చూపించి ఇలాంటి నేరాలకు పాల్పడటం వల్ల న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుం దని ధర్మాసనం పేర్కొంది. వీటిని సాధారణమైన మోసాలుగా పరిగణించలే మని వ్యాఖ్యానించింది. ఇలాంటి నేరాలను బయటపెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసుల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయపడింది. ఇక, అంబాలా కేసుకు ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని అటార్నీ జనరల్‌ను, స్థానిక సైబర్ క్రైమ్ విభాగానికి సూచిం చింది. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి స్పందన తెలియజేయాలని కేంద్రం, సిబిఐలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## యాదవ్ నామినేషన్
(మొదటి పేజీ తరువాయి)

నవీన్ యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ప్రజాస్వా మిక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందన్నారు. అసెంబ్లీ, పార్ల మెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస పరాజయాలు ఎదుర్కొన్న బిఆర్‌ఎస్ పార్టీ ఇప్పుడు కంటోన్మెంట్ ఎన్నికల్లో కూడా ఓటమిని చవిచూసిందన్నారు. ప్రజలు వారి తప్పుడు వాగ్దానాలను గుర్తించి తిరస్కరించారన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే బిఆర్‌ఎస్ ఓట్ చోరీ అంశాన్ని ముందరేసుకుంద న్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్, బిజెపి ప్రజలకు ఏం చేశాయో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము రెండేండ్లలో ఏం చేశామో చెప్తామన్నారు. జూబ్లీహిల్స్ ను రోల్ మోడల్‌గా తీర్చి దిద్దుతామని హామీని చ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మాట్లాడుతూ తనకుకు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధితో జూబ్లీహిల్స్‌లో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కాంగెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించబోతున్నారని అన్నారు.

## 210 మంది లొంగుబాటు (మొదటి పేజీ తరువాయి)

రాణిత, రాజు సలాం, ధన్ను వెట్టి అలియాస్ సంతు, ప్రాంతీయ కమిటీ సభ్యుడు రతన్ ఎలామ్ ఉన్నారు. వీరంతా 153 ఆయుధాలను అప్పగించగా వాటిలో 19 ఎకె47 రైఫిల్స్, 17 సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్స్, 23 ఇన్సాస్ రైఫిల్స్, ఒక ఇన్సాస్ ఎల్‌ఎంజి (లైట్ మెషిన్ గన్), 36 .303 రైఫిల్, నాలుగు కార్బైన్, 11 బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్ (బిజిఎల్) ఉన్నాయి. అక్టోబర్ 2న బస్తర్ ప్రాంతంలోని బిజాపూర్ జిల్లాలో 103 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వారిలో 49 మందిపై సమష్టిగా రూ. 1.06 కోట్లకు పైగా రివా ర్డును కలిగి ఉన్నారు. తాజా లొంగుబాటుతో గత మూడు రోజుల్లో మొత్తం 238 మంది నక్సలైట్లు హింస మార్గాన్ని విడిచిపెట్టి రాష్ట్రంలో ప్రధాన స్రవంతిలోకి చేరారని, బుధవారం మరో 28 మంది లొంగిపోయారని అధికారులు తెలిపారు. మావోయిస్టుల లొంగుబాటుపై ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి మాట్లాడుతూ ఈ పరిణామం బస్తర్‌కు మాత్రమే కాకుండా ఛత్తీస్‌గఢ్‌కు, మొత్తం దేశానికి ఇది చారిత్రక రోజు అని అభివ ర్ణించారు. తప్పుదారి పట్టి సమాజం నుండి వేరు చేయబడిన 210 మంది సోదరసోదరీమణులు రాజ్యాంగం, మహాత్మా గాంధీ చూపిన అహింస మార్గం మరియు రాష్ట్ర పునరావాస విధానంపై విశ్వాసం చూపిస్తూ ప్రధాన స్రవంతిలోకి తిరిగి చేరారని అన్నారు.

లొంగిపోయిన కార్యకర్తలలో అగ్రశ్రేణి నాయ కులు, దిగువ స్థాయి సభ్యులు ఉన్నారని, వారిని అభినందిస్తూ, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సరెండర్ అండ్ రిహాబిలిటేషన్ పాలసీలో ఆర్థిక సహాయం, భూమి ప్రయోజ నాలు, కొత్త పారిశ్రామిక విధానంలోని ప్రయోజ నాలు, వాటిని ఉపాధితో అనుసంధానించడం వంటి బహుళ నిబంధనలు ఉన్నాయని ఆయన అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమగ్ర నక్సల్ వ్యతి రేక వ్యూహం ఫలితంగా ఈ చారిత్రాత్మక ఘట నను చూస్తున్నామని, దీనికి పోలీసులు, భద్రతా దళాలు, స్థానిక యంత్రాగం నుండి నిరంతర ప్రయత్నాలు, అవగాహన, అప్రమత్తమైన వర్గాల చురుకైన భాగస్వామ్యం మద్దతు ఇస్తున్నాయని ఆయన అన్నారు. బస్తర్ జిల్లా ప్రధాన కార్యా లయం జగదల్‌పూర్‌లో పోలీసులు, పారామిలి టరీ అధికారుల ముందు లొంగిపోయిన వారంద రినీ గిరిజన నాయకులు, పూజారులు ప్రధాన స్రవంతిలోకి అధికారికంగా స్వాగతించారు. ప్రేమ, శాంతి, కొత్త ప్రారంభానికి ప్రతీకగా వారిని ఎర్ర గులాబీలతో స్వాగతించారు.

## కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఐ మద్దతు (మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీ హిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరుతూ టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ హైదరాబాద్ లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్య దర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఈ.టి.నర సింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, కలవేణ శంకర్, ఎం.బాల నరసింహ, బాగం హేమంత రావు, వి.ఎస్.బోస్, సిపిఐ ఎంఎల్‌సి సభ్యులు నెల్లికంటి సత్యంతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బిసి జెఎసి రాష్ట్ర బంద్, జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల, తాజా రాజకీయ పరిస్థితులు తదితర అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. సమా వేశం అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ 2018, 2023 సాధా రణ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఎన్నికల అవగాహ నతో ఉన్నామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ రెండు సంవత్సరాల కాలంలో వివిధ సందర్భా లలో క్రిటికల్‌గానే ఉంటూ, రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో నిర్మాణాత్మకమైన సూచనలు చేశామని కూనంనేని గుర్తు చేశారు. మారిన ప్రస్తుత రాజకీయ సమీకరణాల నేపథ్యంలో భవి ష్యత్‌లో మంచి పరిణామంగా మారుతంద న్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో బిసి జెఎసి చేపట్టిన రాష్ట్ర బంద్‌లో సిపిఐ పూర్తి మద్దతును ఇస్తూ, ప్రత్యక్షంగా బంద్‌లో పాల్గొంటామని కూనంనేని సాంబశివ రావు చెప్పారు.

**మిత్రపక్షాల ఐక్యతతో జూబ్లీహిల్స్‌లో గెలుస్తాం : మహేష్ కుమార్ గౌడ్**

సిపిఐ, కాంగ్రెస్ మిత్రపక్షాల ఐక్యతతో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ మంచి మెజా ర్టీతో గెలుస్తుందని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలతో ఉప ఎన్నికల్లో సత్ఫలితాలు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక మంచి కార్యక్రమాలకు మిత్రపక్షమైన సిపిఐ మద్దతును ఇస్తున్నదని తెలిపారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు కోరేందుకు తాము చారిత్రా త్మకమైన సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవ న్‌కు వచ్చానని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

## అణచివేతలు (మొదటి పేజీ తరువాయి)

ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, హరి ఓం కుటుంబంతో రాహుల్‌గాంధీ దాదాపు 25 నిమి షాలు గడిపారు. హరిఓం తండ్రి గంగాదీన్, సోద రుడు శివం, సోదరి కుసుమ్‌తో మాట్లాడారు. వారికి సానుభూతి తెలిపారు. అనంతరం విలేక రులతో మాట్లాడాతు ఈ ప్రభుత్వంలో దళిత అణ చివేత గరిష్ట స్థాయికి చేరుకుందని ఆరోపిం చారు. కొన్ని రోజుల క్రితం ఒక దళిత అధికారి పూరణ్ కుమార్ ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. బాధితురాలి కుటుంబానికి ముఖ్య మంత్రి న్యాయం చేయాలని, వారిని గౌరవించి నేరస్థులపై త్వరిత చర్య తీసుకోవాలి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారిని ఇంట్లోనే బంధించిందంటూ వ్యాఖ్యానించారు. హరి ఓం వాల్మీకి కుటుంబసభ్యుల్లోకి ఒకరికి వైద్య చికిత్స అవసరం ఉన్నా, అధికారుల చర్యల కారణంగా దానిని పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ‘ఆ కుటుంబం నేరం చేయలేదు. వారిపై నేరం జరి గింది. కానీ వారిని నేరస్థులుగా చూస్తున్నారు. వారిని ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదు. వారిని బెదిరిస్తున్నారు. వారు అడుగుతున్న దల్లా న్యాయం మాత్రమే. ఆ ఇంట్లో ఓ అమ్మా యికి ఆపరేషన్ చేయవలసి ఉంది, కానీ ప్రభుత్వం వారిని నిర్బంధించడం వల్ల అది జరగ లేదు‘ అని రాహుల్ గాంధీ తెలిపారు. కాగా, ప్రతి పక్ష నేత సందర్శనకు కొన్ని గంటల ముందు బాధితుడి సోదరుడు శివం వాల్మీకి కుటుంబంతో ఒక వీడియోను విడుదల చేసి, రాహుల్‌గాంధీ తన సందర్శనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోకూడదని పేర్కొన్నట్లు ఆరోప ణలు ఉన్నాయి. అయితే ఈ వీడియో ఒత్తిడిని సృష్టించడానికి, పరిస్థితిని మార్చటానికి బిజెపి చేసిన ప్రయత్నం అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఇదిలా ఉండగా, దళితుల వేధింపుల కేసుల్లో ఉత్త రప్రదేశ్ దేశంలోనే ముందుందని చూపించే తాజా జాతీయ నేర రికార్డు బ్యూరో (ఎన్‌సిఆ ర్‌బి) గణాంకాలను కూడా గాంధీ ఉదహరిం చారు. ఈనెల 2వ తేదీ తెల్లవారుజామున 1 గంటలకు రాత్రి జాగరణ సమయంలో గ్రామ స్తులు వాల్మీకి (40)ని దొంగగా భావించి కొట్టి చంపారని ఆరోపణలు వచ్చాయి. దొంగతనాల కోసం ఇళ్లను గుర్తించడానికి ఒక ముఠా డ్రోన్ లను నిఘా కోసం ఉపయోగిస్తున్నట్లు పుకార్లు వచ్చాయి. ఈ హత్యాకాండ ఘటన విస్తృత ఆగ్ర హాన్ని రేకెత్తించింది, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీతో సహా ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వం దళితులను రక్షించడంలో, మూక హింసను అరి కట్టడంలో విఫలమైందని ఆరోపించాయి. దాడి తర్వాత, పోలీసులు కేసు నమోదు చేసి, 10న జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత అరెస్టు చేయబడిన ప్రధాన నిందితుడితో సహా ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేశారు. కేసును నిర్వహించ డంలో వైఫల్యం కారణంగా ఇద్దరు సబ్‌ఇన్‌స్పె క్టర్లు సహా ఐదుగురు పోలీసులను సస్పెండ చేశారు.

## అడ్డుకుంటున్నది బిజెపినే
(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించామని సర్వే వివరాల ప్రకారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టామని ఆయన తెలిపారు. గతంలో బిఆర్‌ఎస్ తీసుకు వచ్చిన చట్టాన్ని సవరించామని తెలిపిన భట్టి బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల కల్పనకు సంబంధించి గవర్నర్‌కు బిల్లు పంపిన ఇంత వరకు ఆమోదించ లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొన్ని నెలలుగా బిసి చట్టం అమల్లోకి రాకుండా అడ్డుకుంటుందని ఆయన తెలిపారు. బిజెపి నైజాన్ని తెలంగాణ ప్రజలతో పాటు యావత్ దేశ ప్రజలు గుర్తిస్తున్నారని అఖిలపక్షం కలిసేందుకు కూడా ప్రధాన మంత్రి అంగీకరించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షంతో కలిసేందుకు ప్రధాన మంత్రికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసి ఆహ్వానించినా బిజెపికి పాల్గొనలేదని ఆయన తెలిపారు. రాష్ట్రానికి చెందిన బిజెపి నాయకులు కేంద్ర ప్రభుత్వం వద్ద బిసి బిల్లు ఆమోదం పొందేవిధంగా కోరాలని ఆయన సూచించారు. సుప్రీం కోర్టు తీర్పు కాపీ రాగానే రిజర్వేషన్ల అంశంపై చర్చిస్తామని ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు రూ. 400 కోట్ల బోనస్ ప్రకటించిందని ఆయన తెలిపారు. దేశంలో వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మికులకు బోనస్ అందించడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ దీపావళి తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఎ కొండబాల కోటేశ్వరరావు, నగర అధ్యక్షులు జావిద్, కొత్తా సీతారాములు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## లైసెన్స్‌ల పంపిణీ
(మొదటి పేజీ తరువాయి)

డిఎస్ లోకేష్ కుమార్, సర్వే విభాగం కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంలో భాగంగా రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే మ్యాప్‌ను జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందన్నారు. భూభారతి చట్టంలో పొందుపర్చిన విధంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 350 మంది సర్వేయర్లు సరిపోరని, మరి కొంత మంది సర్వేయర్లు అవసరమవుతారని వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఒక వైపు లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం, మరోవైపు సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న సర్వేయర్ల పోస్టులు భర్తీ చేయడం, అలాగే భూముల సర్వేకు అవసరమైన అత్యాధునికి పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

సర్వేయర్లను నియామకానికి దరఖాస్తులను ఆహ్వానించగా పది వేల మంది దరఖాస్తు చేసుకోగా, తొలివిడతలో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చామని, ఇందులో 3,465 మంది అర్హత సాధించారని వివరించారు. రెండవ విడతలో మరో మూడు వేల మందికి ఆగస్టు 18వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభించామని ఈనెల 26వ తేదీన జెఎన్‌టియు ఆధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుందని, వీరి సేవలు కూడా డిసెంబర్ రెండవ వారం నాటికి అందుబాటులోకి వస్తాయని వివరించారు. రెవెన్యూ శాఖకు సర్వే విభాగానికి అవినాభావ సంబంధం ఉంటుందని, భూముల కొలతలు, రికార్డులు స్పష్టంగా ఉన్నప్పుడే వివాదాలు తగ్గుతాయని, సర్వే వ్యవస్థ బలపడితేనే ప్రజలకు భద్రత, న్యాయం లభిస్తుందని అన్నారు.

ప్రతి రెవెన్యూ గ్రామంలో జిపిఒలు, ఇప్పుడు ప్రతి మండలంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లతో ప్రజలకు అవసరమైన భూ సంబంధిత సేవలు అందేలా వ్యవస్థను పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూమి రికార్డులు స్పష్టంగా ఉండేలా, ప్రజలకు ఇబ్బంది లేకుండా, అవినీతి లేని సేవలు అందించడమే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## డిపిఒ, డిఎల్‌పిఒల అద్దె వాహనాల వసతి మరో ఏడాది పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పని చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారులు (డిపిఒ), డివిజన్ లెవల్ పంచాయతీ అధికారులు (డిఎల్‌పిఒ) వినియోగిస్తున్న అద్దె వాహనాల వసతిని మరో సంవత్సరం పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అద్దె వాహనాల దస్త్రానికి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క శుక్రవారం ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 31 మంది జిల్లా పంచాయతీ అధికారులు, 68 మంది డివిజన్ లెవల్ పంచాయతీ అధికారులకు వాహనాల సదుపాయం కొనసాగుతుంది. వారి వాహన అద్దె చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.3.96 కోట్లు మంజూరు చేసింది.



తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా ఇటీవల నియమితులైన డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డిని తెలంగాణ అరసం అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి, ఉపాధ్యక్షుడు బొమ్మగాని నాగభూషణం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుకు 'ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసిత రైతులు ప్లాట్ల' యజమానులు హైదరాబాద్‌లో మఖ్దూంభవన్‌లో శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు చింతల దామోదర్ రెడ్డి, నడికుడి అంజయ్య, గుజ్జుల సురేందర్ రెడ్డి, పల్లె శేఖర్‌రెడ్డి, జాల వెంకటేష్ యాదవ్, జాల శ్రీశైలం యాదవ్, సందగల మల్లేష్ గౌడ్, నాగవల్లి దశరథ గౌడ్, నెల్లికండి నాగార్జున యాదవ్, గాజుల భగత్, రావికంటి శ్రీనివాస్, బద్రుద్దీన్, తాటికొండ నవీన్ పాల్గొన్నారు.

## 1.15 కోట్ల విలువైన హ్యాష్ ఆయిల్ స్వాధీనం

**హైదరాబాద్ :** హ్యాష్ ఆయిల్ తరలిస్తున్న బాలుడిని రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 17 ఏళ్ల బాలుడు రూ. 1.15 కోట్ల విలువైన 5.1 కిలోల హషీష్ ఆయిల్‌ను రవాణా చేస్తుండగా పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. మల్కాజ్‌గిరిలోని స్పెషల్ ఆపరేషన్స్ టీం (ఎస్ఒటి), ఘట్‌కేసర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా ప్రవర్తిస్తున్న బాలుడిని అడ్డుకుని సోదాలు చేయగా, ఒకే బ్యాక్‌ప్యాక్‌లో రెండు పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసిన హషీష్ ఆయిల్ బయటపడిందని రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. హషీష్ ఆయిల్‌ను సేకరించిన ఒడిశాకు చెందిన ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. బాలుడు అతన్ని పరిచయం చేసుకుని త్వరిత ఆర్థిక లాభం కోసం హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో గంజాయి, హషీష్ ఆయిల్‌ను సరఫరా చేయడానికి పథకం పన్నారని సిపి వివరించారు. పోలీసుల ప్రకారం, ప్రధాన నిందితుడు 5.1 కిలోల హషీష్ ఆయిల్‌ను సేకరించి, దానిని రవాణా చేయడానికి బాలుడిని ఉపయోగించుకున్నాడు. ఈనెల 15న, ఆ బాలుడు అక్రమంగా రవాణా చేసిన వస్తువులను సేకరించి హైదరాబాద్‌కు వెళ్లాడు, అక్కడ శుక్రవారం అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి




### మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మికులకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముద్రణాలయం (చంచల్‌గూడ) యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ముద్రణాలయం (చంచల్‌గూడ) ఎఐటియుసి యూనియన్ సెంట్రల్ కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అజీజ్‌పాషాతో పాటు తెలంగాణ రాష్ట్ర ముద్రణాలయం (చంచలగూడ) యూనియన్ (ఎఐటియుసి) వర్కింగ్ ప్రెసిడెంట్ వి.ఎస్.బోస్, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, మాజీ కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో కొత్త పెన్షన్ తీసుకొచ్చి ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. పిఎఫ్ విధానంలో కూడా ఉద్యోగులకు వ్యతిరేక మార్పులు తీసుకొస్తున్నారన్నారు. గవర్నమెంట్ సెంట్రల్ ప్రెస్‌ను చంచల్‌గూడ నుండి తొలగించి, ఈ స్థలాన్ని నాంపల్లి క్రిమినల్ కోర్టుకు ఇవ్వాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని యూనియన్ తీవ్రంగా వ్యతిరేకించిందని, ఈ ప్రెస్‌ను కాపాడుకున్నామని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో గవర్నమెంట్ సెంట్రల్ ప్రెస్ (జిసిపి)ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నించొద్దని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**యూనియన్ అధ్యక్షుడిగా అజీజ్ పాషా..**

తెలంగాణ రాష్ట్ర ముద్రణాలయం (చంచలగూడ) యూనియన్ (ఎఐటియుసి)సెంట్రల్ కమిటీ జనరల్ బాడీ సమావేశంలో యూనియన్ అధ్యక్షునిగా సయ్యద్ అజీజ్‌పాషాను, ప్రధాన కార్యదర్శిగా వేణు, ఉపాధ్యక్షులుగా వి.ఎస్.బోస్, బ్రాంచి సెక్రెటరీగా యూనస్ అహ్మద్‌ను ఎన్నుకున్నారు. అలాగే బ్రాంచ్ ప్రెసిడెంట్‌గా టి.సురేష్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా టి.శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. సెక్రెటేరియట్ ప్రెస్ అధ్యక్షునిగా మహ్మద్ సయీద్ ఉద్దీన్, కార్యదర్శిగా వి.బాల్‌రాజ్, అసెంబ్లీ ప్రెస్ అధ్యక్షునిగా ఉమానాథ్ ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. నూతనంగా ఎన్నికైన వారికి అజీజ్ పాషా శుభాకాంక్షలు తెలిపారు. గవర్నమెంట్ సెంట్రల్ ప్రెస్ (జిసిపి)లో అందరు కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## బంద్ సందర్భంగా భారీ బందోబస్తు

### ప్రభుత్వ కార్యాలయాల వద్ద పోలీసు పికెట్లు
### అప్రమత్తమైన నిఘా అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం కల్పించాలని డిమాండ్‌తో బిసి సంఘాలు, ఆయా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బంద్‌కు సిపిఐ (మావోయిస్టు) పార్టీ కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మరింత కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్‌టిసి బస్‌స్టేషన్‌లు, రైల్వే స్టేషన్‌ల వద్ద పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. అన్ని జిల్లా కేంద్రాలలో శుక్రవారం రాత్రి నుంచే పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని డిజిపి శివధర్‌రెడ్డి అన్ని జిల్లాల ఎస్‌పిలు, కమిషనరేట్ల కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించారు. కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని తెలిపారు. ఎవరైనా హద్దు మీరి ప్రవర్తిస్తే అదుపులోకి తీసుకుని శాంతియుత పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇక పెట్రోలింగ్‌ను కూడా పెంచడంతో పాటు నిఘా అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని అధికారులకు తెలియజేయాలని డిజిపి వారికి తెలిపారు. బిసి సంఘాలు తలపెట్టిన బంద్‌కు 50 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బంద్ సందర్భంగా అసాంఘిక శక్తులు రెచ్చిపోయే ప్రమాదం ఉందని డిజిపి సూచించారు.

**శాంతి యుతంగా నిర్వహించుకోండి..**

బిసి సంఘాలు తలపెట్టిన బిసి బంద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి సూచించారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం బిసి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో డిజిపి పలు సూచనలు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది, నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డిజిపి పేర్కొన్నారు.

## స్వచ్ఛందంగా బంద్ పాటించండి

### ప్రజలకు, వ్యాపార సంస్థలకు ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి
### శాంతియుతంగా కొనసాగించాలని బిసి నేతలకు పిలుపు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** అన్ని వర్గాల ప్రజలు, వ్యాపార సంస్థలు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌లో పాల్గొనాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల సాధనకు 'బంద్ ఫర్ జస్టిస్' పేరిట ఈ నెల 18న తెల్లవారుజాము 4.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే బంద్ శాంతియుతంగానే కొనసాగుతుందన్నారు. ఇప్పటికే 135 బిసి కుల సంఘాలు, 35 బిసి సంఘాలు, సిపిఐ, కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, సిపిఎం, ఆప్ పార్టీలు బంద్‌కు మద్దతిచ్చాయని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి వైస్‌చైర్మన్ విజిఆర్ నారగోని, కో– ఆర్డినేటర్ గుజ్జకృష్ణ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కూడా బిజెపి రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం దేశ చరిత్రలోనే మొదటిసారి అని పేర్కొన్నారు. అగ్రకులాల పేదల ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ఎన్నడూ తాము వ్యతిరేకించలేదన్నారు. కానీ, బిసిలు రాజకీయంగా ఎదగవద్దని కుట్రతో రెడ్డి జాగృతివారు హైకోర్టులో, సుప్రీంకోర్టులో పిటిషన్లు వేసి, తమ నోటికాడి ముద్దను లాక్కోవడం అన్యాయమన్నారు. బిసి జెఎసి ఉద్యమం బంద్‌తో ఆగదని, బిసిల హక్కులు సాధన ధ్యేయంగా దూసుకెళ్తున్నదని కృష్ణయ్య స్పష్టంచేశారు. అంతకుముందు బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం బిసి నేతల సంఘీభావ ర్యాలీ జరిగింది. సమావేశంలో బిసి సంఘం నేతలు ఎ.రామకోటి, కొండా దేవయ్య, హరి సింగ్, మోదీ రాందేవ్, రవి యాదవ్, వీరన్న, బాలయ్య, మహేశ్, పుష్పలత, లక్ష్మి, మంజుల తదితరులు హాజరయ్యారు.

# నేడు బిసి కోటాపై రాష్ట్ర బంద్



### రాజకీయ పార్టీలు, అన్ని బిసి సంఘాలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలు కోసం 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో శనివారం రాష్ట్ర బంద్ జరగనుంది. బిసి జెఎసి పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్‌కు సబ్బండ వర్గాలు, రాజకీయ పార్టీలు, అన్ని బిసి సంఘాలు, కూల సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు తమ సంపూర్ణ మద్దతు తెలిపాయి. బిసి రిజర్వేషన్‌లు అమలు చేయాలని, బంద్‌కు సంఘీభావంగా సిపిఐ ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడ వైఎంసిఏ చౌరస్తా నుంచి ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. బిసి జెఎసి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం చేపట్టే ర్యాలీలో వివిధ రాజకీయ పార్టీలు పాల్గొనున్నాయి.

**అఖిల పక్ష సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ..**

ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం అఖిల పక్ష బిసి సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో బంద్‌కు సంఘీభావ ర్యాలీని నిర్వహించాయి. బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి బిసి జెఎసి చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ జన సమితి (టిజెఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగా, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆప్ నాయకులు డాక్టర్ డి.సుధాకర్, బిసి జెఎసి నాయకులు రాజారామ్ యాదవ్, గుజ్జ కృష్ణ ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని, రిజర్వేషన్‌ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి, చట్ట సవరణ చేయాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలకు తప్పకుండా రిజర్వేషన్‌లు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. శనివారం జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్‌లో పార్టీలు, సంఘాలకు అతీతంగా సబ్బండ వర్గాలు పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య, ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ తదితరులు పాల్గొన్నారు.

**బంద్‌లో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలి : మహేశ్ కుమార్ గౌడ్**

బిసి జెఎసి బంద్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. బిసి జెఎసి బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. తాను కూడా బంద్‌లో పాల్గొంటానని చెప్పారు. ఈ బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు పాల్గొంటారన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి ఈ బంద్‌లో పాల్గొంటున్నామని చెప్పారు. బిజెపి నేతలు ఎన్ని మాటలు చెప్పినా బిసిల హృదయాల్లో చోటు సంపాదించుకోలేరన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈ బంద్‌లో పాల్గొనాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

**బిసి బంద్‌కు మద్దతు ప్రకటించిన కల్వకుంట్ల కవిత**

బిసి జెఎసి బంద్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు తెలిపారు. బిసి బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. బిసిల రిజర్వేషన్‌ల కోసం తాను పోరాడతానని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లులను ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టిన బిజెపి ఇప్పుడు బంద్‌లో పాల్గొంటోందని, అంటే బిసి రిజర్వేషన్‌ల బిల్లు పాస్ చేసినట్లు భావించాలా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లులు పాస్ చేసి కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడకుండా బిసి రిజర్వేషన్‌లపై ఉత్తుత్తి జి.ఓ ఇచ్చిన కాంగ్రెస్ తామే ముందుండి బంద్ చేయిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని కవిత విమర్శించారు.

**బంద్‌కు మద్దతు తెలిపిన ఆటో జెఎసి**

బిసి జెఎసి బంద్‌కు ఆటో జెఎసి మద్దతు తెలిపింది. శుక్రవారం విద్యానగర్‌లోని బిసి భవన్ వద్ద బిసి యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌లు రాజ్ కుమార్ నేతృత్వంలో ఆటో జెఎసి ప్రతినిధులు, ఆర్.కృష్ణయ్యను కలిసి మద్దతు ప్రకటించారు. అనంతరం నేటి బంద్‌కు మద్దతుగా జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన ఆటో ర్యాలీని ఆర్.కృష్ణయ్య ప్రారంభించారు. బంద్‌కు గ్రామస్థాయి నుండి ఎక్కడికక్కడ బిసిలు నేతృత్వం వహించి విజయవంతం చేయాలని కృష్ణయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ఒయు జెఎసి నాయకులు రాజు, మణికంఠ నేత, ఆటో జెఎసి నాయకులు శ్రీనివాస్, రామకృష్ణ, జాంగిర్, మల్లేష్, మహేష్, వెంకటేశ్ గౌడ్, రాజేష్, రాము, సంతు, రామస్వామి, నిఖిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**ఒయులో బైక్ ర్యాలీ..**

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వామపక్ష, దళిత, బహుజన, బిసి, స్వతంత్ర, జెఎసిల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 42 శాతం బిసి రిజర్వేషన్‌లు అమలు చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతుగా శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించాయి. బంద్ విజయవంతం చేయాలని ఒయు ఆర్ట్స్ కళాశాల నుండి లా కాలేజ్ వరకు ర్యాలీ నిర్వహించి, మహాత్మ జ్యోతిబా పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి వినతి పత్రాలు సమర్పించారు.

**బిసి బంద్ విజయవంతం చేయాలి : సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్**

బిసి జెఎసి పిలుపునిచ్చిన బంద్‌ను విజయవంతం చేయాలని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు. సిపిఐ ఆధ్వర్యంలో నేడు లాలపేట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు.

**విద్య, వ్యాపార సంస్థలు బంద్‌లో పాల్గొనాలి : ఒయు బిసి జెఎసి**

బిసి జెఎసి బంద్‌లో ప్రజలు, విద్య, వ్యాపార సంస్థలు పాల్గొనాలని ఒయు బిసి జెఎసి నాయకులు డాక్టర్ సాంబశివ గౌడ్, డాక్టర్ నిజ్జన రమేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఒయులో బంద్ విజయవంతం కోసం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్ రావు, నాయకులు వట్టికూర రామారావు గౌడ్, చెన్నయ్య, ముదిరాజ్, లోకేష్ యాదవ్, చరణ్ యాదవ్, బొమ్మ హనుమంతు పాల్గొన్నారు.



# బంధాలు బలహీనపడొద్దు..

### త్వరలోనే ప్రతి జిల్లాకు 'వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాలు'
### 'యువజంటల'కు పరస్పర అవగాహన
### రూ.5 కోట్లతో 33 సెంటర్ల ఏర్పాటుకు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు
### ఇదొక సంస్కరణాత్మక ప్రయత్నం : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంధాలు బలహీనపడకుండా వివాహానికి ముందే బంధాల బాధ్యతలను తెలిజేయాలని, తద్వారా ఆ బంధాలు సాధ్యమైనంత విడిపోకుండా చూడాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్ణయించింది. చిన్న చిన్న మనస్పర్థలతో కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుస్తుగానే ఆ వ్యవస్థ విచ్ఛినం కాకుండా చూసేందుకు ఒక పత్ర్యేక ప్రయత్నం చేయాలని ఆ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క నిర్ణయించారు. ఇందులో భాగంగానే రూ.5 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 33 'నూతన వివాహ పూర్వ కౌన్సెలింగ్' కేంద్రాలను ఏర్పాటును ఆమోదించాలని ఆర్థిక శాఖకు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతి పాదనలు పంపింది. ఆర్థిక శాఖ ఆమోదం లభించకగానే కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సఖీ వన్ స్టాప్ సెంటర్లకు ఇటీవల పెరుగుతున్న వివాహ సంబంధ ఫిర్యాదులు ఒక గంభీరమైన సామాజిక వాస్తవాన్ని సూచిస్తున్నాయి. వివాహ బంధంలో భిన్నాభిప్రాయాలు, పరస్పర అవగాహన లోపం, తల్లిదండ్రుల జోక్యం, న్యాయపోరాటాలు, విడాకులు, పిల్లల మానసిక వేదన వంటి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిని మహిళా శిశు సంక్షేమ శాఖ లోతుగా పరిశీలించింది. కాగా పూర్వకాలంలో పెద్దలు, బంధువులు, యువ దంపతులకు వివాహానికి ముందు, ఆ తరువాత కూడా మార్గదర్శకత్వం ఇచ్చేవారు. కానీ ఆధునిక జీవన శైలిలో చిన్న కుటుంబాల పెరుగుదల, పట్టణీకరణ నేపథ్యంలో తరాల మధ్య బంధం బలహీనపడుతోంది. కొన్ని కేసుల్లో తల్లిదండ్రులే వివాహ వివాదాల్లో పక్షాలుగా మారి సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో, దంపతులు వివాహ బంధంలో అడుగుపెట్టే ముందు ఆ బంధం బాధ్యతలను, భావోద్వేగ గాఢతను, పరస్పర గౌరవాన్ని అర్థం చేసుకునేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ అవసరమని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. దీనికి సమర్థమైన పరిష్కారంగా వివాహ పూర్వ కౌన్సెలింగ్ సెంటర్లు (ప్రీ మెరిటియల్ కౌన్సిలింగ్ సెంటర్స్ (పిఎంసిసి) రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. దీంతో వివాహ పూర్వ కౌన్సెలింగ్ సెంటర్ల ఏర్పాటుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ సిద్ధం చేసిన దస్త్రంపై మంత్రి సీతక్క శుక్రవారం సంతకం చేశారు.

**యువ జంటలకు పరస్పర అవగాహన**

వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాలు వివాహ బంధానికి సిద్ధమవుతున్న యువ జంటలకు పరస్పర అవగాహన, వివాద పరిష్కారం, భావోద్వేగ అనుకూలత వంటి అంశాలపై శిక్షణ ఇస్తాయి. అలాగే వారికి చట్టపరమైన హక్కులు, లింగస్పందన, కుటుంబ బాధ్యతలపై అవగాహన కల్పిస్తాయి. ఈ కౌన్సెలింగ్ వల్ల వివాహం ప్రారంభ దశలోనే తలెత్తే విభేదాలు తగ్గి, గృహహింస, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

**ప్రతి జిల్లాలో కేంద్రం....**

ప్రతి జిల్లాలో ఒక వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ప్రారంభ దశలో ఈ కేంద్రాలను సఖీ లేదా వన్ స్టాప్ సెంటర్లలో ఏర్పాటు చేసి, అవసరమైతే ఆ తరువాత సొంత భవనాలను ఏర్పాటు చేస్తారు. ఈ కేంద్రాల్లో శిక్షణ పొందిన సైకాలజిస్టులు, న్యాయ నిపుణులు, సోషల్ వర్కర్లు, మ్యారేజ్ కౌన్సెలర్లు వంటి నిపుణులను నియమిస్తారు. వివాహ పూర్వ కౌన్సెలింగ్ సేవలను వీరు అందిస్తారు. ఇందుకు వీరికి ఒక్కొక్కరికి ప్రతి నెలా రూ.30 వేల వేతనం ఇచ్చేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. సిబ్బంది జీతాలు, నిర్వాహణ తదితర అవసరాల కోసం ఏడాదికి రూ. ఐదు కోట్ల వరకు ఖర్చు అవుతున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అంచనా వేసింది.



**సమాజ నిర్మాణానికి దోహదం : మంత్రి సీతక్క**

వివాహన కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా యువ దంపతులు తమ బాధ్యతను, పరస్పర గౌరవం వంటి విలువలను అర్థం చేసుకుని, సుస్థిరమైన కుటుంబ జీవితాన్ని నిర్మిస్తారని, ఇది కేవలం ఒక వివాహ సమస్యల నివారణకు మాత్రమే కాదని, సమాజ నిర్మాణానికి దోహదపడే సంస్కరణాత్మక ప్రయత్నమని మంత్రి సీతక్క తెలిపారు. ఈ కేంద్రాల ఏర్పాటుతో కుటుంబ విభేదాలు, గృహహింస, విడాకులు గణనీయంగా తగ్గే అవకాశం ఉన్నదని, యువ దంపతుల భావోద్వేగ, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రతి వివాహం అవగాహనతో, గౌరవంతో, బాధ్యతతో ప్రారంభమయ్యే సమాజాన్ని నిర్మించాలన్నదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని మంత్రి సీతక్క అన్నారు.


**తెలంగాణ ప్రభుత్వం, పంచాయత్‌రాజ్ ఇంజనీరింగ్ విభాగం, జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పెద్దపల్లి.**

టెండర్ నోటీసు నం. T3/04/DPRE/PDPL/2025-26, తేదీ: 14.10.2025

పనుల సంఖ్య (90), మొత్తం అంచనా వ్యయం రూ. 809.75 లక్షలు.
పనుల పేరు: 1) సిసి రోడ్ & డ్రెయిన్ పనులు మొదలైనవి, (32 సంఖ్యలు), అంచనా వ్యయం: రూ. 301.00 లక్షలు. 2) భవనాలు మరమ్మతులు & ఇతరాలు (58 సంఖ్యలు), అంచనా వ్యయం: రూ. 508.75 లక్షలు. పెద్దపల్లి జిల్లా పనులు టెండర్ షెడ్యూల్ జారీకి దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 22.10.2025న టెండర్ జారీ చేయడానికి షెడ్యూల్ చేయబడింది. టెండర్ల స్వీకరణకు చివరి తేదీ: 25.10.2025న మధ్యాహ్నం 3.00 గంటల వరకు. టెండర్ల ప్రారంభం: 25.10.2025న 3.30 గంటలకు.

సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, పెద్దపల్లి.

DIPR R.O. No. : 9399-PP/CL/ADVT/1/2025-26, Date: 17-10-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మల్కాజ్‌గిరి సర్కిల్-28

NIT No. 40/EE-28/SBZ/GHMC/2025-2026

పని పేరు: నిర్వహణ పనులు ఇతరములు-06, అంచనా మొత్తం: రూ. 50.50 లక్షలు, బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 18.10.2025న మ.2.00గం.ల నుండి, 25.10.2025న మ.02.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9154796465, 7331189186. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో పంపవచ్చు @ http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 9414-PP/CL/ADVT/1/2025-26, Date: 17-10-2025

**కోదాడ మున్సిపాలిటీ :: సూర్యాపేట జిల్లా.**
ఇమెయిల్ : kodad.mc@gmail.com

నెం. E1/77/MGF/2025-26 'ఇ'-ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ నోటీసు తేదీ: 17.10.2025

కోదాడ మున్సిపాలిటీలో మున్సిపాలిటీ జనరల్ ఫండ్ కింద గ్యాంగ్ మ్యాన్లను నిమగ్నం చేయడం కోసం కింద సంతకం చేసిన వారి ద్వారా 'ఇ'-ప్రొక్యూర్మెంట్ ద్వారా రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది.

పనుల సంఖ్య: 1, అంచనా వ్యయం: రూ. 7.20 లక్షలు:

| | | |
|---|---|---|
| 1) బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ | : | 18.10.2025 సాయంత్రం 04.00 |
| 2) బిడ్ సమర్పణ చివరి తేదీ | : | 22.10.2025 సాయంత్రం 04.00 |
| 3) టెక్నికల్ బిడ్ ప్రారంభ తేదీ | : | 22.10.2025 సాయంత్రం 04.10 |

ఈ సైట్‌ను 18.10.2025 నుండి వెబ్‌లో యాక్సెస్ చేయవచ్చు. పని వివరాలను @ ఇ-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చు. మరిన్ని వివరాలు మరియు స్పష్టీకరణలను అన్ని పని దినాలలో కార్యాలయ వేళల్లో కోదాడ మున్సిపాలిటీ కమిషనర్ లేదా మున్సిపల్ ఇంజనీర్ నుండి పొందవచ్చు.

కమిషనర్: 8374450356, ME: 8374450357.

సం/- కమిషనర్ కోదాడ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 9407-PP/CL/ADVT/1/2025-26, Date: 17-10-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## నవీన్‌యాదవ్‌పై బిఆర్ఎస్ దుష్ప్రచారం

### టిపిసిసి అధికార ప్రతినిధి నిజాముద్దీన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ప్రజలలో నవీన్ యాదవ్‌కు వస్తున్న ఆధరణ చూసి బిఆర్ఎస్ పార్టీ ఓర్వలేక పోతుందని టిపిసిసి అధికార ప్రతినిధి నిజాముద్దీన్ అన్నారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై బిఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నవీన్ యాదవ్ ముస్లింలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తప్పుడు వార్తలు సృష్టించారన్నారు. ఒక దినపత్రికలో వార్త వచ్చినట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ముస్లిం ఓటర్లను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఓటర్లు బిఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు అని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన

# వసతుల కల్పనకు ప్రణాళికలు

### అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తొలి దశలో అవుటర్ రింగు రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌పై దృష్టి సారించాలన్నారు.నర్సరీ నుంచి 4వ తరగతి వరకు నూతన స్కూల్స్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని ఆదేశించారు.వచ్చే విద్యా సంవత్సరం 2026 జూన్ నుంచి అమలు జరిగేలా కార్యాచరణను రూపొందించాలన్నారు.జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్రప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి,సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ప్రతి ప్రభుత్వ పాఠశాల



కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలని, ప్లే గ్రౌండ్,అవసరమైన తరగతిగదులతోపాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలని, విద్యా శాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించాలని సిఎం సూచించారు. సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను ఆ పాఠశాల దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించాలని,కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులు కల్పించాలన్నారు. పాలు, బ్రేక్ ఫాస్ట్,లంచ్ అందించాలని సూచించారు.

## పోడు పట్టాలున్న రైతులకు రుణాలివ్వాలి

### ప్రభుత్వాన్ని కోరిన రైతు సంక్షేమ కమిషన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోడు పట్టాలున్న రైతులకు పంట రుణాలివ్వాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలో పోడు పట్టాలున్న 2.50 లక్షల గిరిజన రైతులకు రుణాలు పంట రుణాలు ఇవ్వడం వల్ల ఏజెన్సీ రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కమిషన్ తెలిపింది. ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులతో కమిషన్ సమావేశం నిర్వహించి, సమావేశంలో చర్చించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి కమిషన్ తీసుకెళ్లింది. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సభ్యులు గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, భూమి సునీల్ కుమార్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సిఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రితో భేటీ అయ్యారు. భూ భారతిలో ఈ పోడు పట్టాలున్న భూములు దాదాపు 7 లక్షల ఎకరాలను అనుసంధానం చేయాలని ముఖ్య కార్యదర్శి శేషాద్రికి కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి విజ్ఞప్తి చేశారు. విత్తనోత్పత్తి రైతులు ఎదుర్కుంటున్న సమస్యలు, నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్న విషయాలను సైతం శేషాద్రి దృష్టికి కమిషన్ బృందం తీసుకెళ్లింది. సమగ్ర విత్తన చట్టం వస్తేనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని వారు తెలియజేశారు. ప్రస్తుతం విత్తన చట్టం ముసాయిదా కమిటీ రూపొందిస్తున్న విత్తన చట్టంపై వారు చర్చించారు. అసైన్డ్ భూములకు పూర్తి పట్టా హక్కులు కల్పించే అంశం, కౌలుదారుల సమస్యలపై కూడా శేషాద్రితో కమిషన్ బృందం చర్చించింది. శేషాద్రిని కలిసిన వారిలో రైతు కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్, ఎఓ హరివెంకట ప్రసాద్ వున్నారు.

# రూ.35.56 కోట్ల సిఎంఆర్ ధాన్యం స్మగ్లింగ్

### రైస్‌మిల్లులపై విజిలెన్స్ అధికారుల దాడులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**నల్గొండ, కరీంనగర్, హన్మకొండ జిల్లాలలో రైస్ మిల్లులపై పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్ మిల్లు యజమానులు రూ.35.56 కోట్ల సిఎంఆర్ ధాన్యాన్ని దొంగ దారిలో మళ్లించినట్లు నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన వివరాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి శిఖాగోయల్ వెల్లడించారు. నల్గొండ జిల్లా కెతెపల్లి మండలం, ఉప్పలపహాడ్ గ్రామంలోని మెస్సర్స్ చాముండేశ్వరి ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో, మిల్లర్ రబీ సీజన్ 2022–23కి సంబంధించిన 1,39,671.86 క్వింటాళ్ల సిఎంఆర్ ధాన్యాన్ని దారి మళ్లించినట్లు తేల్చారు. ఈ బియ్యం విలువ రూ. 28,88,41,696 ఉంటుందని తెలిపారు.



### 100 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం స్వాధీనం

హనుమకొండ జిల్లా కమలాపూర్ వద్ద విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కమలాపూర్‌కు చెందిన రాజు చుట్టుపక్కల గ్రామస్థుల నుండి సేకరించిన 100 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని, రూ. 3,90,000 విలువైన దాన్ని అక్రమంగా ఎపి36ఎక్స్9537 డిసిఎం వాహనంలో రవాణా చేస్తున్నాడు. ఈ వాహనంతో పాటు పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

### కరీంనగర్‌లో...

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలోని రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కరీంనగర్ యూని ట్ అధికారులు రైస్ మిల్లులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. హుజురాబాద్ మండలంలోని రైస్ మిల్లుల ద్వారా భారీ మొత్తంలో సిఎంఆర్ ధాన్యాన్ని దారిమళ్లించ బడిదని తేలింది. పెద్దాపపయ్యపల్లి గ్రామంలోని మెసర్స్. శ్రీ రవి చంద్ర ఇండస్ట్రీస్ వద్ద ఆకస్మిక దాడులు నిర్వహించారు. మిల్లర్ రబీ 2022–23 మరియు 2024–25 సీజన్‌లకు సంబంధించిన 32207.8 క్వింటాళ్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) స్టాక్‌లను, రూ. 6.68 కోట్లు విలువైన దాన్ని దారి మళ్లించినట్లు నిర్ధారించారు. మరో కేసులో, హుజురాబాద్‌లో అక్రమంగాపిడిఎస్ బియ్యం నిల్వ ఉంచారనే నమ్మకమైన సమాచారం అందిన వెంటనే కరీంనగర్ విజిలెన్స్ యూనిట్ అధికారులు బోర్నపల్లి గ్రామంలోని విజయ కృష్ణ మోడరన్ రైస్ మిల్లుపై ఆకస్మిక దాడి నిర్వహించి, రైస్ మిల్లు యజమాని (లీజ్ హోల్డర్) వేముల మనోహర్, పద్మశాలి, లింగాపూర్ గ్రామం, శంకరపట్నం మండలం, కరీంనగర్ జిల్లా నివాసి వద్ద నుండి రూ. 8,34,400 విలువైన 238.40 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇక చౌటుప్పల్ టోల్ గేట్ మరియు చుట్టుపక్కల ప్రాంతాలలో ఆకస్మిక మార్గ తనిఖీ నిర్వహించి, వాహనాలను అడ్డగించి (11) కేసులను మోటారు వాహనాల చట్టం కింద, (2) కేసులను గనుల చట్టం కింద, మరియు (2) కేసులను జీఎస్టీ చట్టం కింద నమోదు చేశారు. ఈ వాహనాలకు మొత్తం రూ. 4,45,518 చలానా విధించారు.

## మొబైల్ ఫోన్‌ల రికవరీలో.. దేశంలోనే తెలంగాణ సిఐడి రికార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**చోరీకి గురైన..తప్పిపోయిన సెల్‌ఫోన్‌లను రికవరీ చేయడంతో దేశంలోనే తెలంగాణ సిఐడి పోలీసులు రికార్డు సాధించారు. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1,00,020 మొబైల్ ఫోన్స్ రికవరీ చేయడం ద్వారా రికార్డు సాధించామని సిఐడి అదనపు డిజి చారు సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. తప్పిపోయిన సెల్‌ఫోన్‌లను రికవరీ చేయడంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామన్నారు. మొబైల్ దొంగతనం, నకిలీ పరికరాలను ఎదుర్కోవడానికి టెలికమ్యూనికేషన్స్ విభాగం (డిఒటి), సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సిఇఐఆర్) పోర్టల్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో సిఇఐఆర్‌ను అమలు చేయడానికి సిఐడి తెలంగాణ నోడల్ ఏజెన్సీ, ఈ వ్యవస్థ ఇప్పుడు తెలంగాణలోని అన్ని 780 పోలీస్ స్టేషన్లలో పనిచేస్తోందని చారుసిన్హా పేర్కొన్నారు. సిఇఐఆర్ పోర్టల్ మొదటగా పైలట్ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీతో పాటు ఈశాన్య రాష్ట్రాలలో సెప్టెంబర్ 5, 2022న ప్రారంభించడం జరిగిందన్నారు. తెలంగాణలో సిఇఐఆర్ పోర్టల్ ఏప్రిల్ 19, 2023న అంటే పైలట్ రాష్ట్రాలలో ప్రారంభించిన 226 రోజుల తర్వాత ప్రారంభించడం జరిగిందన్నారు. ఆలస్యంగా ప్రారంభించినప్పటికీ, దొంగిలించబడిన లేదా పోగొట్టుకున్న మొబైల్ పరికరాల రికవరీలో తెలంగాణ దేశంలో 'అత్యున్నత పనితీరు' కలిగిన రాష్ట్రంగా అవతరించిందన్నారు. సిఇఐఆర్ డాష్‌బోర్డ్ ప్రకారం, తెలంగాణ సాటిలేని విజయాన్ని సాధించిందని, అక్టోబర్ 16,2025 వరకు 1,00,020 (ఒక లక్ష ఇరవై) మొబైల్ పరికరాల రికవరీని సాధించింది దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్రం సాధించిన ఈ అద్భుతమైన విజయం మొబైల్ పరికరాల రికవరీలో జాతీయ ప్రమాణాన్ని నెలకొల్పిందన్నారు.

## భూదాన్ భూములపై స్టే కొనసాగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్ భూములపై ఏప్రిల్‌లో ఇచ్చిన స్టే ఉత్తర్వులను రద్దు చేయాలని పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, ఇతరులు వేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో గత ఏప్రిల్ 24న స్టే ఉత్తర్వులు అమల్లో ఉండాల్సిందేనని చెప్పింది. సర్వే 181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలనే ఆదేశాలను సవరించేందుకు కూడా నిరాకరించింది. ప్రతివాదులుగా ఉన్న పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లపై ఆరోపణలు తీవ్రమైనవని గుర్తు చేసింది. అందులో ఒక ప్రతివాది రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా చేసినప్పుడు తీవ్రమైన ఆరోపణలున్నాయని చెప్పింది. కాబట్టి స్టే ఎత్తివేయాలని ఏఐఎస్‌లు దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్(ఐఏ)లను కొట్టివేస్తున్నట్లు జస్టిస్ లక్ష్మ ణ్ ప్రకటించారు. 181, 194, 195 సర్వే నెంబర్స్‌లోని భూమి కబ్జాకు గురైందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేష్ వేసిన పిటిషన్‌లో గతంలోని స్టే ఆదేశాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ భూములను విక్రయించడం, బదిలీ చేయడం వంటి చేయరాదని గతంలోనే ఆదేశిస్తే దీనిని కొందరు ఉన్నతాధికారులు డివిజన్ బెంచ్ వద్ద అప్పీల్ చేశారు. బెంచ్ ఆదేశాలు ఇవ్వలేదు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోమని చెప్పింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ ఇచ్చిన స్టే ఆదేశాలను రద్దు చేయాలన్న మధ్యంతర పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు సింగిల్ జడ్జి ప్రకటించారు. ఈ భూములపై తమకు పట్టాలున్నాయంటూ చిరంజీవి రాజు సహా 30 మంది వేసిన ఇంప్లీడ్ పిటిషన్లను విచారిస్తామని చెప్పింది. ఈ భూములపై విచారణ కమిషన్ వేయాలంటూ పడమటి తండాకు చెందిన రాములు దాఖలు చేసిన మరో పిటిషన్‌ను కొట్టివేసింది. నాగారంలోని సర్వే నంబర్ 194 భూమికి సంబంధించి మ్యుటేషన్ ప్రొసీడింగ్‌లు, పట్టాదార్ పాస్‌బుక్‌ల జారీ తదితర కాపీలను తాను మే 9న వినతిపత్రం సమర్పించినప్పటికీ రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బిర్లా మహేశ్ వేసిన మరో పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే, పత్రాల సర్టిఫైడ్ కాపీలను అందించడానికి నిర్దిష్ట అభ్యర్థనతో అధికారులకు తగిన దరఖాస్తును సీసీఎల్ఏకు చేసుకోవచ్చునని చెప్పింది. ప్రధాన కేసు విచారణను వాయిదా వేసింది.

## స్థానిక ఎన్నికలపై వివరణ ఇవ్వండి: హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికలను 50 శాతం రిజర్వేషన్లతో జరపాలంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం విచారించింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంపు జీవోపై స్టే జారీ, దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన ఎస్ఎల్‌పి డిస్మిస్ చేసిన నేపథ్యంలో ఎన్నికలపై ఏం చర్యలు తీసుకునేదీ చెప్పాలని రాష్ట్రం, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌లను వివరణ కోరింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. స్థానిక ఎన్నికల ప్రక్రియను సస్పెండ్ చేస్తూ ఈనెల 9న ఎస్ఈసీ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను అడ్వకేట్ సురేందర్ సవాల్ చేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ శుక్రవారం విచారించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ జారీ చేసిన జీవోను మాత్రమే హైకోర్టు స్టే విధించిందని, ఎన్నికల నోటిఫికేషన్‌పై కాదని, కాబట్టి పాత రిజర్వేషన్ల విధానంలో ఎన్నికలు నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ లాయర్ కోరారు. హైకోర్టు స్టే తర్వాత సుప్రీంకోర్టు ఎస్ఎల్‌పిని కొట్టివేసిన తరుణంలో తాము రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని ఎలక్షన్ కమిషన్ కౌన్సిల్ విద్యాసాగర్‌రావు చెప్పారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి అనుగుణంగా స్థానిక పదవుల రిజర్వేషన్ల వర్గీకరణ జరిగిందని, తాజా తీర్పుల నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లు 25 శాతంతో పదవుల వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సివుందన్నారు. దీంతో ఎన్నికలపై ఏం చేయబోయేదీ చెప్పాలన్న డివిజన్ బెంచ్ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## కువైట్‌లో 225.5 మిలియన్ డాలర్ల ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ సాధించిన ఎంఇఐఎల్

### శుద్ధ ఇంధన సాధనకు భారీ ప్రాజెక్ట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తన ఇంజినీరింగ్ ప్రతిభను ప్రపంచవ్యాప్తంగా చాటుకున్న మేఘా ఇంజినీరింగ్ అండ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్ ) కువైట్ ఆయిల్ కంపెనీ (కెఒసి ) నుంచి 225.5 మిలియన్ అమెరికన్‌డాలర్ల( 69.23 మిలియన్ కువైట్ దినార్లు ) విలువైన ప్రాజెక్ట్ ఆర్డర్‌తో మరో అంతర్జాతీయ మైలురాయిని అధిగమించింది. కెఒసి బూస్టర్ స్టేషన్ బిఎస్ 171 సమీపంలో ఈ ప్లాంట్ ను 790 రోజుల్లో ఎం ఈ ఐ ఎల్ నిర్మించి ఆ తరువాత ఐదు సంవత్సరాల పాటు నిర్వహిస్తుంది. బిల్డ్ ఓన్ ఆపరేట్ పద్ధతిలో వెస్ట్ కువైట్ ఆయిల్ ఫీల్డ్స్‌లో కొత్త గ్యాస్ స్వీటెనింగ్, సల్ఫర్ రికవరీ ఫెసిలిటీ (ఎన్ జి ఎస్ ఎఫ్ ) రూపకల్పన, నిర్మాణ, నిర్వహణ, సంరక్షణ బాధ్యతలను ఎం ఈ ఐ ఎల్ చేపట్టనుంది. కువైట్ ఆయిల్ కంపెనీ భవిష్యత్ లో బై బ్యాక్ చేసే అవకాశం ఉన్నఈ ప్రాజెక్టును రెండు దశల్లో ఎం ఈ ఐ ఎల్ చేపట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా సల్ఫర్ రికవరీ యూనిట్ (ఎస్‌ఆర్‌యు) ను రెండు ప్రాసెసింగ్ ట్రైన్లతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎం ఈ ఐ ఎల్ నిర్మిస్తుంది. ఈ ట్రైన్ ఒక్కోటి రోజుకు 100 టన్నుల (టిపిడి) సామర్థ్యంతో పని చేస్తుంది. ఈ యూనిట్ పూర్తి ఐన తరువాత 99.9 శాతం సల్ఫర్ రికవరీ సామర్థ్యంతో అత్యున్నత ప్రమాణాలను చేరుకోనుంది. ఎస్ ఆర్ యూ లో నాలుగు శాతం హైడ్రోజన్ స్ఫడ్ పది శాతం వరకు కార్బన్ డైఆక్సైడ్ ఉన్న 120 మిలియన్ స్టాం డర్డ్ క్యుబిక్ ఫీట్ల (ఎంఎంఎస్‌సిఎఫ్‌డి ) సార్ గ్యాస్ ను శుద్ధి చేసే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంఈఐఎల్ ఏర్పాటు చేయనుంది. సహజ వాయువులోని తేమను తొలగించి, పర్యావరణానుకూలమైన, శుభ్రమైన, వినియోగానికి సురక్షితమైన దిగామార్చే గ్యాస్ స్వీటెనింగ్ ప్రక్రియను ఇక్కడ ఎంఈఐఎల్ నిర్మించనుంది. ఇక్కడ శుద్ధి చేసిన గ్యాస్‌ను కేఓసీ పైప్ లైన్ నెట్‌వర్క్ ద్వారా మినా అహ్మది రిఫైనరీ దగ్గర ఉన్నఎల్పీజీ ప్లాంట్‌కి తరలించి మిగిలిన ప్రక్రియలను కొనసాగిస్తారు ఈ ప్రాజెక్ట్ కువైట్ ప్రభుత్వ నాణ్యమైన ఇంధన ఉత్పత్తి, పర్యావరణ భద్రత , స్థిరమైన ఇంధన విధానంకు మద్దతు ఇవ్వనుంది. కువైట్‌ఆయిల్‌కంపెనీ ఆర్డర్ సాధించిన నేపథ్యం లో ఎంఇఐఎల్ డైరెక్టర్ పి . దొరయ్య మాట్లాడుతూ.. పశ్చిమ కువైట్ లోని ఈ వ్యూహాత్మక గ్యాస్ స్వీటెనింగ్ ఫెసిలిటీ నిర్మాణంలో భాగస్వామ్యం అవ్వడం గర్వకారణమని అన్నారు.



### భైంసాలో పెయింటర్ వర్కర్ల పని భద్రత సమస్యకు...

## రాష్ట్ర యూనియన్ పరిష్కారం

**భైంసా :** పనిభద్రత విషయంలో భైంసా పెయింటర్ వర్కర్లు, ఇతర రాష్ట్రాలకు చెందిన పెయింటర్ల మధ్య చోటుచేసుకున్న సమస్య శుక్రవారం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ఎఎల్ఓ)వినోద్ ఏల్లో, తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం,పెయింటర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారగోని ప్రవీణ్ కుమార్, స్థానిక నాయకుల సమక్షంలో పరిష్కారమైంది. గురువారం జరిగిన సమావేశానికి భైంసా పెయింటర్ వర్కర్లు, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ నుండి వచ్చిన కార్మికులను పిలిచి సమస్యలపై సమగ్రంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. వారు రిజిస్టర్డ్ పెయింటర్ వర్కర్స్ యూనియన్‌లో సభ్యత్వం తీసుకుని, సభ్యత్వం చెల్లించాలని, స్థానికులు 70శాతం, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు 30శాతం పనులను తీసుకోవాలని, ప్రతీ కాంట్రాక్టర్ 5గురు కార్మికులు మించకుండా పనిలో నియమించుకోవాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారగోని ప్రవీణ్‌కుమార్ సమక్షంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది. సమావేశం నిర్ణయాలను ప్రవీణ్‌కుమార్, భైంసా యూనియన్ నాయకులు శుక్రవారం భైంసా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినోద్ ఏల్లోకు వివరించారు. సమస్యలపై పెయింటర్లు అందరూ శాంతియుత వాతావరణంలో చర్చించుకుని, నిర్ణయాలు తీసుకోవడంలో యూనియన్ నాయకత్వం ముఖ్యపాత్ర వహించడాన్ని ఎఎల్ఓ వినోద్ అభినందించారు. ప్రవీణ్ ఎఎల్ఓ వినోద్ ఏల్లోకు ధన్యవాదాలు తెలియజేశారు. యూనియన్ సలహాదారు లతీఫ్, పెయింటర్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జావేద్, ఉపాధ్యక్షుడు అనిల్‌సింగ్, జిల్లా కార్యదర్శి మోసిన్, కార్మికులు పాల్గొన్నారు.

## త్యాగాలకు ప్రతిరూపమే పోలీసింగ్

### బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) డిజి దల్జిత్ సింగ్ చౌదరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసింగ్ అంటేనే త్యాగాలకు మారుపేరు అని బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) డిజి దల్జిత్ సింగ్ చౌదరి పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన ఐపిఎస్ అధికారులు దేశానికి సేవ చేయడం ప్రారంభించేటప్పుడు సమగ్రత,కరుణ,ధైర్యాన్నికాపాడుకోవాలని దల్జిత్‌సింగ్ చౌదరి పిలుపు నిచ్చారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్‌విపిఎన్‌పిఎ)లో శుక్రవారం జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా ఐపిఎస్ శిక్షణ పూర్తిచేసుకున్నయువఐపిఎస్‌లనుఉద్దేశించి దల్జిత్‌సింగ్ చౌదరి ప్రసంగించారు. 'పోలీసింగ్ కేవలం ఒక వృత్తి కాదు, త్యాగంతో కూడిన విధులు అని అన్నారు. 'సంప్రదాయం త్యాగాలతో నిండిన ఈ నేల, తరతరాలుగా నాయకులను తయారుచేసింది. నేడు, ఆ వారసత్వంలోకి అడుగు పెట్టడం మీ వంతు' అనిఆయనఆఫీసర్‌ట్రైనీలతోఅన్నారు,పరేడ్‌కమాండర్ అంజిత్ ఎ.నాయర్ పాల్గొన్న వారందరిని ఆయన ప్రశంసించారు. 1948లో ప్రారంభమైనప్పటి నుండి ఇండియన్ పోలీస్ సర్వీస్ ఉగ్రవాద వ్యతిరేకత,వామపక్షతీవ్రవాదం నుండి సైబర్ నేరం, ఆర్థిక మోసం, రాడికలైజేషన్ వరకు కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి నిరంతరం అభివృద్ధిచెందుతూ,ఈ సేవ చట్టం, న్యాయానికి మూలస్తంభంగా నిలిచిందని చౌదరి అన్నారు. రోజు రోజుకు వస్తున్న కొత్త సవాళ్లను యువ అధికారులు ధైర్యం, సానుభూతి,వృత్తి నైపుణ్యంతో ఎదుర్కోవాలని ఆయన కోరారు.జవాబుదారీగావిశ్వసనీయంగా ప్రతిస్పందించేలా విధులు నిర్వహించాలని సూచించారు. సమర్థవంతమైన పోలీసింగ్ అంతిమంగా ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటుందని దీన్ని దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ప్రతి యువ ఐపిఎస్‌లకు ఉందని గుర్తు చేశారు. 'ఒక పౌరుడికి పోలీస్ స్టేషన్ మొదటి సంప్రదింపు స్థానం. దాని పనితీరు అన్నింటికంటే ఎక్కువగా మీ నాయకత్వాన్ని ప్రతిబింబిస్తుంది' అని ఆయన అన్నారు. 'మీరు బలంగా, అప్రమత్తంగా, స్థితిస్థాపకంగా ఉంటే, మీరు మీ బృందానికి స్ఫూర్తినివ్వగలరు దాంతో పాటు దేశానికి నిరంతర శక్తితో సేవ చేయగలరు' అని ఆయన అన్నారు. అకాడమీ అధ్యాపకులు, సిబ్బంది అంకితభావానికి అభినందనలు తెలిపారు. అంతకుముందు ఎస్‌విపిఎన్‌పిఎ డైరెక్టర్ అమిత్ గార్గ్ మాట్లాడుతూ.. 62మంది మహిళలు, 16 మంది విదేశీ శిక్షణార్థులతో సహా 174 మంది అధికారులతో కూడిన 77వ రెగ్యులర్‌రిక్రూట్‌బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వడంలో అకాడమీ గర్వంగా ఉందన్నారు.45వారాల కార్యక్రమం ఇంటరాక్టివ్ లెర్నింగ్, సిమ్యులేషన్స్, ఫీల్డ్ వ్యాయామాల ద్వారా వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించిందని ఆయన అన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత,భారతీయ సాక్ష్యా అధినియం అనే కొత్త క్రిమినల్ చట్టాలతో నవీకరించబడిన పాఠ్యాంశాలుసిద్ధాంతాన్ని మిళితం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. శిక్షణలో కీర్తి యాదవ్ (ఎజిఎంయుటి) ఉత్తమ అవుట్‌డోర్ ప్రొబేషనర్‌గా స్వోర్డ్ ఆఫ్ ఆనర్‌తో పాటు ఉత్తమ లేడీ ప్రొబేషనర్‌గా డైరెక్టర్ ట్రోఫీనిగెలుచుకున్నారు.ఈక్విటేషన్ కోసం మంధారే సోహమ్ సునీల్ (తెలంగాణ) టోంక్ కప్‌ను అందుకున్నారు. పోలీస్ సైన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు అశ్విని ఎస్ (తమిళనాడు) ఎన్‌ఎఫ్‌ఎస్‌యు ట్రోఫీని అందుకున్నారు.

## 42 శాతం రిజర్వేషన్ సాధించి తీరుతాం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం శుక్రవారం సిపిఐ(ఎం) రాష్ట్ర తలపెట్టిన ఛలో రాజ్‌భవన్ తీవ్ర ఉద్రిక్తంగా మారింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ నుంచి సోమాజీగూడ వరకు ర్యాలీగా వెళ్లి గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు వెళ్తున్న సిపిఐ(ఎం) నాయకులు, కార్యకర్తలను పోలీసులు మెట్రో రెసిడెన్సీ వద్ద అడ్డుకున్నారు. అప్పటికే బారికేడ్లు వేసి ముందుకు వెళ్లకుండా నిలిపివేయడంతో నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో బారికేడ్లను తొలగించుకుని వెళ్లేందుకు కార్యకర్తలు చేసిన ప్రయత్నాలను పోలీసులు భగ్నం చేశారు. అడ్డుకున్నారు. అక్కడి నుంచి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలో ప్రతినిధి బృందాన్ని మాత్రం వెళ్లనిచ్చినప్పటికీ రాజ్‌భవన్ గేటు వద్దే లోపలికి వెళ్లకుండా భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో వారు అక్కడే బైఠాయించారు. బిసిలకు వ్యతిరేకంగా గవర్నర్ మొండి వైఖరితో వ్యవహరిస్తున్నారని నిరసిస్తూ అపాయింట్ మెంట్ ఇచ్చేంత వరకు కదిలేదిలేదనిభీష్మించుకు కూర్చుకున్నారు. కేంద్ర ప్రభు త్వ, బిజెపి బిసి వ్యతిరేక విధానాలు వీడాలని నినాదాలు చేశారు. గవర్నర్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని నినదించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కొద్ది సేపటి తర్వాత పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి వాహనాల్లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, నాయకులు ఎస్.వీరయ్య, మహ్మద్ అబ్బాస్, టి.జ్యోతి, టి.సాగర్, నంద్యాల నర్సింహారెడ్డి, బండారు రవికుమార్, డి.జి.నరసింహారావు, ఎం.వి. రమణ, పి.ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

### చర్చించేందుకు సిద్ధంగా లేని గవర్నర్: జాన్ వెస్లీ

రాజ్‌భవన్ వద్ద బైఠాయించిన సందర్భంగా జాన్ వెస్లీ మీడియాతో మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సిద్ధంగా లేని గవర్నర్ దానిపై కనీసం చర్చించేందుకు కూడా ఇష్టపడటం లేదని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన గవర్నర్ కేంద్రానికి అనుకూలంగా ఉంటున్నారని, నెలన్నరకు పైగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బిసిలకు, సామాజిక న్యాయానికి, రిజర్వేషన్లకు వ్యతిరేక వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు. మనువాదంతో వ్యవహరిస్తూ కలిసేందుకు నిరాకరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గవర్నర్ తీరు మార్చుకోకుంటే ఆయన బదిలీ కోరాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

శబరిమల ఆలయ బంగారం కేసు...

## ప్రధాన నిందితుడు అరెస్ట్

**తిరువనంతపురం :** శబరిమల ఆలయంలో విగ్రహాల బంగారం తాపడం బరువు తగ్గిన ఉదంతంలో కీలక పరిణామం జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పాట్టిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త పాట్టిని తన నివాసమైన పులిమత్ నుంచి అదుపులోకి తీసుకున్నట్లు (సిట్) అధికారులు పేర్కొన్నారు. అనంతరం తిరువనంతపురంలోని క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలో విచారించారని సిట్ వర్గాలు తెలిపాయి. గురువారం రాత్రి తిరువనంతపురం జనరల్ హాస్పిటల్‌లో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం కోర్టు ముందు ఆయన్ను హాజరుపరచనున్నారు. తదుపరి విచారణ కోసం సిట్ ఆయన్ను కస్టడీకి కోరే అవకాశం ఉంది.ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ఇంజనీర్ కె.సునీల్ కుమార్‌ను, ట్రావెన్‌కోర్ దేవస్థానంబోర్డు అధ్యక్షుడు పిఎస్ ప్రశాంత్ గతంలో సస్పెండ్ చేశారు. కాగా ఈ వివాదంలో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న రిటైర్డ్ అధికారులకు షో కాజ్ నోటీసులు పంపనున్నట్లు తెలిపారు.

విద్యను విజయసాధనకు మాత్రమే కాకుండా..

# సేవకు కూడా ఉపయోగించుకోండి

పూర్వ విద్యార్థినిగా హిందూ కళాశాల 126 ఏళ్ల వేడుకలలో శ్రీలంక ప్రధాని కీలక ప్రసంగం

కళాశాలలో తన పాత తరగతి గదిని సందర్శించి జ్ఞాపకాలు నెమరేసుకున్న అమరసూరియా

శ్రీలంక ప్రధానమంత్రి అమరసూరియా ఉద్బోధ



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ప్రఖ్యాత హిందూకళాశాలలో గురువారం ఒక అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ కళాశాల పూర్వ విద్యార్థిని ఒక దేశానికి ప్రధానమంత్రిగా ఉం డి ఒకప్పుడు తాను చదువుకున్న డిగ్రీకళాశాలను ముఖ్యఅతిథిగా సందర్శించింది. 90'ల ప్రారంభంలో భారతదేశంలో సరళీకరణ అనంతర యుగం ప్రారంభమై, స్మార్ట్ ఫోన్‌లు చాలా సంవత్సరాల దూరంలో ఉన్నప్పుడు ఒక యువ శ్రీలంక విద్యార్థిని ఢిల్లీలోని హిందూ కళాశాలకు వచ్చింది. అక్కడ విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకున్న ఆమె కలలు, ఆశలు కొంచెం భయాన్ని కూడా వెంట తీసుకెళ్లింది. ఆ విషయం అంతటితో ముగిస్తే.. .శ్రీలంక దేశానికి ప్రస్తుతం 16వ ప్రధానమంత్రిగా ఉన్నటువంటి హరిణి అమరసూరియా ఒకప్పటి హిందూ కళాశాల పూర్వ విద్యార్థిగా చదువు పూర్తి చేసుకుని స్వదేశానికి వెళ్లింది. ఆమె అక్కడ సామాజికవేత్తగా, విద్యావేత్తగా, ఉద్యమకారిణిగా, రాజకీయనేతగా ఎదిగి శ్రీలంకలో అత్యున్నత హోదాలో ప్రధానమంత్రిపదవిని కైవసం చేసుకుని భారతదేశంలోని ప్రతిష్ఠాత్మక హిందూ కళాశాలకు గురువారం ఉత్సవ కాన్వాయ్‌లో చేరుకుంది. హిందూ కళాశాల పాలనా యంత్రాంగం దీనిని ఒక అపూర్వ ఘట్టంగా అభివర్ణించింది. విశిష్ట పూర్వ విద్యార్థిగా అమరసూరియా రాక 'అద్భుతమైనరీతిలో స్వదేశానికి తిరిగి రావడం' అని వ్యాఖ్యానించింది. ఢిల్లీ యూనివర్సిటీ కళాశాలలోని విశాలమైన క్యాంపస్‌లో అమరసూర్య రెండు గంటల పాటు గడిపింది. ఆమె తన క్లాస్ రూమ్ నెంబర్ 27 వద్దకు తిరిగి వచ్చి ఒక డెస్క్ వద్ద కూర్చుంది. అక్కడ ఆమె మూడు దశాబ్దాల క్రితం తన జీవితంలోని నిర్మాణాత్మక సంవత్సరాలు గడిపిన మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ ఆనందపరవశురాలైంది. అమరసూరియా1991సంవత్సరం నుండి 1994వరకు ఢిల్లీ హిందూకళాశాలలో సోషియాలజీలో బ్యాచిలర్స్ డిగ్రీని అభ్యసించింది. ఈ సందర్శన అంతటికీ స్వాగతం పలికి ఆమెతోపాటు తోడుగా ఉన్న హిందూ కళాశాల ప్రిన్సిపల్ అంజు శ్రీవాత్సవ హరిణి అమరసూరియా సందర్శన సందర్భంపై వ్యాఖ్యానిస్తూ 126 ఏళ్ల ఘనచరిత్రను కలిగిన హిందూ కళాశాలకు 'ఒక గర్వకారణమైన క్షణం'గా 'ఒక మైలురాయి సందర్భం'గా అభివర్ణించారు. భారత్‌శ్రీలంక రెండు దేశాల మధ్య విద్యా సహకారాన్ని బలోపేతం చేయడానికి ఇది ఒక పునాదిగా ఉపయోగపడుతుందనిఅనుభూతిచెందారు.పర్యటన తర్వాత కొద్ది సేపటికి 'పిటిఐ'తో ఆమె సంభాషించారు. హిందూ కళాశాల శ్రీలంకతో మార్పిడి కార్యక్రమంతో పాటు పరిశోధనా సహకారాన్ని కోరుతోందని అన్నారు. ఈ సందర్శన సందర్భంగా తాను శ్రీలంక ప్రధానమంత్రి అమరసూరియాతో జరిపిన ఇష్టాగోష్ఠి భేటీలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చిందని హిందూ కళాశాల ప్రిన్సిపల్ అంజు శ్రీవాత్సవ చెప్పారు. 'మేం అమరసూరియాతో ఈ విషయాన్ని మాట్లాడాం. దీనికి సంబంధించిన వివరాలు తర్వాత మాత్రమే వస్తాయి. కానీ మేం ఆమెతో మార్పిడి కార్యక్రమం పరిశోధన కోసం సహకారం రెండింటి విషయమై ఆమెతో కొంత సంభాషణలోకి వెళ్లాం. ఇంతకుముందు కూడా మేం ఆమెకు ఒక ప్రతిపాదన పంపాం. ఆమె దానిని చాలా చాలా తీవ్రంగా పరిగణనలోనికి తీసుకుంటామని భరోసా ఇచ్చారు' అని ప్రిన్సిపల్ శ్రీవాత్సవ 'పిటిఐ'కి వెల్లడించారు. సంగనేరియా ఆడిటోరియం వద్ద విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన తర్వాత, ఎన్‌సిసి క్యాడెట్ల గౌరవవందనం స్వీకరించిన అనంతరం ఆమెకు రెడ్‌కార్పెట్ స్వాగతం పలికారు. అమరసూర్య తన పాత తరగతి గదిని సందర్శించి ఉపాధ్యాయులతో, ప్రస్తుత విద్యార్థులతో సంభాషించింది. ఆమె సాధించిన విజయాలకు గుర్తింపుగా అమరసూరియా పేరును సోషియాలజీ విభా గం యొక్క సామాజిక, జాతి శాస్త్ర పరిశోధన ప్రయోగశాలకు అతికించారు. ఆమె దానిని సందర్శించి అక్కడ ఒక ఫలకాన్ని ఆవిష్కరించారు. సోషియాలజీ విభాగంలో తృతీయ సంవత్సరం విద్యార్థిని ఆకృతి కోరి శ్రీలంక ప్రధానమంత్రి హరిణి అమరసూరియాకు తన నలుపు, తెలుపు స్కెచ్ చిత్రపటాన్ని బహుమతిగా ఇచ్చి ఉత్సాహంతో, గర్వంతో పొంగిపోయింది. అమరసూర్య మాట్లాడుతూ 1990లలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసిసిఆర్) స్కాలర్‌షిప్ ద్వారా తాను ఢిల్లీకి వచ్చానని, అక్కడ కలలు, అనిశ్చితులు, ఆశలు, ప్రశ్నలు, కొంచెం భయాందోళనలను నావెంట తీసుకెళ్లాను. ఈరోజు నేను అదే గేట్ ద్వారా హిందూ కళాశాలలోకి ప్రవేశించినప్పుడు సొంతదేశ భ్రాంతి, ప్రశంసలతో నేను నిండిపోయాను' అని భావోద్వేగంతో చెప్పారు. హిం దూ కళాశాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుత శ్రీలంక ప్రధానమంత్రి అయిన హరిణి అమరసూర్య20 నిమిషాలపాటు విద్యార్థులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో తాను విద్యార్థినిగా ఉన్నప్పుడుజైసింగ్ టీ స్టాల్‌ను సందర్శించిన సందర్భాన్ని, అసమానత,స్త్రీవాదం, మానవతావాదం, సినిమాలు, రాజకీయాలు, నాటకరంగంపై కళాశాల పచ్చిక బయళ్లలో ఇతర విద్యార్థులతో జరిగిన లెక్కలేనన్ని సమావేశాలను గుర్తు చేసుకుంటూ, ఆమె హిందూకళాశాలలో పూర్వ విద్యార్థినిగా తన జ్ఞాపకాలను పంచుకున్నారు. 2020లో తాను రాజకీయాలలోకి రావడాన్ని కొందరు ఒక ఎత్తుగడగా అభివర్ణించలేదని, అది విద్యావిస్తరణను వదిలి వేయడం కాదని అన్నారు. ది హిందూ నాలో నాటబడిన విద్యాపరమైన అభిప్రాయాలు నాకు ఎప్పుడూ దూరంగా లేవు అని గర్వంగా చెప్పిన ఆ పూర్వ విద్యార్థినిని ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో ముంచెత్తారు. ఆమె జ్ఞాపకాలను మరింత పెంచేందుకు హిందూ కళాశాల పాలకవర్గం ఆమె కోసం విందు ఏర్పాటు చేసింది.విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారులు, ప్రిన్సిపల్, 1990లలో ఆమె విద్యార్థిగా ఉన్నప్పుడు బోధించిన కొం తమంది ఉపాధ్యాయులు, కళాశాల పార్లమెంట్ ప్రధానమంత్రి కూడా పాల్గొన్నారు. 'హిందూ కళాశాలలో విద్య ఒక బహుమతి. కానీ అది ఒక బాధ్యత. దానిని తెలివిగా ఉపయోగించుకోండి. గోడలు కాదు, వంతెనలను నిర్మించడానికి విద్యను ఉపయోగించండి.విభజనలను మరింతగా పెంచడానికి కాకుండావాటిని నయం చేయడానికి విద్యను ఉపయోగించండి. విద్యను విజయం సాధించడానికి మాత్రమే కాకుండా దానిని సేవ చేయడానికి కూడా ఉపయోగించుకోండి' అని ప్రధాని అమరసూరియా ఉద్బోధించారు.

# ఆర్‌ఎస్‌ఎస్‌లో లైంగిక వేధింపులపై దర్యాప్తు

ఎన్‌హెచ్‌ఆర్‌సికి రాసిన లేఖలో సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ డిమాండ్



**న్యూఢిల్లీ:** కేరళలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త మరణం, ఆ సంస్థలో లైంగిక వేధింపుల ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంపి సందోష్‌కుమార్ శుక్రవారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ వి.రామసుబ్రమణ్యంకు లేఖ రాశారు. ఆనందు అజి మరణానికి దారితీసిన పరిస్థితులను ప్రస్తావించారు. అజి ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నారని, అయితే ఇక్కడ 'తీవ్రమైన' మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని రాజ్యసభ ఎంపి సందోష్‌కుమార్ ఆ లేఖలో ఆరోపించారు. కమిషన్ పర్యవేక్షణలో 'తక్షణ, స్వతంత్ర, పారదర్శక విచారణ' కు ఆయన డిమాండ్ చేశారు. కొట్టాయం జిల్లాలోని తంపలక్కాడ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అజి అక్టోబరు 9న తంపనూర్‌లోని ఒక లాడ్జిలో చనిపోయాడు. ఒకరోజు తర్వాత అతని ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక పోస్ట్ కనిపించింది. అందులో అతను తన మరణానికి ఆర్‌ఎస్‌ఎస్‌ను బాధ్యులుగా పేర్కొన్నాడు. అతని కుటుంబానికి దగ్గరగా ఉన్న వ్యక్తి చిన్నప్పటి నుంచి తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపించాడు. అజి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్త. ఆ సంస్థతో చాలాకాలంగాఅనుబంధం ఉన్న కుటుంబానికి చెందినవాడు. 'ఆనందు అజీ మరణం విషాదకరం. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోని అనేక మంది సభ్యులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ అజి తన చివరి సోషల్ మీడియా పోస్ట్‌లో చేసిన తీవ్రమైన విషయాలు, జాతీయ మానవ హక్కుల కమిషన్ తక్షణ జోక్యాన్ని కోరుతున్నాయి' అని సిపిఐ ఎంపి పేర్కొన్నారు. 'నిర్దిష్ట ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను పేర్కొంటూ ... ఆర్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో తరచూ జరిగే దుర్వినియోగ ఘటనలను ప్రస్తావిస్తూ బాధితుడు అజి చేసిన బహిరంగ ప్రకటన కేరళ, వెలుపల దిగ్భ్రాంతిని కలిగించింది. అజి పోస్ట్‌లోని విషయాలు కేవలం ఒక వ్యక్తిగత విషాదాన్ని వెల్లడి చేయడమే కాకుండా, సంస్థలోని కొన్ని విభాగాలలో పని చేస్తున్న పెద్ద, వ్యవస్థీకత, లోతుగా దోపిడీ సంస్కతి ఉనికిని సూచిస్తున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఒక ప్రత్యేక దర్యాప్తు బందాన్ని ఏర్పాటు చేయాలని లేదా అజి మృతికి సంబంధించి తక్షణ పరిస్థితులపై, ఆర్‌ఎస్‌ఎస్‌పై ఆరోపించబడిన లైంగిక దోపిడీ, బలవంతానికి చెందిన విస్తత వ్యవస్థ రెండింటిపై కాలానుగుణంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు చేయడానికి తగిన సంస్థను ఆదేశించాలని అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. మరణించిన వ్యక్తి తన పోస్ట్‌లో పేర్కొన్న వ్యక్తులందరినీ దర్యాప్తు పరిధిలోకి తీసుకురావాలని, సాక్షుల రక్షణ, గోప్యత, బాధితులకు మానసిక సహాయం అందించడానికి ప్రతి ప్రయత్నం చేయాలని సంతోశ్ కుమార్ కోరారు. 'విచారణ కేవలం నేరపూరిత నేరాన్ని నిర్ధారించడంపై మాత్రమే దష్టి పెట్టకూడదు. సంస్థ, దాని అనుబంధ నిర్మాణాలలో నేరస్థుల బెదిరింపు, సంస్థాగత రక్షణ క్రమబద్ధమైన నమూనా ఉందా అని కూడా పరిశీలించండి' అని విజ్ఞప్తి చేశారు. ప్రజల పరిశీలనకు మించి తరచుగా పని చేసే అటువంటి సంస్థల పనితీరు, అంతర్గత సంస్కతిపై జాతీయ శ్రద్ధ అవసరమని తీవ్ర బాధ కలిగించే ఈ కేసు నొక్కి చెబుతుందన్నారు. 'ఎన్‌హెచ్‌ఆర్‌సీ ద్వారా నిర్భయమైన, సున్నితమైన విచారణ భారతదేశం మానవ హక్కులు, న్యాయం పట్ల నిబద్ధతకు బలమైన ధ్రువీకరణగా ఉపయోగపడుతుంది. ప్రభావవంతమైన స్థానాల్లో ఉన్నవారు లైంగిక హింస, దోపిడీ చర్యలకు జవాబుదారీతనం నుంచి తప్పించుకోకుండా చూసుకోవాలి' అన్నారు. కమిషన్ వెంటనే గ్రహించి ఆలస్యం లేకుండా స్వతంత్ర విచారణను ప్రారంభించాలని కోరారు.

## నగదు, మద్యం, డ్రగ్స్‌పై నివారణ చర్యలు తీసుకోండి

బిహార్‌లో భద్రతా దళాలకు ఎన్నికల సంఘం విజ్ఞప్తి




**న్యూఢిల్లీ :** బిహార్ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టడానికి మాదకద్రవ్యాలు, మద్యం, నగదు ఉపయోగించకుండా చూసుకోవడానికి ముం దస్తు, నివారణ చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, భద్రతా దళాలను కోరిం ది. ఎన్నికలలో నగదు, ఇతర ప్రలోభాల హానికరమైన ప్రభావాలను ఎదుర్కోవడానికి సమగ్ర రోడ్‌మ్యాప్‌ను రూపొందించడానికి భద్రతా దళాలతలో సమావేశమైనట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ప్రలోభాల రహిత ఎన్నికల నిర్వహణకు గానూ తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన ప్రతిపాదనల గురించి వివిధ సంస్థలు కమిషన్‌కు వివరించాయి. ఎన్నికలను దెబ్బతీసేందుకు డబ్బు, ఇతర ప్రలోభాల వినియోగాన్ని అరికట్టడానికి సంబంధించిన విస్తృత శ్రేణి అంశాలపై వివరించాయని ఇసి తెలిపింది. సమర్థవంతమైన చర్య కోసం చట్ట అమలు సంస్థల మధ్య ఆర్థిక నేరాల నిఘా సహకారం, భాగస్వామ్యం ఉండాలని కమిషన్ సూచించింది. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో వివిధ స్థాయిలలో ప్రతి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలో అంతర్గత ఏజెన్సీ సమన్వయాన్ని గుర్తుచేసింది. నకిలీ కరెన్సీ, అంతర్‌రాష్ట్ర సరిహద్దులు, అంతర్జాతీయ సరిహద్దులతో సహా అక్రమ రవాణా వస్తువులు, మాదకద్రవ్యాలు, మద్యం, నగదు రవాణాను తనిఖీ చేయడానికి సంబంధిత ఏజెన్సీలు నియోజకవర్గాలను మ్యాప్ చేయాలని కూడా కమిషన్ ఆదేశించింది. బిహార్‌లో స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా 'జీరోటాలరెన్స్' విధానాన్ని నిర్ధారించాలని ఏజెన్సీలను కోరారు. ఎన్నికల సమయంలో ప్రతి చట్ట అమలు సంస్థ ద్వారా చురుకైన, నివారణ చర్యలను నిర్ధారించడం లక్ష్యంగా, అభ్యర్థులు, రాజకీయ పార్టీల రహస్య ఖర్చులను అరికట్టే వ్యూహా న్ని ఇసి చర్చించింది. సమర్థవంతమైన చర్య కోసం చట్ట అమలు సంస్థల మధ్య ఆర్థిక నేరాల నిఘా సహకారం, భాగస్వామ్యాన్ని కూడా ఇది మెరుగుపరిచింది.

## అస్సాం ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రదాడి..

ముగ్గురు సైనికులకు గాయాలు



**గువహటి :** ఈశాన్య రాష్ట్రం అసోంలో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. తిన్సుకియా జిల్లాలోని కాకోపథర్‌లో గల భారత ఆర్మీ శిబిరంపై ఉగ్రదాడి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గ్రెనేడ్‌లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ దాడిలో ముగ్గురు సైనికులు గాయపడ్డారు. ఈ దాడి వెనుక యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం–ఇండిపెండెంట్ (ఉల్ఫాఐ) హస్తం ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ దాడితో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది.. గాయపడిన సైనికులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలం చుట్టూ 2 నుంచి 3 కి.మీ మేర పరిధిని మూసివేసి పౌరుల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. దాడికి పాల్పడిన వ్యక్తులు దూమ్‌దూమా దిశ నుండి ట్రక్కులో వచ్చి ఆటోమేటిక్ ఆయుధాలను ఉపయోగించి కాల్పులు జరిపినట్లు గుర్తించారు. అనంతరం వారు అరుణాచల్ ప్రదేశ్ వైపు పారిపోయారని సంబంధిత వర్గాలు తెలిపాయి. వారి కోసం భద్రతా సిబ్బంది గాలింపు చేపట్టింది. దాడికి ఉపయోగించినట్లు భావిస్తున్న ఓ ట్రక్కును పొరుగున ఉన్న అరుణాచల్ ప్రదేశ్‌లోని టెంగపాని ప్రాంతంలో దుండగులు విడిచి పెట్టినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఆ ట్రక్‌ను ఫోరెన్సిక్ బృందాలు పరిశీలిస్తున్నాయి. గురువారం అరుణాచల్ ప్రదేశ్‌లోని మన్‌మావ్‌లో అసోం రైఫిల్స్ దళాలపై ఉల్ఫాఐ తిరుగుబాటుదారులు మెరుపుదాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆ ఘటన జరిగిన 24 గంటలు కూడా గడవకముందే మరో దాడి జరగడం గమనార్హం.

# సర్వేపై ఇన్ఫోసిస్ మూర్తిలో అపోహలు

కులగణనతో కేంద్రం చేసే సర్వేపై ఏం సమాధానం చెబుతారు?

కర్నాటక సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు:** ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణ మూర్తి, రచయిత్రి సుధా మూర్తి రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక, విద్యా సర్వేపై కొన్ని అపోహలు కలిగి ఉన్నారని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధా రామయ్య అన్నారు. ఇది వెనుకబడిన కులాల కోసం చేస్తున్న సర్వే అనే భావలో ఉన్నారన్నారు. శుక్రవారం సిఎం మీడియాతో మాట్లాడారు. 'ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదు. వారు ఏమి రాయాలనుకుంటున్నారో రాసుకోనివ్వండి. ఈ సర్వే దేని గురించి అని ప్రజలు అర్థం చేసుకోవాలి. వారు అర్థం చేసుకోలేకపోతే నేను ఏమి చేయగలను?' అని ఆయన అన్నారు. మూర్తిలు సర్వేలో పాల్గొనడానికి నిరాకరించడంతో ముఖ్యమంత్రి స్పందించారు. వారు వెనుకబడిన వర్గాలకు చెందినవారు కాదని ప్రో ఫార్మాపై పేర్కొన్నారు. 'ఇన్ఫోసిస్ (వ్యవస్థాపకుడు) అంటే 'బృహస్పతి' (తెలివిగలవాడు) అని అర్థం కావాలా? ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదు, అందరికీ ఒక సర్వే అని మేము 20 సార్లు చెప్పాము' అని సిద్ధరామయ్య అన్నారు. ప్రభుత్వం 'శక్తి' వంటి సంక్షేమ పథకాలను ప్రారంభించిందని, ఇది ల గ్జరీయేతర ప్రభుత్వ బస్సు ల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలను అందిస్తుంది. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కుటుంబ పెద్దలకు నెలకు రూ. 2,000 అందించే గృహ లక్ష్మి వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రారంభించిందని ఆయన అన్నారు. శక్తి పథకాన్ని ఉన్నత కులాల మహిళలు, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారు ఉపయోగించుకుంటున్నారా? గృహ లక్ష్మి లబ్ధిదారులలో ఉన్నత కులాల వారు లేరా?' అని ఆయన ప్రశ్నించారు. సర్వేపై మంత్రులు పదే పదే వివరణలు ఇస్తున్నప్పటికీ ఈ ప్రక్రియ గురించి ఇప్పటికీ అపోహలు ఉన్నాయని ముఖ్యమంత్రిఅన్నారు. 'ఇప్పుడు కేంద్రం కూడా కుల గణనతో వస్తోంది. అప్పుడు వారు (మూర్తిలు) ఏమి సమాధానం ఇస్తారు? వారికి తప్పుడు సమాచారం అందిందని భావిస్తున్నానన్నారు. ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదని మళ్లీ స్పష్టంగా చెబుతున్నానని, కర్ణాటకలోని ఏడు కోట్ల మంది ప్రజల సామాజిక, ఆర్థిక విద్యా సర్వే అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 'నవంబర్ క్రాం తి'గా పిలువబడే నాయకత్వ మార్పు గురించి ఊహాగానాలపై సిద్ధరామయ్య మాట్లాడుతూ'ఇది క్రాంతి కాదు. క్రాంతి అంటే ఏమిటి? క్రాంతి అంటే విప్లవం. మార్పు విప్లవం కాదు' అని అన్నారు. ప్రభుత్వ భూమి, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కార్యకలాపాలను నిషేధిస్తూ ఇటీవలి కేబినెట్ నిర్ణయాన్ని వివరిస్తూ ఈ చర్య ఒక్క ఆర్‌ఎస్‌ఎస్ గురించే కాదు, ప్రభుత్వ అనుమతి లేకుండా కార్యకలాపాలు నిర్వహించే ఏ సంస్థను అంగీకరిచేదిలేదన్నారు. ఈ నియమాన్ని వాస్తవానికి ముఖ్యమంత్రి జగదీష్ షెట్టార్ నేతృత్వంలోని బిజెపి తీసుకువచ్చిందని గుర్తుచేశారు.

## విజయ్ పార్టీకి గుర్తింపు లేదు..

**చెన్నై:** తమిళనాడు నటుడు విజయ్ రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కజగం (టీవీకే)కు గుర్తింపు లేదని ఎన్నికల కమిషన్ (ఇసి) స్పష్టం చేసింది. కరూర్ ర్యాలీ తొక్కిసలాట కేసు విచారణ సందర్భంగా మద్రాసు హైకోర్టుకు ఈ విషయాన్ని తెలియజేసింది. నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీగా టీవీకే అర్హత సాధించేందుకు అవసరమైన ప్రమాణాలను అందుకోలేదని ఇసి తరుపు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ కోర్టుకు వెల్లడించారు. ఒక రాజకీయ పార్టీ గుర్తింపు పొందాలంటే పోలైన చెల్లుబాటు ఓట్లలో కనీసం ఆరు శాతం ఓట్లు, అసెంబ్లీలో రెండు సీట్లు లేదా లోక్‌సభలో ఒక సీటు సాధించడం వంటి ఇసి నిర్దేశించిన ప్రమాణాలను అందుకోవాలని వివరించారు.

# గుజరాత్ క్యాబినేట్ పునర్వ్యవస్థీకరణ





జడేజా భార్యకు మంత్రిపదవి

**గాంధీనగర్ :** గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ శుక్రవారం తన మంత్రి వర్గాలన్ని పునర్ వ్యవస్థీకరించారు. కొత్తగా 19 మంది ఎమ్మెల్యేను మంత్రులుగా చేర్చుకున్నారు. అంతేకాదు ఇప్పటి వరకు హోం శాఖ సహాయమంత్రిగా ఉన్న హర్ష సంఘవికి ఉపముఖ్యమంత్రి పదవిని అప్పగించారు. దీంతో ఆయన మంత్రి మండలి సంఖ్య 26కి పెరిగింది. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ కొత్త మంత్రులతో పాటు క్యాబినెట్ హోదా పొందిన సహాయ మంత్రులు, ఇండిపెండెంట్ ఛార్జ్ పొందిన మంత్రులతో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు.

### పదవులు ఎవరెవరికి వచ్చాయంటే?

గురువారం 16 మంది మంత్రులు రాజీనామా చేసినప్పటికీ, ఓ ఆరుగురు మంత్రుల రాజీనామాలను ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆమోదించలేదు. వారిలో సూరత్ నగరంలోని ముంజారా అసెంబ్లీ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘవి ఒకరు. ఆయన ఇంతకు ముందు వరకు హోంశాఖ సహాయ మంత్రిగా ఉండగా, తాజాగా ఆయనను డిప్యూటీ సిఎంను చేశారు. గత క్యాబినెట్‌లో ఉన్న మరో ఐదుగురు ఎమ్మెల్యేలను కూడా భూపేంద్ర తన కొత్త మంత్రి మండలిలోకి తీసుకున్నారు. వారిలో కనుభాయ్ పటేల్, రుషికేశ్ పటేల్, కున్వర్జీ బవాలియా గతంలో క్యాబినెట్ మంత్రులుగా ఉండగా, సంఘవి, ప్రఫుల్ పన్షేరియా, పురుషోత్తం సోలంకి సహాయ మంత్రులుగా పనిచేశారు. వీరిలో డిప్యూటీ సిఎంగా పదోన్నతి పొందిన సంఘవి, స్వతంత్ర మంత్రిగా ప్రమోట్ చేయబడిన పన్షేరియా మాత్రమే శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. మరోవైపు కొత్త మంత్రి మండలిలో చేరిన 19 మంది ఎమ్మెల్యేలలో జితు వాఘాని, అర్జున్ మోద్వాడియా, మనీషా వకీల్ ఉన్నారు.

### సర్‌ప్రైజ్ ఎంట్రీ

చాలా ఆశ్చర్యకరంగా, ఈసారి భారత క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజా (34)ను ఈసారి సహాయ మంత్రిగా తీసుకున్నారు. జామ్‌నగర్ ఎమ్మెల్యేగా ఉన్న ఆమె ప్రమాణ స్వీకారానికి భర్త రవీంద్ర జడేజా, కుమార్తె నిధ్యాన హాజరయ్యారు. రవాబా తన తల్లిదండ్రులకు ఏకైక సంతానం. ఆమె రాజ్‌కోట్‌లో ఇంజినీరింగ్ డిగ్రీ చేశారు. ఆమె 2016లో రవీంద్ర జడేజాను వివాహం చేసుకున్నారు.

# 'బిహార్'లో ఇండియా కూటమి భాగస్వాముల మధ్య 'స్నేహపూర్వక' పోటీ

బచ్వారా అసెంబ్లీ స్థానం నుండి ఎన్నికల బరిలో కాంగ్రెస్, సిపిఐ అభ్యర్థులు

కాంగ్రెస్ యువజన నేత గరీబ్‌దాస్, సిపిఐ మాజీ ఎమ్మెల్యే అవదేశ్ రాయ్ నామినేషన్‌పత్రాలు దాఖలు




**పాట్నా :** త్వరలో జరుగనున్న బిహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో సీట్ల సర్దుబాటు విషయం విపక్ష ఇండియా కూటమిలో ప్రతిష్ఠంభనకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో ఇండియా కూటమికి చెందిన భాగస్వామ్య పార్టీలు తమ తమ అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపేందుకుసిద్ధమై నామినేషన్లు వేయిస్తుండటంతో బిహార్ అసెంబ్లీ నియోజకవర్గాలలో స్నేహపూర్వక పోటీకే ఎక్కువ అవకాశం కనిపిస్తోంది.బిహార్ రాష్ట్రం బెగుసరాయ్ జిల్లాలోని బచ్వారా అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ, సిపిఐ తమ అభ్యర్థులను బరిలోకి దించాయి. కాంగ్రెస్ పార్టీ బచ్వారా శాసనసభ నియోజకవర్గం నుండి తన అభ్యర్థిగా యువజన విభాగం నాయకుడు ప్రకాశ్ గరీబ్‌దాస్‌తో, సిపిఐ తన మాజీ ఎమ్మెల్యే అవదేశ్ రాయ్‌తో శుక్రవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేయించాయి. కాంగ్రెస్ వర్గాలు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీనాయకత్వం ఆర్‌జెడి, వామపక్షాలు సహా కూటమిభాగస్వాములతోచర్చలుజరుపుతోంది.సిపిఐ అభ్యర్థి బచ్వారా నియోజకవర్గం నుండి తన నామినేషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం ఉంది అని వెల్లడించాయి. గురువారం రాత్రి బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన తన మొదటి జాబితాలో 48మంది అభ్యర్థులను ప్రకటించింది. కుటంబ నియోజకవర్గం నుంచి బిహార్ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ రాజేశ్ రామ్‌ను, కాడ్వా అసెంబ్లీ స్థానం నుంచి సిఎల్‌పి నాయకుడు షకీల్ అహ్మద్‌ఖాన్‌ను, కొంత మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను కూడా బరిలోకి దించింది. ఆర్‌జెడి సహా 'మహాఘట్‌బంధన్' భాగస్వాములతో సీట్ల షేరింగ్ ఏర్పాట్లు పూర్తికాకముందే కాంగ్రెస్ తన అభ్యర్థులను ప్రకటించింది. బిహార్‌లో మొదటి దశ ఎన్నికలకు నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు తుదిగడువు అక్టోబరు 17 కాగా, రెండవ దశ ఎన్నికలకు నామినేషన్ పత్రాలు దాఖలు చేసే తుది గడువు అక్టోబరు 20గా ఎన్నికల సం ఘం నిర్ణయించింది. ఇండియా కూటమి వర్గాలు తెలిపిన ప్రకారం...కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిన 61 అసెంబ్లీ స్థానాల కేటాయింపునకు ఆర్‌జెడి ఆ మోదం తెలిపిందని, అయితే కొన్ని కీలకమైన అసెంబ్లీ స్థానాల కోసం చర్చలు జరుగుతున్నాయని వెల్లడించాయి. 'కాంగ్రెస్‌తోపాటు ఇతర మహాఘట్‌బంధన్ నియోజకవర్గాలలో మిగిలిన సీట్ల అభ్యర్థుల జాబితాలను విడుదల చేసిన తర్వాత విషయాలు మరింత స్పష్టంగా తెలుస్తాయి' అని ఇండియా కూటమి వర్గాలు తెలిపాయి.2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మొత్తం 70స్థానాలకు పోటీ చేయగా, కేవలం 19స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 6నుంచి 11వరకు జరుగనున్నాయి. నవంబరు 14న ఓట్ల లెక్కింపు జరుగనుంది.

### జాలే అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ టికెట్‌పై పోటీచేస్తున్న ఆర్‌జెడి నేత...

మూడేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీని వీడి ఆర్‌జెడిలో చేరిన పూర్వ ఎమ్మెల్యే రిషి మిశ్రాను జాలే అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా శుక్రవారం కాంగ్రెస్ ప్రకటించింది. 48మంది అభ్యర్థులతె కూడిన మొదటి జాబితాను ప్రకటించిన కాంగ్రెస్‌పార్టీ రిషి మిశ్రాకు జాలే అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా చోటు కల్పించింది. మొదటి దశలో 121 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి రిషి మిశ్రా జాలే స్థానం నుంచి తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఇందిరాగాంధీ కేబినెట్‌లోని అత్యంత ప్రభావితం చేయగలిగే మంత్రులలో ఆయన తాత లలిత్ నారాయణ్ మిశ్రా ఒకరు. బిజెపిలో ఉన్న రిషి మిశ్రా కజిన్ నితీశ్ మిశ్రా నితీశ్ కుమార్ ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన జాంజార్‌పూర్ స్థానాన్ని కోరుతున్నారు. కాంగ్రెస్ టికెట్‌పై జాలే అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆర్‌జెడి నాయకుడు రిషి మిశ్రాను పోటీలో నిలిపే విషయంలో ఎన్నికల ప్రకటన వెలువడిన నాటి నుంచీ రెండు భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రజాపక్షం
శనివారం, 18 అక్టోబరు

## ‘డిజిటల్’ మోసాలకు కళ్లెం ఏది?

మెరుపువేగంతో పెరుగుతున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మంచినేకాదు.. చెడును కూడా మోసుకొస్తున్నది. డిజిటల్ యుగంలో మోసాల పర్వం కలవరపెడుతున్నది. ఆన్‌లైన్ అక్రమాలపై సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. కోర్టు ఉత్తర్వులను సైతం మారుస్తూ, ప్రజలను మోసగిస్తున్న సంఘటనలు న్యాయవ్యవస్థలపై నమ్మకాన్ని పునాదులతో పెకలించి వేస్తుందని ఆందోళన వ్యక్తం కావడం కేంద్ర నిఘా వర్గాల వైఫల్యాలకు నిదర్శనం. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ అధికారుల పేరుతో 72 ఏళ్ల ముంబయి వ్యాపారి నుంచి సైబర్ మోసగాళ్లు 58కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. హర్యానా రాష్ట్రం అంబాలా జిల్లాలో వృద్ధ దంపతులను కోర్టు ఆదేశాల పేరుతో డిజిటల్ అరెస్టుచేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. ఈ ఘటనలు పెరుగుతున్న డిజిటల్ మోసాలకు ఉదాహరణలు. దేశంలో ఆన్‌లైన్ మోసాలు గణనీయంగా పెరుగుతున్నాయని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. ప్రతిరోజూ పతాక శీర్షికల్లో వార్తలు వస్తున్నాయి. డిజిటల్ అరెస్టు, నకిలీ ఉత్తర్వుల మోసాలు ఏడాదికాలంలో 12 శాతం పెరగడం భయాందోళనలు రేకెత్తిస్తున్నది. సైబర్ మోసాల్లో 34 శాతం డిజిటల్ అరెస్టులే. బాధితులు అధికంగా వృద్ధులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులే. ప్రజల్లో అవగాహనా రాహిత్యం.. కేంద్ర రక్షణ సంస్థలు, రాష్ట్ర పోలీస్ శాఖల వైఫల్యాలే కేసుల సంఖ్య పెరగడానికి కారణం. భయం.. అత్యాశలు జతకలుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో, వివిధ కేసులను సుమోటోగా తీసుకొని సుప్రీం కోర్టు స్వయంగా విచారణ చేపట్టడం శుభ పరిణామం. దేశవ్యాప్తంగా ఇలాంటి మోసాలపై దృష్టి కేంద్రీకరించడం హర్షణీయం. కానీ, ప్రజల్లో అవగాహన, అప్రమత్తత లేకుంటే ఎన్ని చట్టాలు.. ఇంకెన్ని నిబంధనలు తెచ్చినా ఫలితం శూన్యం. డిజిటల్ అరెస్టు అనే ప్రక్రియ లేనేలేదనే వాస్తవాన్ని చాలామంది ఇంకా గుర్తించకపోవడం విచారకరం. తమను తాము పోలీస్, సిబిఐ, ఇడి, కోర్టు అధికారులుగా పరిచయం చేసుకొని బెదిరిస్తే, బెంబేలు పడాల్సిన అవసరం లేదు. ఆడియో, వీడియో కాల్స్ ద్వారా ఎవరూ చర్య లు తీసుకోలేరు. డబ్బు డిమాండ్ చేసే అధికారం ఎవరికీ లేదు. తెలియని నెంబర్ల నుంచి కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్న సందేశం దేశమంతా ప్రతిధ్వనించినా, ఇప్పటికీ డిజిటల్ మోసాలు జరుగుతునే ఉన్నాయంటే, ప్రజల్లో నిర్లిప్తత ఏ స్థాయిలో ఉందో తెలుస్తున్నది. మరోవైపు నేరస్థులు కొత్తకొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. అనుసరిస్తున్నారు. ఆ వేగం ప్రభుత్వ వ్యవస్థల్లో మృగ్యం. ఆపై అంతులేని నిర్లక్ష్యం. ప్రజల్లో ఉదాశీనత. ‘తిలా పాపం తలా పిడికెడు’ చందాన, ఈ దుస్థితికి అందరూ బాధ్యులే. అసలు డిజిటల్ అరెస్ట్ అనే పదం భారత చట్టాల్లో లేదు. ఎవరైనా వీడియో, ఆడియో కాల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేస్తూ బెదిరిస్తే అది నిశ్చయంగా మోసమే. అవాంఛిత కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు లేదా ఎవరైనా అధికారి, న్యాయస్థాన ప్రతినిధి అంటూ మాట్లాడుతున్నప్పుడు వెంటనే అప్రమత్తం కావాలి. ఖచ్చితమైన అధికారిక గుర్తింపు లేకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించకూడదు. బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఆధార్ కార్డు సమాచారం ఇతరులతో పంచుకోవడం ప్రమాదకరం. మోసాలకు బహిరంగ ఆహ్వానం. ముందు జాగ్రత్తలు లేకుండా, మోసపోయిన తర్వాత వాపోవడం వల్ల ఏం లాభం? డిజిటల్ అరెస్టు అనగానే భయపడి, పదేపదే మోసపోవడం ప్రజల తప్పు. ఆందోళన చెంది, డబ్బు సమర్పించుకోవడం మరో తప్పు. సులభంగా డబ్బు సంపాదించాలనుకోవడం, అడ్డదారులు వెతుక్కోవడం తప్పుమీద తప్పు. ఈ సంక్లిష్ట సమయంలో, సుప్రీం కోర్టు రంగప్రవేశం ఒక ఊరట మాత్రమే. నిఘా వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజల్లో అవగాహన పెరగాలి. మోసగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి. భయపెడితే వణికిపోవడం... డబ్బు ఆశ చూపిస్తే గుడ్డిగా నమ్మేయడం... ప్రలోభాలకు లొంగిపోవడం మానుకోవాలి. గోప్యతను పాటించాలి. అన్ని వివరాలు సరిచూసుకున్న తర్వాత వ్యక్తిగత సమాచారం అందించాలి. కొద్దిపాటి అప్రమత్తత మోసాల నుంచి కాపాడుతుంది. చైన్ మార్కెటింగ్ నుంచి బెట్టింగ్ యాప్స్ వరకూ... డిజిటల్ అరెస్ట్ నుంచి క్రిప్టో కరెన్సీ వరకూ.. అంతులేకుండా జరుగుతున్న సైబర్ మోసాలకు తెరదించే బాధ్యతను అంతా సమష్టిగా స్వీకరించాలి. ప్రజలు జాగరూకులై ఉండాలి. ప్రభుత్వ వ్యవస్థలు నిఘా పెంచి, దృష్టి పెట్టి, మోసగాళ్ల భరతం పట్టాలి. సైబర్ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి. అష్టదిగ్బంధనం చేస్తే తప్ప, డిజిటల్ మోసాలు ఆగవు. ప్రజల సమస్య తీరదు.

## బిసి రిజర్వేషన్లపై పరిష్కారమేది?



సంపతి రమేష్ మహారాజ్
7989579428

ఇటీవల సామాజిక న్యాయంపైన తెలంగాణ రాష్ట్రంలో చర్చ జరుగుతుంది. ఇప్పుడు ఇదీ బిసి రిజర్వేషన్లతో ముడిపడిన అంశమైనది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ క్రమంలో 42 శాతం విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును అసెంబ్లీలో తీర్మానించి గవర్నర్ ఆమోదానికి పంపారు. ఇది రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉండడంతో ప్రత్యేకంగా జిఒ తీసుకువచ్చారు. ఈ జిఒను ఇటీవల కొందరు కోర్టులో సవాల్ చేశారు. 42శాతం బిసి రిజర్వేషన్ జిఒ పై హైకోర్టు స్టే విధించింది. మరోవైపు సుప్రీం కోర్టు కొట్టివేసింది. రాజ్యాంగం కల్పించిన హక్కులు సంపూర్ణంగా దక్కడం లేదని, బిసిల జనాభాకు అనుగుణంగా వారికి రిజర్వేషన్లు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది.

**పొలిటికల్ మైలేజ్ కోసం...** భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చే 75 వసంతాలు పూర్తయినప్పటి కీ అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో వెనకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పనలో పార్టీలకు చిత్తశుద్ధి లేదు. ఇటీవల కోర్టులు బిసి రిజర్వేషన్ పై ఆంక్షలు విధించడంతో తెలంగాణలో అక్టోబర్ 18న బిసి రిజర్వేషన్ సాధనకు బిసి సంఘాల ఐక్య కార్యకరణ సమితి ఆధ్వర్యంలో బంద్ ప్రకటించారు. దీనికి మూడు ప్రధాన రాజకీయ పార్టీలైన బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ బంద్‌కు మద్దతు పలికాయి. బిసిలకు రిజర్వేషన్ విషయంలో పార్టీల బంద్ ఎవరిపైన? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**శాస్త్రీయ పరిష్కారం కోసం ఉద్యమం...** 1980 సంవత్సరంలో మండల్ కమిషన్ ఒబిసి లకు 27శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది. వీటి అమలుకై ఢిల్లీ బోట్స్ క్లబ్ ముందు 48 రోజుల ధర్నా చేశాడు. కాన్సిరాం బిసి రిజర్వేషన్ ఉద్యమం దేశంలో విజయవంతమైనది. ఈ క్రమంలో ఉమ్మడి ఎపి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బాలరాజుగౌడ్ బిసి ఎస్సీ ఎస్టీ జెఎసి రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజు నాయకత్వంలో బిసి రిజర్వేషన్ల సాధన సమితి ఏర్పాటు అయ్యింది. ఈ సమితి బిసి కేటగిరీల కు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, తమిళనాడు తరహాలో వాటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తుంది. తెలంగాణలోని ఇతర బిసి సంఘాలు వీరికి తోడైతే బిసిలకు సామాజిక న్యాయం దక్కుతుంది.

(బిసి రిజర్వేషన్లకు మద్దతుగా నేడు తెలంగాణ బంద్)

### శాంతియుత ప్రపంచం కోసం

# అణ్వాయుధాలను నిర్మూలించాలి

### నాగసాకిలో జరిగిన అంతర్జాతీయ వైద్యుల ప్రపంచ మహాసభ డిక్లరేషన్



డాక్టర్ రజని,
ఐడిపిడి జాతీయ ఉపాధ్యక్షురాలు

అణ్వాయుధాల నిర్మూలనకు అంతర్జాతీయ ఫిజీషియన్స్ (ఐపిపిఎన్‌డబ్ల్యు– ఇంటర్‌నేషనల్ ఫిజీషిన్స్ ఫర్ ప్రివెంటింగ్ న్యూక్లియర్ వెపన్స్) సంస్థ వరల్డ్ కాంగ్రెస్ జపాన్ దేశంలోని నాగాసాకిలో అక్టోబర్ 1 నుండి 5వ తేదీ వరకు జరిగింది. ఈ సదస్సుకు ఐపిపిఎన్‌డబ్ల్యుకు అనుబంధ సంస్థ ఐడిపిడి (ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్) తరఫున భారతదేశంలోని ఏడు రాష్ట్రాల నుంచి 24 మంది డాక్టర్లు హాజరు అయ్యారు. ఐడిపిడి అధ్యక్షులు డాక్టర్ అరుణ్ మిత్ర, ప్రధాన కార్యదర్శి డాక్టర్ షకీల్ ఉర్ రెహమాన్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.రజని, ప్రొఫెసర్ డాక్టర్. మాధవి,ఎం.డి.మహబూబ్‌నగర్ వైద్య కళాశాల, డాక్టర్ సమంత రోషిణి, ఎం.డి.అనాటమి సిద్ధిపేట వైద్య కళాశాల, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, అయిప్సో నాయకులు డాక్టర్ దిడ్డి సుధాకర్ , శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో అనేక వర్క్‌షాపులు జరిగాయి. దక్షిణాసియా నుండి ఐడిపిడి చొరవతో ‘క్వెస్ట్ ఫర్ పీస్ ఇన్ సౌత్ ఏసియా (దక్షిణాసియాలో శాంతి శోధన)’ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించాము. శ్రీలంక, నేపాల్, ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి ప్రతినిధులు హాజరుకాలేకపోయా రు. ఈ సదస్సులో దక్షిణాసియాలో జరుగుతున్న అలజడులు, పరిణామాలు,అణ్వాయుధాలను యుద్ధంలో ఉపయోగించకుండా నివారించడానికి చర్యలు, ప్రజారోగ్యం ప్రాముఖ్యత, దేశాల మధ్య సత్సంబంధాలు గురించి చర్చించడంతో పాటు శాంతి కాముకులు అందరూ కలసి పనిచేయాలని, నేపాల్ లుంబినిలో దక్షిణాసియా సదస్సు నిర్వహించాలని నిర్ణయించబడింది. ఐపిపిఎన్‌డబ్ల్యు లో నాగసాకి డిక్లరేషన్ పేరుతో తీర్మానం చేశారు. అణ్వాయుధాలను రద్దు చేయడానికి, యుద్ధాన్ని నివారించడానికి అంతర్జాతీయ వైద్య ఉద్యమం, అభిప్రాయం అంశాలను అందులో పేర్కొన్నారు.

**ఐపిపిఎన్‌డబ్ల్యు ప్రపంచ కాంగ్రెస్ ప్రకటించిన నాగసాకి డిక్లరేషన్**

హిబాకుషాను స్మరించుకోవడానికి వైద్యులు, వైద్య విద్యార్థులు, కార్యకర్తలుగా మేము నాగసాకిలో సమావేశమయ్యాము. హిబాకుషా, హిరోషిమాల్లో అమెరికా అణు బాంబు దాడుల బాధితులు, ప్రాణాలతో బయటపడిన వారిని, ఆ భయంకరమైన సంఘటనల తర్వాత 80 సంవత్సరాలలో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన 2,000 కంటే ఎక్కువ అణు పరీక్షల నుండి బయటపడిన వారిని ఈ సందర్భంగా స్మరించుకున్నాము. 2024 నోబెల్ శాంతి బహుమతి గ్రహీతలైన హిబాకుషా, నిహాన్ హిడాంక్యోలను అణ్వాయుధాల నిర్మూలనకు జీవితాంతం అంకితభావంతో కృషి చేసినందుకు మేము కృతజ్ఞతలు తెలుపుతున్నాము. ఈ కాంగ్రెస్‌లో వారి ఉనికి మాకు గౌరవంగా ఉంది. వారి ఉదాహరణ మన ముందు ఉంచి, అణ్వాయుధాలు లేని ప్రపంచాన్ని సాధించడానికి మేము మళ్ళీ కట్టుబడి ఉన్నాము.

ఐపిపిఎన్‌డబ్ల్యు చివరిసారిగా జపాన్‌లో 2012లో హిరోషిమాలో సమావేశమైన తరువాత ఐపిపిఎన్‌డబ్ల్యు త ఆస్ట్రేలియన్ అనుబంధ సంస్థ అయిన మెడికల్ అసోసియేషన్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ వార్‌తో కలిసి స్థాపించిన ఇంటర్నేషనల్ క్యాంపెయిన్ టు అబాలిష్ న్యూక్లియర్ వెపన్స్ (ఐసిఎఎన్–ఐకెన్) ఐదు సంవత్సరాల క్రితం ప్రారంభించబడింది. ఐసిఎఎన్ నేతృత్వంలో అణ్వాయుధాలను నిషేధించే ఒప్పందం కోసం ఒత్తిడి ఇప్పుడే ప్రారంభమైంది. దీర్ఘకాలంగా వాగ్దానం చేయబడిన నిరాయుధీకరణను కొనసాగించడంలో నిరంతర వైఫల్యం నేపథ్యంలో, అణుయుద్ధం విపత్కర పరిణామాల గురించి వైద్య, పర్యావరణ, మానవతా ఆధారాలు చాలా బలంగా, తిరస్కరించలేనివిగా ఉన్నాయి. అణ్వాయుధాల సంపూర్ణ నిషేధ ఒప్పందం (టిపిఎన్‌డబ్ల్యు) కేవలం ఐదు సంవత్సరాలలో చర్చలు జరిపి ఆమోదించబడింది. ఇప్పటి వరకు 95 దేశాలు సంతకాలు చేశాయి. వాటిలో 74 సభ్య దేశాలు సహా మొదట సంతకం చేయకుండా అంగీకరించిన నాలుగు దేశాలూ ఉన్నాయి. ఆ విధంగా మొత్తం 99 దేశాలు – ప్రపంచవ్యాప్తంగా మెజారిటీ ఇప్పుడు ఒప్పందంలో చేరడానికి చట్టపరమైన చర్య తీసుకున్నాయి. దాని ఘనతకు మూడు విజయవంతమైన సమావేశాలు , 2026 కోసం ఒక సమీక్షా సమావేశం ప్రణాళికతో, ఈ ఒప్పందం అణ్వాయుధ రహిత ప్రపంచానికి స్పష్టమైన మార్గంగా స్థిరపడింది.

ఆరోగ్యం, మానవతావాద, పర్యావరణంపై అణు యుద్ధ ప్రభావాలపై 21వ శతాబ్దపు సమగ్ర నివేదికలను రూపొందించడానికి ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ తీసుకుంటున్న సానుకూల చర్యలను మేము అభినందిస్తున్నాము. ఐపిపిఎన్‌డబ్ల్యు , ప్రపంచ వైద్య సంఘం, అంతర్జాతీయ నర్సుల మండలి, ప్రపంచ ప్రజారోగ్య సంఘాల సమాఖ్యతో సహా ప్రధాన ఆరోగ్య సంస్థల మధ్య చురుకైన సహకారం లేకుండా డబ్ల్యుహెచ్ఒ కొత్త పని జరిగేది కాదు. ఈ ప్రపంచ ఆరోగ్య నాయకులు అణ్వాయుధాల నిర్మూలనను వారి పనికి ప్రాధాన్యతగా చేసుకున్నందుకు మేము కృతజ్ఞులం.

అయితే, విచారకరమైన విషయమేమిటంటే, అణ్వాయుధ దేశాలన్నీ టిపిఎన్‌డబ్ల్యు వాగ్దానాన్ని స్వీకరించడంలో విఫలమవడమే కాకుండా, దానికి వ్యతిరేక మార్గాన్ని తీసుకున్నాయి. అణ్వాయుధాలను పరిమితం చేస్తూ కష్టపడి సాధించిన ఒప్పందాలను రద్దు చేయడం, నిర్లక్ష్య ప్రపంచ ఆయుధ పోటీని ప్రారంభించడం; మధ్యప్రాచ్యం, యూరప్ , ఆసియాలో పెరుగుతున్న యుద్ధాలలో అణ్వాయుధాల వినియోగిస్తామని బెదిరింపులు; ఇవన్నీ ఆయుధ నియంత్రణ, నిరాయుధీకరణ ప్రయత్నాలను వదిలివేయడం తప్ప ఇంకొకటి కాదు. ఐకెన్ నివేదించినట్లుగా, అణ్వాయుధాలపై ప్రపంచ వ్యయం 2024లో 100 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇది ప్రతి సంవత్సరం పెరుగుతూ పోతోంది. రష్యా–ఉక్రెయిన్ సాయుధ సంఘర్షణ సమయంలో రష్యా, అమెరికా,నాటో నాయకులు అణ్వాయుధాలను ఉపయోగించాలని బెదిరింపులకు పాల్పడ్డాయి. భారతదేశం, పాకిస్తాన్ మధ్య , ఉత్తర కొరియా, దాని పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తత పెరిగిన కాలంలో ఇలాంటి ఉద్రిక్తత హెచ్చరికలు ఇప్పుడు సాధారణంగా వినిపిస్తోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో ఇజ్రాయెల్,అమెరికాలు కలిసి ఇరాన్‌లోని అణు కేంద్రాలపై బాంబు దాడి చేశాయి. ఇజ్రాయెల్ కు డిమోనా అణ్వాయుధ ఉత్పత్తి స్థలంలో కొత్త నిర్మాణాలు జరుగుతున్నప్పుడు, ఇది ప్రాంతీయ అస్థిరతను మరింత తీవ్రతరం చేస్తుంది. అణ్వాయుధ విస్తరణ సంభావ్యతను పెంచుతుంది. అణ్వాయుధాలను సంపాదించే అవకాశాన్ని అనేక దేశాలు బహిరంగంగా ప్రకటిస్తున్నప్పటికీ, 2010 నుండి జరిగిన అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం యొక్క ప్రతి సమావేశం విఫలమైంది. దౌత్యం, అంతర్జాతీయ చట్ట సంస్థలు దిగజారిపోతున్నాయి, దూకుడు నిరంకుశత్వం, లావాదేవీ రాజకీయాల ద్వారా భర్తీ చేయబడ్డాయి. అమెరికా, రష్యా మధ్య మిగిలి ఉన్న చివరి అణ్వాయుధ ఒప్పందం అయిన కొత్త స్టార్ట్ ఫిబ్రవరి 2026లో ముగుస్తుంది. ఒప్పందం యొక్క పరిమితులను ఒక సంవత్సరం పాటు పొడిగించాలనే రష్యా ప్రతిపాదనను అమెరికా వెంటనే అంగీకరించాలి. రెండు దేశాలూ నిరాయుధీకరణ కోసం తక్షణమే చర్చలు జరపాలి.




అణ్వాయుధాలను కలిగి ఉన్న అన్ని దేశాలు తమ ఆయుధశాలల ప్రమాదకరమైన విస్తరణను, అలాగే నిరోధం ముసుగులో అణు యుద్ధానికి సన్నాహాలు చేయడాన్ని ఆపాలని మేము పిలుపునిస్తున్నాము. అణు యుద్ధం యొక్క వినాశకరమైన మానవతా పరిణామాలు, మానవాళిని నిర్మూలించగల ఏకైక ఆయుధాలను తొలగించే వారి చట్టపరమైన , నైతిక బాధ్యతపై వారు చివరకు చర్య తీసుకోవాలి. ఒప్పందంలో చేరడం, క్రమబద్ధమైన, ధృవీకరించదగిన అణ్వాయుధ నిరాయుధీకరణ ప్రక్రియను చేపట్టడం, పూర్తి చేయడంపై దృష్టి సారించి టిపిఎన్‌డబ్ల్యు సభ్య దేశాలతో కలిసి పనిచేయాలని మేము వారిని కోరుతున్నాము.

21వ శతాబ్దంలో యుద్ధం యొక్క వినాశకరమైన ప్రభావాన్ని మనం విస్మరించలేము. నేడు మరణించిన వారిలో అత్యధికులు మహిళలు, పిల్లలు. వీరిలో ఆరోగ్య, మానవతా సహాయ కార్మికులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు ఉన్నారు. లక్షలాది మంది ప్రజలు తమ ఇళ్లను వదిలి పారిపోవాల్సి వచ్చింది. భయంకరమైన మానవ హక్కుల ఉల్లంఘనలను అనుభవించారు. విస్తృతమైన ఆకలి, కరువును ఎదుర్కొన్నారు. ఉక్రెయిన్, గాజాలలో అణ్వాయుధ ఆయుధాలు కలిగిన దేశాలు ఇప్పటికే వినాశకరమైన యుద్ధాలను ఎదుర్కొంటున్నాయి, ఇవి విస్తృత ప్రాంతీయ యుద్ధాలు, అణు ఉద్ధరణ ముప్పును పెంచుతున్నాయి. రెండు యుద్ధాలలో శత్రుత్వాలను వెంటనే నిలిపివేయాలని, మరింత ప్రాణనష్టాన్ని నివారించడానికి సంభాషణలో సాధ్యమయ్యే అన్ని ప్రయత్నాల కోసం మేము మా పిలుపులను పునరుద్ఘాటిస్తున్నాము. టిగ్రే, డార్ఫర్, సూడాన్, దక్షిణ సూడాన్, కాంగో మరియు యుద్ధంతో నాశనమైన ఇతర ప్రాంతాలలో జరుగుతున్న యుద్ధాలను వెంటనే ముగించడానికి ప్రపంచ సమాజం కృషి చేయాలని కూడా మేము పిలుపునిస్తున్నాము. ఈ యుద్ధాలన్నింటిలోనూ, ఆరోగ్య సంరక్షణ కార్మికులు మరియు సౌకర్యాల రక్షణను నిర్ధారించడానికి అత్యవసరంగా అవసరమైన మానవతా సహాయానికి అన్ని అడ్డంకులను తొలగించడం ద్వారా అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా శాశ్వత శాంతికి మార్గం సుగమం చేయాలని మేము పిలుపునిస్తున్నాము. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ప్రాంతాలలోని ప్రజలందరి ఆరోగ్యం, భద్రత, ప్రాథమిక మానవ హక్కులకు హామీ ఇవ్వాలి.

జపాన్‌లో సమావేశమైన మేము, పుకుషిమా దైచి అణు విద్యుత్ ప్లాంట్ విపత్తు తర్వాత కొనసాగుతున్న ప్రజారోగ్యం, భద్రతా సమస్యలు, అవసరాలపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత మాకు ఉంది. పుకుషిమా అణు విపత్తు గాలి, భూమి, జలాలు, సముద్ర వాతావరణంలోకి పెద్ద మొత్తంలో రేడియోధార్మికత విడుదల కావడానికి కలుషితమైన నేల, నీరు పెద్ద మొత్తంలో పేరుకుపోవడానికి కారణమైంది. రాబోయే తరాల వారితో సహా జపాన్ లోపల, వెలుపల ఉన్న ప్రజలకు నివారించదగిన రేడియేషన్ వెలువడడాన్ని తగ్గించడం అనేది అధిక, నిరంతర ప్రజారోగ్య ప్రాధాన్యత. కలుషిత ప్రాంతాలను నిర్వహించడంలో ఉన్న ఇబ్బందులను అంగీకరిస్తూనే, జపాన్ అధికారులు ప్రజలకు రేడియేషన్ బహిర్గతం కోసం పరిమితులను పెంచారు. ఇప్పటికీ తగ్గించలేదు, నిరాశ్రయులైన నివాసితులను తిరిగి తెరిచిన మినహాయింపు మండలాలకు తిరిగి రావాలని ఒత్తిడి చేశారు. ఇవి ఎక్కువగా కలుషితం గా ఉన్నాయి. కొనసాగుతున్న ఆరోగ్య అవసరాలను, రియాక్టర్ కేంద్రంలో కొనసాగుతున్న ప్రమాదకరమైన పరిస్థితులను తగినంతగా పరిష్కరించడం లేదు. ఫుకుషిమా, చెర్నోబిల్ పాఠాలు నేర్చుకున్నామని, అలాంటి విపత్తులు పునరావృతం కాదనే భావన కోరికతో కూడిన ఆలోచన కంటే దారుణంగా ఉంది. ఉక్రెయిన్, ఇరాన్‌లలో మనం చూసినట్లుగా, సాయుధ యుద్ధాల సమయంలో అణు విద్యుత్ ప్లాంట్లు, ఇతర అణు సౌకర్యాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా సమస్య మరింత జటిలం అవుతుంది. జపాన్, ఈశాన్య ఆసియాలోని ఇతర ప్రాంతాలలో ఉన్న అనేక అణు విద్యుత్ ప్లాంట్లు, ఖర్చు చేసిన ఇంధన చెరువులు, ఇతర అణు సౌకర్యాలు పుకుషిమాలో జరిగినట్లుగా, ప్రత్యక్ష దాడి, విద్యుత్ సరఫరా, శీతలీకరణ నీటి అంతరాయం రెండింటికీ గురయ్యే అవకాశం ఉంది. వాతావరణ సంక్షోభం యొక్క చెత్త ప్రభావాలను నివారించడానికి, తదుపరి అణు రియాక్టర్ విపత్తును నివారించడానికి, అణు విస్తరణ ప్రమాదాన్ని పరిష్కరించడానికి పునరుత్పాదక, అణుయేతర ఇంధన ఉత్పత్తికి వేగవంతమైన మార్పు అవసరం.

అణచివేయలేని యుద్ధాలు, అణ్వాయుధాలతో సహా ప్రపంచ సైనిక వ్యయంలో భారీ పెరుగుదల, కృత్రిమ మేధస్సు యొక్క వేగవంతమైన, క్రమబద్ధీకరించని అభివృద్ధి, అణు కమాండ్, నియంత్రణ వ్యవస్థలకు దాని సంభావ్య అనువర్తనం, నిరంకుశత్వం వైపు కలత పెట్టే ధోరణి, ముఖ్యంగా ఒకప్పుడు ప్రజాస్వామ్య దేశాలుగా ఉన్న దేశాలలో, ఇవన్నీ అణు యుద్ధం, వాతావరణ సంక్షోభం యొక్క జంట అస్తిత్వ ముప్పులను సహకారంతో పరిష్కరించడం మరింత కష్టతరం చేశాయి. ఈ క్లిష్ట పరిస్థితులలో ఆశకు ఆధారం ఉంటే, ఐపిపిఎన్‌డబ్ల్యు విద్యార్థి ఉద్యమానికి పునరుజ్జీవనం, ఐకెన్ యువత ఆధారిత ప్రచారంలో మనం దానిని కనుగొంటాము.

ఐపిపిఎన్‌డబ్ల్యు విద్యార్థి నాయకులు ఈ సమస్యలలోని లోపాలను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేస్తున్నారు, కీలకమైన టిపిఎన్ డబ్ల్యు, ఎన్‌పిటి సమావేశాలలో మాత్రమే కాకుండా, కాప్ 29, ఇతర వాతావరణ సమావేశాలలో కూడా సమాఖ్యకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అణ్వాయుధాల రద్దు, వాతావరణాన్ని రక్షించడం, యుద్ధాన్ని ముగించడం, ప్రపంచ న్యాయం, మానవ హక్కుల కోసం వాదించడం అన్నీ మన ఆరోగ్యం, మనుగడకు చాలా ముఖ్యమైనవని వారు సమర్థవంతంగా సందేశాన్ని అందిస్తున్నారు. ప్రస్తుత, మునుపటి తరాల ఐపిపిఎన్‌డబ్ల్యు నాయకులు వారికి జ్యోతిని అందజేయడం గర్వంగా ఉంది.

80 సంవత్సరాల క్రితం హిరోషిమా, నాగసాకిపై అమెరికా చేసిన అణు బాంబు దాడులు అణు యుగంలో మన ప్రపంచ దుర్బలత్వాన్ని బయటపెట్టాయి. 1945 నుండి అణ్వాయుధాల వాడకంపై నిషేధం ఇప్పుడు క్షీణిస్తోంది. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ మాటలను మేము ప్రతిధ్వనిస్తున్నాము. ‘‘మానవత్వం కేవలం ఒక అపార్థం, అణు వినాశనానికి దూరంగా ఉన్న ఒక తప్పుడు లెక్క’’. వైద్యులుగా, మనం నయం చేయలేని వాటిని నిరోధించాలని, అణు యుద్ధం అనేది కోలుకోలేని విపత్తు అని మేము అర్థం చేసుకున్నాము. మరింత శాంతియుత ప్రపంచం కోసం చర్య తీసుకోవాలని, అణ్వాయుధాల నిర్మూలనకు అవసరమైన అణు యుద్ధాన్ని నివారించాలని పిలుపునిస్తూ నాగసాకిలోని హిబాకుషా వారి గొంతులతో మేము మా గొంతులను కలుపుతాము.

## ఉపాధ్యాయుల మెడపై సాంకేతిక కత్తి!




వెంకగారి భూమయ్య
9848559863

తెలంగాణ విద్యా బోధన వ్యవస్థ ప్రస్తుతం అత్యంత క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటోంది. రాష్ట్ర విద్యాశాఖలో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని పాలనాపరమైన లోపాల నుంచి ఇటీవల తీసుకొచ్చిన సాంకేతిక నిబంధనల వల్ల ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నారు. ఈ పరిస్థితి ఉపాధ్యాయుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని ఈ విశ్లేషణ స్పష్టం చేస్తోంది. విద్యావ్యవస్థకు పట్టిన పెద్ద శాపం ఉమ్మడి సేవా నియమావళి పెండింగ్ అని చెప్పకతప్పదు. అది పరిష్కారం అయితే జిల్లా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, జూనియర్ అధ్యాపకులు వంటి అన్ని రకాల పదోన్నతులు, పర్యవేక్షణ పదవులు భర్తీ అవుతాయి. కానీ ప్రభుత్వం ఆ సమస్య మీద చిత్తశుద్ధి చూపక, ఆయా పదవుల తాలూకు బడ్జెట్ మిగులుతుందని సంబరపడుతుంది. తాత్కాలిక బాధ్యతలు (నిర్వాహక బాధ్యతలు) పెట్టుకోవడానికే ఏండ్ల సమయం పట్టింది. దానికి తోడు పెద్ద బడుల్లో ఉన్న సీనియర్ ఉపాధ్యాయులను పర్యవేక్షణ పేరిట నోడల్ అధికారి, సమూహ అధికారి అంటూ తాత్కాలిక నియామకాలపై తరలిస్తూ, వారి అసలు పని చేయకుండా, వ్యవస్థను పాడు చేస్తున్నారు (డిస్టర్బ్ చేస్తున్నారు).

**సాంకేతికత భారంగా.. ముఖ హాజరు ఒత్తిడిగా?**

విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు విధానం ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో బోధనకు పెద్ద అవరోధంగా తయారైంది. మెజారిటీగా ఇద్దరు ఉపాధ్యాయులతో నడుస్తున్న పాఠశాలల్లో ఈ ముఖ హాజరు తీసుకుంటున్న సమయం రోజు ప్రారంభానికి చెడుశకునంగా మారింది. సరిగా అంతర్జాల సంకేతాలు లేని ప్రదేశాలు, విద్యార్థుల ముఖాలను గుర్తించలేని సమస్యలు, సమూహ నమోదులో ఉండే అవకతవకలు హాజరుకు అధిక సమయం తీసుకుంటున్నాయి. అప్పుడే ఉత్సాహంగా బడికి వెళ్ళిన గురువుకు ఈ సాంకేతిక పద్ధతి, ఆపై చేతిరాత హాజరు, మధ్యాహ్న భోజనం నమోదు, బడికి రాని పిల్లల ఇండ్ల కు చరవాణి పిలుపులు (ఫోన్ కాల్స్) అంతా అయ్యేసరికి గురువుల ఉత్సాహం హరీ అంటుంది. హాజరు లేని పిల్లలను తదుపరి తరగతికి పంపకుండా ఉండే విధానం మన దగ్గర లేదు. పోనీ హాజరు శాతం తక్కువ ఉన్న పిల్లలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే వ్యవస్థ లేదు. ముఖ హాజరు తీసుకుంటున్నా, దాన్ని తుది ప్రామాణికంగా తీసుకునే అవకాశం లేదు. మళ్ళీ నమోదు పుస్తకం (రిజిష్టర్) హాజరే తుది నిర్ణయానికి ఆధారమవుతుంది. పాఠశాలల్లో సమాచారం ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలుస్తూ ఉండాలి. కానీ దానికోసం ప్రతిరోజు నివేదికలు అవసరం లేదు. చివరకు మధ్యాహ్న భోజనం వివరాలు కూడా రోజు తెలియజేయాల్సిన అవసరం లేదు. నెలాఖరున పంపే నెలవారీ నివేదికలు ప్రామాణికంగా ఉండాలి.




**పరిశోధన అవసరం– పెరిగిన ఒత్తిడి**

ఈ అంతులేని ఒత్తిడి కారణంగా గురువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. గత విద్యా సంవత్సరం ప్రారంభం నుండి అనేక ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న అనేకమంది గుండెపోటుతో మరణించిన అంశాలను పరిశోధించి ఒక సర్వే చేపట్టాలి. మానసిక నిపుణుల సంఘం వేసి ఏ విధానాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి తెలుసుకోవాలి. ఉదయం 9 నుండి సుమారు 11 వరకు బడి, మండల స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు యంత్రాంగం అంతా ఈ అనవసర నివేదికల వివరాల మీద కేంద్రీకృతమై చరవాణి పిలుపులు, సందేశాలతో ఒక సాంకేతిక క్రీడ నడుస్తున్నది. పెద్ద బడుల్లో గణన యంత్రాలు (కంప్యూటర్లు), చిన్న బడిలో సుమారు 27,000 రూపాయల విలువ చేసే ట్యాబ్‌ల ను ఉపాధ్యాయులకు అందించారు. అయితే, ఆ సామగ్రి వినియోగం, నిర్వహణ పరంగా ఎదురవుతున్న సమస్యలపై తగిన సమీక్ష జరగలేదు. ఈ ట్యాబ్‌ల నిర్వహణ, అంతర్జాల వినియోగం కోసం నెలవారీ డబ్బు ఖర్చు అవుతున్నా, అవి నాణ్యమైన బోధనకు ఎంతవరకు తోడ్పడుతున్నాయి అని లెక్కలు తేలలేదు. తరచుగా అంతర్జాల సంకేతాలు లేకపోవడం, విద్యార్థులను గుర్తించడంలో లోపాలు వంటి సాంకేతిక సమస్యల కారణంగా ఈ ట్యాబ్‌లు ఉపాధ్యాయులకు ఉపయుక్తం కాకపోగా, భారంగా మారాయి.

**తాజా నియామకాలతో మరింత కలవరం:**

ఇదిలా ఉండగా, మే 2025 మరియు మొన్నటికి మొన్న పాఠశాలల్లో ‘పాఠశాల తనిఖీ అధికారులు’ అంటూ అరకొరగా ఉన్న ఉపాధ్యాయులలోంచే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1500 పైచిలుకు తనిఖీ బృందాలు త్వరలో నియామకంపై సీనియర్ ఉపాధ్యాయుల్లో కలవరపాటు మొదలైంది. అదేవిధంగా, ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్)లో అర్హత (క్వాలిఫై) సాధించాలనే నిబంధన సీనియర్ ఉపాధ్యాయులలో కలవరపాటుకు, తీవ్ర మానసిక ఆరోగ్య ఇబ్బందులకు దారితీస్తోంది.

## ‘త్రిశంకు’ రూపం



కెనడాకు చెందిన డల్హౌస్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఒక కొత్త ప్రాణిని కనుగొన్నారు. రోహరదా నాయకత్వంలోని శాస్త్రవేత్తల బృందం తాజా నివేదికను అనుసరించి ఇది సంపూర్ణమైన ప్రాణి కాదు. అదే సమయంలో, పూర్తి పదార్థం కూడా కాదు. ఈ రెండు దశలకు మధ్య, సరికొత్త రూపంతో దర్శనమిస్తున్న ఈ జీవి పేరును ‘కాండిడాటస్ సుకునారచాయుమ్ మిరాబైల్’ అని నిర్ధారించారు. ఇందులోని జన్యు సంకేతాల ‘జెనోమ్’ చిన్నదే. అయితే, అది సాధారణ ఆర్కియా జీవుల్లో కనిపించే జెన్స్ మొత్తంతో పోలిస్తే మరింత తక్కువ. డిఎన్ఎను మార్చడం, ఆర్ఎన్ఎను తయారు చేయడం, ప్రొటీన్లను సిద్ధం చేసుకోవడం వంటి పనుల కోసం అవసరమైన జెన్స్ ఈ జీవిలో ఉన్నాయి. కాబట్టి దీనిని వైరస్‌గా భావించడానికి వీల్లేదు. ఎందుకంటే, వైరస్‌లలో ఇలాంటి లక్షణాలు కనిపించవు. అదే సమయంలో, ఇది ఎక్కువ సందర్భాల్లో మెటబాలిజం సంబంధిత మార్గాలు చాలా తక్కువగా కలిగి ఉంది. అంటే, ఇది పని చేయడానికి వాతావరణం లేదా హోస్ట్ జీవి అవసరం. మరో రకంగా చెప్పాలంటే, ఇదొక పరాన్న జీవి. సాధారణంగా వైరస్‌లలో ఈ లక్షణాన్ని చూడవచ్చు. మొత్తంగా చూస్తే, ఈ కొత్త రూపానికి కొన్ని వైరస్ లక్షణాలు, మరికొన్ని పదార్థ లక్షణాలు ఉన్నాయి. అందుకే, శాస్త్రవేత్తలు దీనిని ఒక జీవవైరస్ ఉద్భవానికి ముందున్న దశగా భావిస్తున్నారు. జీవం లేదా పదార్థం అని వర్గీకరించడానికి వీల్లేని స్థితిలోని ఈ జీవిపై ఇంకా ప్రయోగశాలలో అధ్యయనం జరుగుతున్నది. ఈ పరిశోధనలు కొత్త జీవ సిద్ధాంతాలకు దారితీసే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.

## వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఇండ్లు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం తీసుకువచ్చిందని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరి చేసిన ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు, డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని 38వ వార్డులోని తాటి కృష్ణవేణి అనే లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తుందని త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఎస్‌సి సెల్ వైస్ ఛైర్మన్ చింతమళ్ళ రమేష్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు గండూరి రమేష్, వైద్య శైలేందర్, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ పాల్గొన్నారు.

## బంద్‌కు ఎఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/యాదాద్రి :** బిసి రిజర్వేషన్ల సాధనకు వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన బిసి ఐక్య కార్యాచరణ కమిటీ (బిసి జెఏసి) బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొంటామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు అనంతుల నరసింహా, కంబాల వెంకటేష్, దండేబోయిన సురేష్, మల్లేష్ పాల్గొన్నారు.



## నేడు సాగర్‌లో ఏపి గవర్నర్ పర్యటన

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నందికొండ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నేడు నాగార్జునసాగర్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ పర్యటన సందర్భంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ పర్యటన సందర్భంగా శుక్రవారం ఆమె స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ను పరిశీలించారు. అదేవిధంగా గవర్నర్ నాగార్జున కొండను సందర్శిస్తున్న సందర్భంగా లాంచి స్టేషన్ లోని ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం ఆమె జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఏపి గవర్నర్ పర్యటన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు ప్రోటోకాల్ ప్రకారం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. వీరి వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,అదనపు ఎస్ పి రమేష్, పర్యటకశాఖ అధికారులు, రెవెన్యూ ,పోలీస్, ఫైర్ శాఖల అధికారులు ఉన్నారు.

## ఓటు చోరీపై సంతకాల సేకరణ



**ప్రజాపక్షం/దేవరకొండ:** బిజెపి చేసిన ఓటు చోరీపై ప్రజలకు అవగాహన కల్పించేలా సంతకాల సేకరణ చేపట్టాలని దేవరకొండ ఎంఎల్‌ఎ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలంలోని కొండ్రాల దాలో ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్‌నాయకులు నిర్వహించిన ఓట్ చోర్ సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఓట్ చోరీ పద్ధతి లోనే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిందని ప్రజలందరూ బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. ఓటు చోరీపై జరుగుతున్న అవకతవకలు ఓట్ల తొలగింపు మొదలైన అంశాలను స్థానిక ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపిటిసి బిక్కు, జీవన్‌రెడ్డి, రాంసింగ్, లక్ష్మణ్, రాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

## దళారులకు చోటు ఇవ్వొద్దు

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ధాన్యం కొనుగోలులో రైతులు దళారులకు చోటు ఇవ్వకూడదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం, తిమ్మాపురం గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందన్నారు. దళారుల బారిన పడి నష్టపోకుండా ఉండేందుకే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి మద్ధతు ధర ఇస్తుందన్నారు. రైతుల సంతోషమే ప్రభుత్వ సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ గోపి, ఏఓ గణేష్, పిఏసిఎస్ ఛైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి, ఏపిఓ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు సామ అభిషేక్ రెడ్డి, ఇందుర్తి వెంకట్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు వాసుదేవరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై ఉద్యమం



**ప్రజాపక్షం/చింతపల్లి :** విద్యారంగంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి విద్యార్థి లోకమంతా ఉద్యమించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎర్ర రవి పదకొండవ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్మారక స్థూపానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవి విద్యార్థులు హక్కులకోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేశారన్నారు. సమసమాజ స్థాపన కోసం, శాస్త్రీయ విద్యా విధానం కోసం, పాఠశాలలు, హాస్టల్స్ సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. రవి ఆశయసాధన కోసం విద్యార్థి లోకం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శంశొద్దీన్, నాయకులు కోటేష్, ఆరెకంటి మురళీ, భవ్య, మనీషా పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లు సాధిద్దాం

**ప్రజాపక్షం/మోటకొండూరు :** తెలంగాణా రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం నేటి బంద్‌లో బిసి బిడ్డలు అందరు స్వచ్ఛందంగా పాల్గొనాలని, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన ప్రజాపక్షం విలేకరితో మాట్లాడుతూ బిసి బిడ్డల కోసం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కృతనిశ్చయంతో ఉన్నదని, కేంద్రంలో బిజెపి సర్కార్ వేనుకడుగు వేస్తుందని, కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో బిఆర్ఎస్‌లు రెండు ఒకటేనని అన్నారు. నేడు రాష్ట్రంలో జరిగే బంద్‌లో బిసి బిడ్డలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# రైతులను దోచుకోవడం ఆగేదెప్పుడు?

**అక్రమాలకు తావులేకుండా ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేనా...!**



**రైతుల సంక్షేమం కోసం వారు పండించిన పంటను దళారులకు అమ్ముకొని నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వారి ముంగిటే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది. కానీ సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అధికారులు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులను దోచుకుంటున్న పరిస్థితి. ధాన్యం కొనుగోలు నిర్వాహకుల నుండి మొదలుకొని మిల్లర్ల వరకు రైతులను దోచుకుంటున్నారన్నది అక్షర సత్యం. ఈ దోపిడీపై రైతులు ప్రతి సీజన్‌లో గగ్గోలు పెడుతూ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం మాత్రం శూన్యం. ఈ యాసంగి సీజన్‌లోనైనా కొనుగోలు కేంద్రాలలో అక్రమాలకు తావు లేకుండా జరిగేనా? లేదా? అన్న దానిపై రైతుల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది.**

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో రైతులు 4.82 లక్షల ఎకరాలలో వరి సాగును చేశారు. దీని ద్వారా 10.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు నివేధిక ఇవ్వగా దానికి అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 298 కొనుగోలు కేంద్రాలను పౌర సరఫరాల శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో ఐకెపి కేంద్రాలు 158, పిఏసిఎస్ 112, మెప్మా 13, ఎఫ్‌పిఓ 15 కేంద్రాలు ఉన్నాయి. ఈ 298 కొనుగోలు కేంద్రాలలో 195 కేంద్రాలు సన్న ధాన్యం, 103 దొడ్డు ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేశారు. రైతులు పండించిన వరి ధాన్యంలో 4.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. వర్షాభావ పరిస్థితులతో పాటు కొనుగోళ్ళలో ఒత్తిడి తగ్గించేందుకు గతం కంటే ముందుగానే అధికారులు ఈ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు, ధాన్యం తరలింపుకు వాహనాల ఏర్పాటు చెకచెక చేశారు. జిల్లాలో క్లీన్‌చిట్‌గా ఉన్నా 50 మిల్లర్లకు ధాన్యం కేటాయించేందుకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పర్యవేక్షణలో పౌర సరఫరాల అధికారులు పలుమార్లు చర్చలు జరిపారు. రెండు, మూడు రోజుల్లో మిల్లర్లకు ధాన్యం కేటాయింపు ఓ కొలిక్కి రానున్నదని అధికారులు చెబుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా కొనుగోలు కేంద్రాలలో రైతులను దోచుకోవడం మాత్రం ఆగడం లేదన్నది రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన నాటి నుండి సూర్యాపేట జిల్లాలో రైతులను దోచుకోవడం ఆగడం లేదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు,మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై దోచుకుంటున్నారని రైతులు రోడ్డెక్కిన సందర్భాలు కూడా లేకపోలేదు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకెళ్ళగా తేమ, చెత్త, పెళ్ళ పేరుతో నిర్వాహకులు బస్తాకు 2, 3 కిలోలు కోత పెడుతున్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే తేమ, చెత్త, చెదారం పేరుతో మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా కొర్రీలు పెడుతూ రోజుల తరబడి తమ మిల్లుల వద్దనే రైతులను పడిగాపులు కాయిస్తున్న పరిస్థితులు ప్రతి సీజన్‌లో జరుగుతుంది. వారు పెట్టే ఇబ్బందులు తాళలేక చివరకు రైతులు మిల్లర్ల నిర్ణయానికే వదిలిపెట్టి తెగనమ్ముకుంటున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రతి సీజన్‌లో రైతులను దోచుకుంటున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లను ఈ సారైనా సంబంధిత అధికారులు కట్టడి చేసి కొనుగోళ్ళు సజావుగా జరిగేలా చూడాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మద్ధతు ధర ఇస్తుందన్నది వాస్తవమేనైనా రైతులు మాత్రం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మి క్వింటాకు రూ.200 నుండి రూ.500 వరకు నష్టపోతున్నారు. ఇదేమని నిర్వాహకులను, మిల్లర్లను ప్రశ్నిస్తే రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి, శుద్ధి చేసి తీసుకరావడం లేదని దీనివల్ల తాము కోతలు పెడుతున్నామని బహిరంగంగా చెబుతున్నారు. వీరి వాదన ఇలా ఉంటే రైతులు మాత్రం తేమ శాతం పేరుతో తమ ధాన్యాన్ని కాంటాలు వేయకుండా ఉంటే రోజుల తరబడి అక్కడే ఆరబెట్టుకొని తేమ శాతం 17 లోపు వచ్చిన తరువాతే కాంటాలు వేస్తున్నారని వాపోతున్నారు. ఇందులో నిర్వాహకులు, మిల్లర్లు చెప్పేది వాస్తవమా లేక రైతులు చెప్పేది వాస్తవమన్నది అధికారులపై తేల్చాల్సిన బాధ్యత ఉంది. గతంలా కాకుండా ఈసారైనా దోపకాన్ని అరికట్టి కొనుగోలు సాజావుగా జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

## 72 గంటల్లో రైతుల ఖాతాలలో డబ్బులు జమ

రాష్ట్రంలో అత్యధిక ధాన్యం పండించే జిల్లాలలో నల్లగొండకు 2వ స్థానం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి):** రైతులు ధాన్యం అమ్మిన డబ్బుల కోసం నిరీక్షించాల్సిన అవసరం లేదని, 72 గంటల్లో వారి ఖాతాలలో జమ చేస్తామని, ఒకవేళ డబ్బులు జమ కాకుంటే తనకు నేరుగా ఫోన్ చేయవచ్చు అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ధనవంతుల మాదిరిగానే సన్నబియ్యం తినాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పెదలందరికీ రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నదని, అందువల్ల సన్నబియాని ఎక్కువగా పండించాలన్నారు. నిజామాబాద్ జిల్లాలో 75సన్నబియ్యం పండిస్తున్నారని, అందువల్ల నల్లగొండ జిల్లాలో సైతం సన్నబియ్యనికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం అయన తిప్పర్తి మండలం,కంకణాలపల్లి,అంతాయ గూడెం, మామిడాలపల్లి గ్రామాలలో ఐకెపి ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలసి ప్రారంభించారు. అంతేగాక కంకణాలపల్లి లో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు.మండల కేంద్రంలో దాన్యాన్ని తరలించే లారీలను జండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మాట్లాడుతూ రైతుల కళ్ళల్లో సంతోషాన్ని చూడడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందుకే ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు చెల్లించేందుకుగాను రూ. 25వేల కోట్లు క్యాబినెట్ కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోనే జిల్లా అత్యధికంగా ధాన్యం పండించే రెండవ జిల్లాగా నిలిచిందని, అయితే రైతులు సన్న ధాన్యాన్ని ఎక్కువగా పండించాలన్నారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా 6600 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామని,4500 కోట్ల రూపాయలకు ఇటీవలే క్యాబినెట్ అనుమతి తీసుకున్నామన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి జనవరిలో రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్లు,గ్రామాల నుండి మండలాలకు సింగిల్ రహదారి సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ధాన్యం లారీలకు జండా ఊపి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,డిఎస్ఓ వెంకటేష్,పౌర సరఫరాల డిఎం గోపికృష్ణ ,డి సిఓ పత్యానాయక్, డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి, పాశం రాంరెడ్డి పాల్గొన్నారు.



## సకాలంలో ధాన్యం కొనుగోళ్లు

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/ భూదాన్ పోచంపల్లి :** సకాలంలో ధాన్యం కొనుగోల్లు పూర్తిచేసి రైతులకు మేలు జరిగేలా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కొనుగోలు జరిగిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన పోచంపల్లి పిఎసిఎస్, రేవణపల్లి, గోసుకొండ గ్రామాలలో మెప్మ ఐకెపి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్థి చేయాలని తెలిపారు. రైతులు వర్షాలకు ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకుని కాపాడుకోవాలని కోరారు. గతంలో ఎన్నడు లేని విదంగా అధికారులతో రివ్యూ మీటింగ్‌లు పెట్టి వడ్ల కోనుగోల్లు వేగవంతం చేయడంలో ప్రభుత్వం ముందుందని అన్నారు. భారతదేశంలోనే ధాన్యం కొనుగోలు తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నదని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఏడు కూడా రికార్డు స్థాయిలో ఎలాంటి అవకతవకలు లేకుండా ధాన్యం సేకరణ పూర్తి చేసి రైతులకు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న వారందరికీ ప్రయోజనం చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ కందడి భూపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, వైస్ ఛైర్మన్ మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

## విద్య ద్వారానే సమాజంలో మార్పు



అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలి

: జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఆకాశమే హద్దుగా కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అని చెప్పిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ విద్యార్థులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో మహిళ, శిశు, వికలాంగులు, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలిక దినోత్సవం 2025 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటకు కొత్తగా వచ్చినప్పుడు అబర్షన్ చేయడం ద్వారా ఒక మహిళ మృతి చెందినట్లు తెలియడంతో తనకు బాధ కలిగిందని చైతన్యవంతమైన జిల్లాలో కూడా ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. సమాజంలో ఉన్న మహిళా సమస్యలను పరిష్కరించేందుకు ఒక వ్యవస్థ రూపంలో ధృడ సంకల్పంతో ముందు కెళ్ళాలని ఒక నిర్ణయం తీసుకొని బాలికా చైతన్యం పేరిట ప్రతి పాఠశాలలో విద్యార్థులకు పోలీస్, వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ, విద్యా శాఖల ద్వారా నెలకు 4 వారాలలో ఏదో ఒక వారం సమాజంలో ఉన్న సమస్యలపై, పోషణ, భద్రత, సైబర్ నేరాలు, మహిళా సాధికారత, కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్య ద్వారా ఏది తప్పు, ఏది ఒప్పు అనేది తెలుస్తుందని, విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు పొందవచ్చని చెప్పారు. జీవితంలో సామాజికంగా, ఆర్థికంగా స్థిరపడవచ్చన్నారు. విద్యార్థులు కలాం స్ఫూర్తితో కలలు కని వాటిని సాకారం చేసుకోవాలని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ లింగ వివక్షను మొగ్గ దశలోనే నిర్మూలించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోలీస్ బృందం వారు మహిళలు, బాలికల రక్షణ, చదువు గొప్పతనంపై పాడిన పాటలను తిలకించారు. ఈ కార్యక్రమంలో డిడబ్లుఓ నరసింహారావు, సిడబ్లుసి ఛైర్మన్ రమణారావు, డిఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్, షీ టీం స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ నీలిమ, జిసిడిఓ పూలన్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య రీతిలో జిల్లా అధ్యక్షుడి నియమాకం

ఎఐసిసి పరిశీలకుడు శరత్ రౌత్



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** అఖిలభారత కాంగ్రెస్ పార్టీ నాయకులు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సూచన మేరకు ప్రజాస్వామ్య రీతిలో భారతదేశ వ్యాప్తంగా జిల్లా అధ్యక్షులు నియమాకం ఉంటుందని ఏఐసీసీ పరిశీలికలు ఒరిస్సా రాష్ట్ర మాజీ మంత్రివర్యులు శరత్ రౌత్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ ఆదేశాలతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంపిక సంబంధించి ఏఐసీసీ పరిశీలికలు ఒరిస్సా రాష్ట్ర మాజీ మంత్రివర్యులు శరత్ రౌత్ పిసిసి అబ్జర్వర్ రఘునాథ్ హాజరైయారు. ఈ సమావేశం కార్యక్రమం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఐసీసీ పరిశీలికలు శరత్ రౌత్ మాట్లాడుతూ గ్రామస్థాయి కాంగ్రెస్ కార్యకర్త నుండి ప్రజాసంఘాల నుంచి ప్రజల్లో మమేకమైన కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయత పార్టీ పట్ల క్రమశిక్షణగా ఉన్న వ్యక్తులను నియమించడం కోసం ప్రజాస్వామ్య రీతిలో ఈ ఒక్క ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల శామ్యూల్, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తుల అరెస్టు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని కొండమడుగు మోట్టు సర్వీసు రోడ్డు వద్ద స్థానిక పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులపై అనుమానాస్పందంగా విచారించగా వారి వద్ద గంజాయి లభించినట్లు స్థానిక ఎస్‌హెచ్‌ఓ ఎం.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. టీఎస్11టి1817 నెంబర్ గల ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు సికింద్రాబాద్ బోడుప్పల్‌కు చెందిన భూక్య ఆజాద్ నాయక్, హయత్ నగర్ కుంట్లురు రావి నారాయణరెడ్డి కాలనీకి చెందిన వల్లపు వంశీ, మేకల స్టాలిన్, బుడ్డ సునీల్ అనే నలుగురు వ్యక్తులను విచారించగా ఛత్తీస్‌ఘడ్ నుంచి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడి ప్రాంత యువకులకు అమ్ముతున్నట్లుగా వారు తెలిపారు. వారి వద్ద నుండి 1.394 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై చట్టరిత్య కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సిఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. వారి వెంట ఎస్సై రమేష్, అమర్ సింగ్, హెడ్ కానిస్టేబుల్ అరవింద్ కుమార్, బి.అంజయ్య, పి.శ్రీనివాస్, ఏ.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ మేళాకు పటిష్ఠ భద్రత



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ పట్టణంలో పెరల్ ఇన్ఫినిటి ఇంటర్నేషనల్ ప్రాంగణంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాకు పటిష్ట పోలీస్ భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించే ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ ఉమ్మడి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుండి 20వేల మంది నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. బందోబస్తు విషయంలో ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు తీసుకుంటున్నామని చెప్పారు. సింగరేణి గ్యాలరీస్, రాష్ట్ర డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఆథారిటి ఆధ్వర్యంలో 150 కంపెనీలు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని చెప్పారు. దీనిని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ చలమందరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐ మోహన్‌బాబు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 21వ వార్డులో పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరి చేరవన్నారు. తమ పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు మురుగు కాలువలలో చెత్తా చెదారం పోయవద్దన్నారు. అనంతరం దోమల నివారణ కోసం కాల్వల్లో టెమోఫోస్ మందును పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, ఇన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, టిఎంసి శ్వేత పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

**ప్రజాపక్షం/కృష్ణ :** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి నిజాముద్దీన్ అన్నారు. శుక్రవారం కృష్ణ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముడుమాలలో మండల విద్యాధికారి నిజాముద్దీన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నింగమ్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్, కిశోర్ కుమార్, పీఆర్టియూటియస్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు వై. జనార్ధన్ రెడ్డి, సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకు సైన్స్ పరిష్కారం చూపుతుందని, ఎవరూ కూడా మూఢనమ్మకాలను విశ్వసించకుండా శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం సైన్స్ కరదీపికలను ఆవిష్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుర్మన్న, శ్రీనివాస్, మాధవి, రమేష్, తిమ్మప్ప, మీనా కుమారి, గీత, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈరన్న, దండు శేఖర్, ఉపాధ్యాయులు రాఘవేందర్, శివరాజ్, అజయ్, సలీం, గ్రామ యువకులు వై.కృష్ణయ్య, డి.రాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ఎంఇఒ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో మోడల్ స్కూల్‌ను ఎంఈఓ గాయత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలన చేశారు. పాఠశాలకు సరఫరా అయిన మధ్యాహ్న భోజనం బియ్యాన్ని సూన్యంగా పరిశీలించారు. విద్యార్థులకు వండించే బియ్యం ఎప్పటికప్పుడు పరిశీలించి బాగాలేని బియ్యాన్ని వెంటనే రిటర్న్ పంపించాలని ఎంఈఓ చెప్పారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఎంఈఓ ఆదేశాలు ఇచ్చారు.



## కల్యాణలక్ష్మి చెక్కులు మంత్రి పంపిణీ

**ప్రజాపక్షం/మాగనూర్ :** కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి మాగనూర్ మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 45 మంది లబ్ధి దారులకు కల్యాణలక్ష్మి 44, షాదీ ముబారక్ 1 చెక్కులను పంపిణీ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సురేష్, ఆర్ఐ శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్, నరసింహ రెడ్డి, శివరాం రెడ్డి, రవీందర్, దూల తిప్పయ్య, దండు ఆనంద్‌తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొంటాం

### జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. సంతోష్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** బిసిలకు సంబంధించిన 42 శాతం బిల్లు ఆమోదానికి అడ్డుకట్ట చేస్తున్న తీరుకు నిరసనగా నేడు నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతిస్తుందని సిపిఐ నారాయణ పేట జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సంతోష్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు జరిగే రాష్ట్ర బంద్‌లో జిల్లా వ్యాప్తంగా సిపిఐ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని బిసి సంఘాల జేఏసీ ఇతర రాజకీయ ప్రజా సంఘాలతో కలిసి బంధువులు విజయంతో చేయడానికి తమ పార్టీల నాయకత్వం అంత కృషి చేస్తుందని ఆయన గుర్తు చేశారు.

## బంద్‌లో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలి



### డిసిసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బీసీ రిజర్వేషన్‌ను ముందుకు తీసుకెళుతుంటే కొన్ని దుష్టశక్తులు ఆపాలని ప్రయత్నాలు చేస్తున్నాయని డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ కోసం నేడు జరిగే తెలంగాణ బంద్‌లో జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలని కోరారు. ఉదయం నుంచి ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకుడు మైత్రి యాదయ్య మాట్లాడుతూ బీసీలకు 42 శాతం కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. కానీ బీజేపి ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చడం లేదని ఆరోపించారు. బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని మద్దతు పలకాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందంటే కచ్చితంగా చేసి తీరుతుందన్నారు. సమావేశంలో డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిబాబా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్ పాల్గొన్నారు.

## సిపిఆర్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ ఉట్కూర్ :** ఉట్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జెడ్‌పిహెచ్‌ఎస్ బాలుర, బాలికల పాఠశాలలో సిపిఆర్ కార్డియో పల్మనరీ రీససిటేషన్ శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణరక్షణ చర్యల పై అవగాహన కల్పించడమే ఈశిక్షణ లక్ష్యమని వైద్య అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యం.యల్. యచ్.పి సూపర్వైజర్, సిబ్బంది నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొని సిపిఆర్ విధానం, దాని అవసరం, ప్రాథమిక దశలు వంటి అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ పొందారు. నిపుణుల సిపిఆర్ ద్వారా ప్రమాదంలో ఉన్న వ్యక్తుల ప్రాణాలను రక్షించగల ముఖ్యమైన పద్ధతులపై వివరించారు.

## ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను, పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణపేట బస్టాండ్ ,ప్రధాన చౌరస్తాలలో నారాయణపేట పోలీసులు ఆకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలన్నారు.

## అభి సాయిదత్త ఆశ్రమానికి ఫ్యూజన్ హెల్త్‌కేర్ రూ.3 లక్షల విరాళం

**హైదరాబాద్ :** హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన ఫ్యూజన్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమం ద్వారా ఉప్పల్‌లోని అభి సాయిదత్త ట్రస్ట్ పిల్లల ఆశ్రమానికి రూ.3లక్షల విలువైన నిత్యావసర సామగ్రి, పుస్తకాలు, పిల్లల చదువుకోసం అవసరమైన వస్తువులను అందించింది. ఆశ్రమ పిల్లల అభ్యున్నతి కోసం చేస్తున్న ఈ సేవా చర్యను ట్రస్ట్ నిర్వాహకులు అభినందించారు. భవిష్యత్తులో కూడా అవసరమైన ప్రతి విషయంలో తోడుగా ఉంటామని కంపెనీ ప్రతినిధులు భరోసా ఇచ్చారు. ఆశ్రమ నిర్వాహకుడు ప్రసాద్ మాట్లాడుతూ... మాకు ఇంత మంచి సహాయం అందించిన ఫ్యూజన్ హెల్త్‌కేర్ యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు. సంస్థ ఇంకా మరింత అభివృద్ధి చెందాలని దేవుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మధు రామడుగు, వైస్ ప్రెసిడెంట్ ప్రకాశ్ గంగాధరన్, మేనేజర్ రాయ్ రవికుమార్, ఫైనాన్స్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని రంగాలను అభివృద్ధి చేస్తాం

### వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేసే దిశలో పయనిస్తున్నాదని... ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని వైద్య శాఖా మంత్రి దామోదర రాజానర్సింహ అన్నారు. శుక్రవారం మక్తల్ పట్టణంలోని పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్‌లో చేప పిల్లలు విడిచే కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి ఆయన చేప పిల్లలను వదిలారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చేప పిల్లలు ప్రభుత్వం ద్వారా వదలడం వల్ల మత్స్య కారులపై ఆర్థిక భారం తగ్గుతుందని, కొన్ని నెలల తరువాత చేపలు పెద్దగా కావడం వల్ల ఆ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. మక్తల్ నియోజకవర్గం పక్కనే కృష్ణా నది పారుతున్నా గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాంతానికి నీళ్లు రాలేదన్నారు.కాంట్రాక్టర్లను బతికించడానికే గత పాలకులు ప్రాజెక్టులు నిర్మించి మధ్యలో వదిలేసి జిల్లాను సాగునీటి రంగంలో వెనుకబడేసిందన్నారు. బీఆర్ఎస్ పాలకుల మాటలే తప్ప చేతలు లేవున్నారు. మైక్ పట్టుకున్న ప్రతిసారి జీవో 69 అని కాగితాలు చూపించి మాత్రమే కాలం వెళ్లదీశాకే కానీ ప్రాజెక్టు పూర్తి చేయలేదని మంత్రి ఆరోపించారు. ఈ ప్రాంతం వెనుబాటు తనానికి గురి అయిందని గుర్తించి, జీవో నెం 69 ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలని నారాయణపేట మక్తల్ కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతం అభివృద్ధి కావాలని కృషి చేస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. కాంట్రాక్టర్ల కోసం పక్కనే ఉన్న ప్రాజెక్టు మూసివేసి ఇక్కడ ఉన్న నీళ్లను శ్రీశైలం దగ్గర ఏలూరు బ్యాక్ వాటర్‌కి తరలించి అక్కడి నుంచి నాగర్ కర్నూలు, జడ్చర్ల, మరికల్, నారాయణ పేటకు నీళ్లు ఇచ్చే పరిస్థితి వచ్చిందన్నారు. 30 కిలోమీటర్ల దూరంలో కృష్ణమ్మ నీళ్లు ఇస్తుంటే 330 కిలోమీటర్ల దూరం టెలర్స్ పెట్టడం జరిగిందన్నారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా కాలువలకు నీళ్లు ఇస్తాం అని కథలు చెప్పారు కానీ ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. నారాయణ పేట మక్తల్ కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేస్తామని ముందుకు వెళుతుంటే గులాబీ నేతలు అడుగడుగునా అడ్డుకోవాలని చూస్తున్నారని మంత్రి అన్నారు. భూ సేకరణలో భాగంగా భూములు ఇచ్చిన రైతులకు మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో ఎకరానికి రూ.14 లక్షలు ముందుగా ప్రకటిస్తే రూ.20 లక్షలు పెంచి ఇచ్చామన్నారు. ఈ ప్రాంతం వెనుకబాటుతనానికి గురి కాకుండా రైతులు స్వచ్ఛందంగా ఈ ప్రాజెక్టుకు భూమి ఇవ్వడం జరిగిందన్నారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపుగా రూ.123 కోట్ల ప్రభుత్వం కేటాయించిందన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మత్స్య శాఖ కేటాయించడం దేశంలోనే ఇదే మొదటిసారన్నారు. గతంలో చేప పిల్లల పంపిణీలో అక్రమాలు జరిగాయన్నారు. అన్ని చెరువుల దగ్గర చేప గుర్తు వున్న బోర్డు ఏర్పాటు చేశామని, ఇందులో చేప రకం, ఎన్ని చేపలు వదిలాం, సంఘం అధ్యక్షుడు పేరు అందులో వివరాలు ఉంటాయని మంత్రి వెల్లడించారు. ఈరోజు విడిచిన చేపల పంపిణీ ద్వారా 5 లక్షల కుటుంబాలకు ఉపాధి కలుగుతుందన్నారు. మక్తల్ పట్టణంలో మినీ ట్యాంక్ బండ్ బ్యూటీఫికేషన్ పనులు దాదాపుగా రూ.4 కోట్లతో ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఈ పనులు కూడ అడ్డుకోవడానికి బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నం చేశారన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో మక్తల్ నియోజకవర్గానికి 2 ఆసుపత్రులు, ఆత్మకూరు రూ.22 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం, మక్తల్ ప్రాంతంలో రూ.42 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం, 2 డయాలసిస్ సెంటర్లు,5 అంబులెన్స్‌లు, అమరచింత మండల కేంద్రంలో ఉన్న ఆసుపత్రికి 23 మంది వైద్య శాఖ స్టాఫ్‌ను కేటాయించారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బిసిలను మోసగిస్తున్న కొన్ని రాజకీయ పార్టీలు



సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని శనివారం బిసి జేఏసి ఆధ్వర్యంలో తలపెట్టిన బిసి జేఏసి బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో లక్ష్మ ణాచారిభవనంలో సిపిఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐరాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి పాల్గొని మాట్లాడుతూ బిసిలకు 42శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలంటూ జరిగే రాష్ట్రబంద్ పిలుపు మేరకు గ్రామీణ ప్రాంతాలు ఉండే బిసిసంఘాలు సైతం బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఉండే వ్యాపారస్తులు అఖిలపక్షం సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కొన్నిపార్టీలు బిసిలను మోసగిస్తున్నారని ఆయన విమర్శించారు. అధికారంలో ఉన్న బిసి ఎమ్మెల్యేలు, ఎంపిలు అధికారంలో ఉండి ఢిల్లీ సైతం బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐపార్టీ అనుబంధ సంఘం తెలంగాణ బిసి హక్కుల సాధన సమితి, జిల్లా అధ్యక్షులు కపిలవాయి గోపిచారి, సిపిఐ జిల్లా కౌన్సిల్‌సభ్యులు మర్యాదవెంకటయ్య, శివశంకర్, సిపిఐ నాగర్‌కర్నూల్ పట్టణ సహాయ కార్యదర్శి కొత్తరామస్వామి, బిసిహక్కుల సాధన జిల్లా నాయకులు పూసల సుధాకర్, సిపిఐ నాయకులు చిన్నపాగ శ్రీనివాసులు, వాడాలబాలపీరు పాల్గొన్నారు.

## బంద్‌కు ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం సంపూర్ణ మద్దతు

### ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** బిసి రిజర్వేషన్ల సాధనకు వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన బిసి ఐక్య కార్యాచరణ కమిటీ (బిసి జెఎసి) బంద్ ఫర్ జస్టిస్ పేరుతో ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని బంద్‌లో ప్రత్యక్షంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గం వ్యాప్తంగా పాల్గొంటామని తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉందని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద నిన్న హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. గవర్నర్ వద్ద పెండింగు ఉన్న బిల్లులు నిర్ణీత కాలపరిమితి లోగా ఆమోదం లభించకపోతే, నోటీఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. కేంద్రంలో అధికారంలో బిజెపి ఉండడం వల్లనే ఈరోజు ఈ రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బిజెపిని భూస్థాపితం చేయాలని అన్నారు.

## నేటి బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు



### సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాల్‌కిషన్ వెల్లడి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** నేడు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాలు రాజకీయ పార్టీలు బందు చేస్తున్న సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కూడా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఒక ప్రకటనలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాల్‌కిషన్ వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి షెడ్యూల్ 9లో చేర్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న బిజెపి నేతలు మాట్లాడకుండా బీసీలను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీ వెళ్లి ప్రధాని వద్ద ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా బిజెపి దాటవేత ధోరణి చేస్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించకుంటే ఆందోళనలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి జిల్లా కౌన్సిల్ సభ్యులు పట్టణ కార్యదర్శి కోటకదిర నరసింహ, సత్యనారాయణరెడ్డి, చాంద్ భాషా, ఏఐవైఎఫ్ కో కన్వీనర్ మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ పట్టణ నాయకులు గంటల శ్రీనివాసులు, సుందర్ రాజు, హనుమంతు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లచెరువు సుందరీకరణ నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం



**ప్రజాపక్షం/వనపర్తి :** జిల్లా కేంద్రంలోని నల్లచెరువు ట్యాంక్‌బండ్‌పై సుందరీకరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన సామాగ్రిని, మొక్కలను సంరక్షించడంలో విఫలమయ్యారని మున్సిపల్ అధికారులపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వనపర్తి జిల్లా కేంద్రంలోని నల్ల చెరువు ట్యాంక్‌బండ్‌తో పాటుతో, ఇండోర్ స్టేడియంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నల్లచెరువు ట్యాంక్ బండ్‌పై సుందరీకరణ పనుల్లో భాగంగా చేయించిన ఏర్పాట్లను వస్తు సామాగ్రిని స్వయంగా పరిశీలించారు. ట్యాంక్‌బండ్‌పై సరైన నిర్వహణ లేక కొద్ది కాలం క్రితం నాటిన మొక్కలు కూడా ఎండిపోయి కనిపించడంతో మున్సిపల్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన వనపర్తి లైటింగ్ బోర్డు, ఇతర వస్తువులను ఏర్పాటు చేయడమే కాదు వాటిని సంరక్షించడం కూడా మన భాధ్యత అంటూ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వాటన్నింటీని మళ్ళీ పునరుద్ధరించాలని, మొక్కలను సైతం తిరిగి నాటించేలా కాంట్రాక్టర్‌కు సూచించాలని కలెక్టర్ ఆదేశించారు. దాంతో పాటుగా ట్యాక్‌బండ్‌కి ఇరువైపులా ఆర్చితో పాటు గేటు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలస్యం చేయకుండా ఈ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. తిరిగి మొక్కలు నాటిన అనంతరం మొక్కలు పాడవకుండా ట్రీ గార్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**ప్రారంభానికి ఇండోర్ స్టేడియం సిద్ధం**


జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో కలెక్టర్ తన సొంత నిధులతో పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేయించిన వుడెన్ షటిల్ కోర్ట్, జిమ్ సెంటర్ ప్రారంభానికి సిద్ధం అయిన నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆడుకోవడానికి వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అకాడమీ విద్యార్థులకు డైలీ ఒక గంట సమయం ఆడుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. తహశీల్దార్ రమేష్, రెడ్డి, మున్సిపల్ కమిషన్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## వలలో చిక్కుకున్న భారీ మొసలి



**ప్రజాపక్షం/పానుగల్ :** పానుగల్ మండలం మందాపూర్ గ్రామానికి అతి సమీపంలో ఉన్న కేశన్న కుంట సమీపంలో వలలో భారీ మొసలి చిక్కుకుంది. గ్రామస్థులు వనపర్తి సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కి సమాచారాన్ని అందించగా కృష్ణసాగర్ తన టీం సభ్యులతో వచ్చి వలలో చిక్కుకున్న మొసలిని పట్టుకొని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. కృష్ణసాగర్ గ్రామస్థులకు పలు సూచనలు చేయడంతో అర్ధరాత్రి సమయంలో మొసలి సంచరిస్తూ తెల్లవారుజామున వలలో చిక్కుకుంది. రోజువారీగా మత్స్యకారుడు చిన్న రాయుడు, రైతు గొబ్బూరి రాజు కుంట మీదుగా వెళుతుండగా వలలో చిక్కుకున్న మొసలి సమాచారాన్ని మాజీ సర్పంచ్ జయ రాములు సాగర్‌కు తెలియజేశారు. వెంటనే వనపర్తి జిల్లా కేంద్రంలో హోంగార్డుగా పనిచేస్తున్న కృష్ణ సాగర్‌కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో తన టీం సభ్యులతో కుంట దగ్గరికి చేరుకొని వలలో చిక్కుకున్న మొసలిని సురక్షితంగా బంధించి ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ గౌతమ్ చిలుక కుమార్, గొబ్బూరు రాజు, మూసిని శ్రీనివాసులు, నాగశేషు, గ్రామ కార్యదర్శి, కారొబార్ సురేష్ గ్రామస్తులు వంశీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బంద్‌కు సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ మద్దతు



**ప్రజాపక్షం/మక్తల్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించని వైఖరిని నిరసిస్తూ జి.ఓ నంబర్9 ఆర్డినెన్సుపై రాష్ట్ర హైకోర్ట్ స్టే విధించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని బీసీ సంఘాలు ఐక్యంగా నేడు రాష్ట్ర బంద్‌కు పిలుపు ఇచ్చాయి. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆందోళనలకు పిలుపు ఇచ్చాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) బలపరుస్తూ స్థానిక టియుసిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు అందులోని మరింత వెనుకనున్న వారికి సామాజిక న్యాయం జరగాలి దానికి ఆయా జనాభా ప్రాతిపదికగా వర్గీకరణ జరిగి, అన్ని ఉపాధి, ఉద్యోగాలు, విద్యా, రాజకీయ పదవుల రంగాలలో తగిన భాగస్వామ్యం అందుకొగలగాలి. 42 % రాజకీయ రిజర్వేషన్ కోసం బీసీ వర్గాలు ఐక్యంగా చేస్తున్న కార్యక్రమాలను సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) క్రియాశీలంగా బలపరుస్తుంది. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ఎస్. కిరణ్, ఏఐయుకెయస్ జిల్లా అధ్యక్షులు భగవంతు, టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎజి భుట్టో, టియుసిఐ జల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయులు, గోపాల్, వెంకటేష్, పివైఎల్ జిల్లా కోశాధికారి మల్లేష్ పాల్గొన్నారు.

## ఇండ్లు త్వరగా నిర్మించుకొని గృహ ప్రవేశం చేసుకోవాలి

### కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించుకొని గృహ ప్రవేశం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. శుక్రవారం కోయిల్‌కొండ మండలం అనంతపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో 10 ఇండ్లు మంజూరు అయినట్లు, వాటి నిర్మాణ ప్రగతి గురించి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు భీమమ్మతో మాట్లాడారు. ఎన్ని చదరపు అడుగులలో ఇంటి నిర్మాణం చేసుకుంటున్నారు. ఎంత ఖర్చు అవుతుంది. తదితర వివరాలు తెలుసుకున్నారు. ఇల్లు కంప్లీట్ అయిన శివరంజని లబ్దిదారు ఇంటిని పరిశీలించారు. ఎక్కువ ఖర్చు చేయకుండా ప్రభుత్వ డిజైన్ ప్రకారం మంచిగా ఇల్లు నిర్మాణం చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలను అందజేసి ఇండ్ల నిర్మాణానికి సహకారాన్ని అందిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా పంచాయితీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను అవగాహన కల్పించాలని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం కోయిల్‌కొండ కోటను జిల్లా కలెక్టర్ సందర్శించారు. కోటను పరిశీలించి నిర్మాణం గురించి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎంపిడిఓ ధనుంజయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పత్రికలపై కక్షసాధింపు తగదు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పత్రికలపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని , పత్రికలు, జర్నలిస్టులు, ఎడిటర్లపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దుష్టనీతిని ప్రదర్శించరాదని జర్నలిస్టులు అన్నారు. శుక్రవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని అంబేద్కర్‌కూడలిలో సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెట్టిన అక్రమకేసులను నిరసిస్తూ నల్లబ్యాడ్జిలు, ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. పత్రికా రంగాన్ని రాజకీయ కోణంలో చూస్తూ అక్రమ కేసులుపెట్టి భయపపెట్టడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కందికొండ మోహన్, జెమినిసురేష్, అహ్మదుల్లాఖాన్,, హకీమ్ కిశోర్, మాధవరెడ్డి, వెంకటేష్, జర్నలిస్టులు రాజేష్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సత్యం, బాలస్వామి, ఎస్ఎస్‌బాబు, వినయ్‌గౌడ్, పరమేష్, మల్లేష్, ప్రదీప్, శ్రీశైలం, బాలు, మహమూద్ పాల్గొన్నారు.

**కల్వకుర్తిలో..** ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, జర్నలిస్టులపై పెట్టిన అక్రమకేసులను వెంటనే ఎత్తివేయాలని కల్వకుర్తి టియూడబ్ల్యూజే ఐజెయు నాయకులు పిలుపునిచ్చారు. అక్రమకేసులను నిరసిస్తూ కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ పత్రికాస్వేచ్ఛపై దాడిని ముక్తకంఠంతో ఖండించారు. కూటమిప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను పక్కనపెట్టి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఐజెయు మండలశాఖ అధ్యక్షుడు జహీర్, జర్నలిస్టు సంఘం నాయకులు శ్రీధర్, రవి, బాలయ్య, నూకంశ్రీను, చారకొండశ్రీను, బాలు, శేఖర్, సమద్, సిరాజ్, ఫయాజ్, దేవరాజ్ పాల్గొన్నారు.

క్రీడ

# గుణరత్నే, డిసిల్వా మెరుపులు..




వర్షం అంతరాయంతో ఐదు గంటలు ఆలస్యంగా సాగిన మ్యాచ్‌లో శ్రీలంక మోస్తరు పరుగులు చేసింది. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 20 ఓవర్లకు కుదించడంతో.. మిడిలార్డర్ బ్యాటర్లు ధనాధన్ ఆడారు. విష్మి గుణరత్నే(34), నీలాక్షి డిసిల్వా(18)లు బౌండరీలతో చెలరేగి జట్టు స్కోర్ దాటించారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 40 రన్స్ జోడించారు. అయితే.. మ్లాబా వేసిన ఆఖరి ఓవర్లో డిసిల్వా, అనుష్కా సంజీవని(1), గుణరత్నేలు ఔట్ కావడంతో.. నిర్ణీత ఓవర్లలో లంక 7 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేయగలిగింది. వరల్డ్ కప్ పదమూడో సీజన్‌లో బోణీ కొట్టేందుకు ఎదురుచూస్తున్న శ్రీలంక టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు విష్మి గుణరత్నే (34), చమరి ఆటపట్టు (11)లు శుభారంభం ఇచ్చారు. కానీ, నాలుగో ఓవర్లోనే గుణరత్నే రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. ఆ తర్వాత వచ్చిన హాసిని పెరీరా(4)ను మసబతా క్లాస్ బౌల్డ్ చేసి తొలి వికెట్ అందించింది. కాసేపటికే చమరి ఆటపట్టును ఎల్బీగా పంపిన క్లాస్.. లంకకు భారీ షాకిచ్చింది. కీలక వికెట్లు పడిన వేళ .. కవిశ దిల్హరి(14), హర్షిత మాధవి (13)లు జట్టును ఆదుకునే ఇన్నింగ్స్ ఆడుతుండగా.. 12వ ఓవర్ పూర్తి కాగానే వర్షం మొదలైంది. వాన పెద్దగా పడడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. అప్పటికీ లంక స్కోర్ 46\2.

### ఐదుగంటల బ్రేక్

ప్రపంచ కప్‌లో ఇప్పటికే రెండు మ్యాచ్‌లను రద్దు చేయించిన వరుణుడు మరోసారి శ్రీలంకను భయపెట్టాడు. అసలే బోణీ కోసం నిరీక్షిస్తున్న ఆతిథ్య జట్టుకు షాకిస్తూ ఏకధాటిగా కుండపోత కురిపించాడు. దాంతో.. మ్యాచ్ సాగడంపై సందేహాలు నెలకొన్నాయి. అయితే.. ఎట్టకేలకు ఐదు గంటల తర్వాత మైదానం సిబ్బంది సూపర్ సాపర్స్ సాయంతో ఆటకు అంతా సిద్ధం చేశారు. ఐదు గంటల మ్యాచ్ జరుగనందున డకవర్త్ లూయిస్ ప్రకారం 20 ఓవర్ల మ్యాచ్ ఆడిస్తున్నారు. దాంతో.. 46/2తో శ్రీలంక ఇన్నింగ్స్ కొనసాగించింది. తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన కవిష దిల్హరి(14) ఔటయ్యింది. డీక్లెర్క్ ఓవర్లో మిడాన్‌లో షాట్ ఆడిన ఆమె లారా వొల్వార్డ్ట్ చేతికి చిక్కింది. ఆ తర్వాత మ్లాబా బౌలింగ్‌లో మాధవి (13) సైతం అదే దిశలో బంతిని గాల్లోకి లేపి.. సఫారీ కెప్టెన్‌కు దొరికిపోయింది. దాంతో.. 63 వద్దే లంక నాలుగు వికెట్లు పడ్డాయి. ఫామ్‌లో ఉన్న ఇద్దరూ ఔటవ్వడంతో నీలాక్షి డిసిల్వా(6), విష్మి గుణరత్నే(22)లు దూకుడుగా ఆడారు డీక్లెర్క్ బౌలింగ్‌లో.. డిసిల్వా రెండు ఫోర్లు, ఆ తర్వాతి మ్లాబా బౌలింగ్‌లో గుణరత్నే రెండు బౌండరీలు బాదగా స్కోర్ వందకు చేరువైంది. అయితే.. చివరి ఓవర్లో సిక్సర్‌కు యత్నించిన డిసిల్వా బౌండరీ లైన్ వద్ద బాష్ చేతికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత సంజీవని, గుణరత్నేలు సైతం ఔట్ కావడంతో లంక 105 పరుగులకే పరిమితమైంది.

## ఐసిఎ అధ్యక్షురాలిగా మాజీ కెప్టెన్


భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ శాంతా రంగస్వామి కీలక పదవికి ఎంపికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో భారత క్రికెట్ సంఘం అధ్యక్షురాలిగా రంగస్వామి ఎన్నికయ్యారు. ఢిల్లీ మాజీ ఓపెనర్ వెంకట్ సుందరం కార్యదర్శిగా .. దీపక్ జైన్ కోశాధికారిగా, జ్యోతి థాటే, సంతోష్ సుబ్రమణియన్‌లు ఐసీఏ ప్రతినిధులుగా ఎంపికయ్యారు. బిసిసిఐ అపెక్స్ కౌన్సిల్‌లో ఐసిఏ ప్రతినిధిగా మాజీ కెప్టెన్ సుధా షా, ఐపిఎల్ పాలక మండిలిలో ప్రతినిధిగా శుభాంగి కులకర్ణిలకు బాధ్యతలు అప్పగించారు. పురుషుల విభాగం నుంచి బిసిసిఐ అపెక్స్ కౌన్సిల్‌కు ఛాముండేశ్వరనాథ్ ఎంపికయ్యారు.



చెన్నైలో జన్మించిన రంగస్వామి భారత క్రికెట్‌లో దిగ్గజ ప్లేయర్. మహిళల జట్టుకు తొలి కెప్టెన్‌గా పేరొందిన ఆమె.. మొట్టమొదటి టెస్టులో వెస్టిండీస్‌పై విజయాన్ని అందించారు. ఆల్‌రౌండర్ అయిన రంగస్వామి 1976 నుంచి 1991 మధ్య కాలంలో ఇండియాకు ప్రాతినిధ్యం వహించారు. కెరియర్లో 16 టెస్టులు మాత్రమే ఆడిన ఆమె.. న్యూజిలాండ్‌పై చరిత్రాత్మక విజయంలో భాగమయ్యారు. ఎనిమిది మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించిన ఆమె మొత్తంగా సుదీర్ఘ ఫార్మాట్‌లో 32.60 సగటుతో 750 రన్స్ సాధించిన రంగస్వామి.. 21 వికెట్లు పడగొట్టారు. మహిళా క్రికెట్‌కు విశేష సేవలందించిన తనకు 1976లో అర్జున అవార్డు లభించింది.

## చెన్నై ఓపెన్‌లో యువకెరటాలు..

### రాజేశ్వరన్, యమలపల్లికి వైల్డ్ కార్డ్ ఎంట్రీ




జూనియర్ స్థాయిలో అదరగొడుతున్న యువ క్రీడాకారిణులకు మాయా రాజేశ్వరన్, సహజ యమలపల్లికి మరో మెగా టోర్నీ అవకాశం దక్కింది. అక్టోబర్ చివరి వారం నుంచి స్వదేశంలో జరుగబోయే చెన్నై ఓపెన్‌లో ఇద్దరికీ వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించింది. డబ్ల్యూటీఏ 250 టోర్నీ అయిన చెన్నై ఓపెన్ అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకూ జరుగనుంది. స్పెయిన్‌లోని రఫెల్ నాదల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మాయా రాజేశ్వరన్ జూనియర్ లెవల్లో చెలరేగిపోతోంది. ఇప్పటికే గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో రాణించిన ఈ యంగ్ స్టర్ ఆస్ట్రేలియా ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌తో పాటు యూఎస్ ఓపెన్ లోనూ పాల్గొంది. అంతేకాదు జూన్‌లో జర్మనీలో జరిగిన గ్రేడ్ 2 ఐటీఎఫ్ ఈవెంట్లో విజేతగా నిలిచింది. స్విట్జర్లాండ్‌కు చెందిన నియోల్లా మంతాను 62, 64తో మట్టికరిపించి ఏడో టైటిల్ ఖాతాలో వేసుకుంది.

సహజ యమలపల్లి కూడా ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉంది. ఇటీవలే మెక్సికోలో ముగిసిన డబ్ల్యూటీఏ 125కే అబియెర్టో టాంపికో టోర్నీలో యూఎస్ ఓపెన్ 2017 ఛాంపియన్ స్లోవనే స్టీఫెన్స్‌ను ఓడించింది యువకెరటం. అంతేకాదు.. 16వ రౌండ్‌లో వరల్డ్ ర్యాంకర్ 125 పెట్రా మర్సింకోను మూడు సెట్ల హోరాహోరీ పోరులో 75, 67, 61తో చిత్తు చేసింది. ఈ ప్రదర్శనకు గుర్తింపుగా యమలపల్లికి చెన్నై ఓపెన్‌లో వైల్డ్ కార్డ్ ఎంట్రీ దక్కింది.


ఫోకస్

సైన్స్




## కాంతి వేగంతో వ్యోమ నౌక!



ఒక వస్తువు ప్రయాణించే వేగానికి సంబంధించి ఎన్నో సిద్ధాంతాలు ఉన్నాయి. కాంతి కంటే వేగంగా ప్రయాణించడం సాధ్యమేనన్న ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. అయితే, అలాంటి పరిస్థితిలో సదరు వస్తువు ఎన్నో అసాధారణ ప్రభావాలకు లోనవుతుంది. మెక్సికో శాస్త్రవేత్త మిగ్వేల్ అల్కుబియెర్ 1994లో చేసిన ప్రతిపాదనను అనుసరించి, వస్తువు కాంతి వేగంతో ప్రయాణించడం అసాధ్యం కాదు. ఈ ఆలోచన ఆధునిక భౌతిక శాస్త్రంలో అత్యంత నూతన భావనకు ప్రతీక. 'అల్కుబియెర్ డ్రైవ్'గా పేర్కొనే అతని సిద్ధాంతం ప్రకారం, ఐన్‌స్టీన్ ప్రతిపాదనలను, అభిప్రాయాలను ఉల్లంఘించకుండా, వ్యోమనౌక లోపల ఒక స్థిరమైన బుడగను సృష్టించవచ్చు. దారి చుట్టూ ఉన్న స్థలాన్ని ముందుకు కుదిస్తారు. వెనుకవైపు విస్తరిస్తారు. దీనితో వ్యోమ నౌక చాలా త్వరగా మన గెలాక్సీని కూడా దాటి ప్రయాణిస్తుంది. నౌక నిజంగా కాంతి కంటే వేగంగా ప్రయాణించదని, కానీ, బబుల్‌ను సృష్టించడం వల్ల స్థలం, కాలంలో వక్రీకరణ జరిగి కాంతి వేగాన్ని ఒక కణం రూపంలో అధిగమించే వీలు ఉంటుందని ఈ సిద్ధంతం సూచిస్తుంది. ఇది సాపేక్ష సిద్ధాంతానికి పొడిగింపుగా ఉంటుంది. అందుకే, భౌతిక శాస్త్రంలో అల్కుబియెర్ డ్రైవ్‌కు స్థానం లభించింది. కాగా, వార్ప్ బబుల్‌ను సృష్టించడానికి ప్రతికూల శక్తి (నెగెటివ్ ఎనర్జీ) అవసరం. ప్రస్తుతం మనకు తెలిసిన విశ్వంలో ఇలాంటి నెగెటివ్ ఎనర్జీ ఉనికి దాదాపు లేదు. అందుకే, ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో సాధ్యం కానిదిగా కొంత మంది పేర్కొంటారు. ఏదిఏమైనా, వ్యోమనౌకలో దాదాపుగా ఒక శూన్యాన్ని సృష్టించడం, తద్వారా కాంతి వేగాన్ని అధిగమించడం వంటి ఆలోచనలు, కొత్త పరిశోధనలకు ఊతమిచ్చేవిగా ఉన్నాయి. అందుకే, ఈ కోణంలో పరిశోధనలు వేగవంతమయ్యాయి.

## డార్క్ మ్యాటర్ ఓ మాయ!



రాజేంద్ర గుప్తా నేతృత్వంలో యూనివర్సిటీ ఆఫ్ ఒటావా శాస్త్రవేత్తల బృందం విడుదల చేసిన పరిశోధనా పత్రం భౌతిక సిద్ధాంతం ఖగోళ పరిశోధకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. విశ్వంలోని 95 శాతం భాగాన్ని కనబడని పదార్థం (డార్క్ మ్యాటర్), తెలియని శక్తి (డార్క్ ఎనర్జీ)తో నిండి ఉందనేది ఇప్పటి వరకూ అందరూ నమ్ముతున్న, విస్తృతంగా అంగీకరించిన సిద్ధాంతం. అయితే, అవి అసలు ఉండకపోవచ్చని అంటున్నారు. కొత్త సిద్ధాంతం ప్రకారం, మనం చూడలేని శక్తులు వాస్తవానికి లేవు. అవి విశ్వంలో గురుత్వాకర్షణ, కాంతి ప్రవర్తనను మనం అర్థం చేసుకునే విధానంలో ఉత్పన్నమయ్యే గణిత మాయలు కావచ్చు. గత కొన్ని దశాబ్దాలుగా, నక్షత్ర గాలాక్షీలు అంత వేగంగా తిరగడానికి కనిపించే పదార్థం సరిపోకపోతే, దానికి సమాధానంగా 'డార్క్ మ్యాటర్' అంశాన్ని ప్రతిపాదించారు. అదే విధంగా, విశ్వం వేగంగా విస్తరిస్తుండడాన్ని వివరించటానికి డార్క్ ఎనర్జీ అనే భావనను ఖరారు చేశారు. కానీ మన గణనలలో, సమీకరణాలలో ఏదో మౌలికమైన అంశం లేనందువల్ల లేదా గురుత్వాకర్షణ నమూనా అసంపూర్ణంగా ఉండటం వల్ల అలా కనిపిస్తోందని కొత్త అధ్యయనం పేర్కొంటున్నది. ఈ మార్పుచేర్పు చేసిన నమూనా, ఐన్‌స్టీన్ సాధారణ సాపేక్ష సిద్ధాంతాన్ని అంతరిక్ష స్థాయిలో ప్రశ్నిస్తోంది. లోకల్ స్కేల్‌లో పని చేసే గురుత్వాకర్షణ, విశ్వ సుదూర విశాలతల్లో వేరేలా ప్రవర్తించవచ్చని ఈ వాదన నిలదీస్తున్నది. ఈ సత్యం నిజమైతే, గెలాక్సీలు ఎలా ఏర్పడతాయి, విశ్వానికి చివరికి ఏమవుతుంది, అన్నదంతా మళ్లీ పునరాలోచన చేయాల్సి వస్తుంది. అయితే, కొత్త సిద్ధాంతం పట్ల జాగ్రత్త అవసరమని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యక్షంగా కనిపించకపోయినా, డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీ ఉన్నాయనడానికి విస్తృతమైన పరోక్ష ఆధారాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. మద్దతుదారులు మాత్రం, విజ్ఞానం అనేది అత్యంత పవిత్రమైన అంచనాలను కూడా ప్రశ్నించటమే అభివృద్ధికి మార్గమని మరోసారి గుర్తు చేస్తున్నారు. మొత్తానికి విశ్వంలో కనిపించని పదార్థం, తెలియని శక్తి లేవు అని తేలితే, మనం ఇంతకాలం ఒక మిథ్యావాదనను నిజమని భ్రమిస్తున్నామని స్పష్టమవుతుంది. అంతేగాక, విశ్వంపై మనకు ఉన్న అవగాహనలో విప్లవాత్మక మార్పులు తెస్తుంది.

## పట్టుపురుగుల్లో జన్యుమార్పిడి!



చైనాలోని శాస్త్రవేత్తలు ఒక జన్యు మార్పిడి చేసిన పట్టు పురుగును సృష్టించారు. వివిధ సోషల్ మీడియా వేదికల్లో చక్కర్లు కొడుతున్న సమాచారం ప్రకారం, ఈ జన్యుమార్పిడి జరిగిన పట్టుపురుల ద్వారా ఉత్పత్తయ్యే పట్టు కెవ్లార్ కంటే బలంగా ఉంటుంది. కెవ్లార్ అనేది బులెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఉపయోగించే బలమైన పదార్థం. చైనా శాస్త్రవేత్తల సరికొత్త ప్రయోగం, అంతకంటే బలమైన లేదా దృఢమైన పట్టును ఉత్పత్తి చేస్తుంది. ఈ శాస్త్రవేత్తలు పట్టు పురుగుల్లోని పట్టు ఉత్పత్తి వ్యవస్థను నిర్దిష్టంగా మార్పు చేసి, మెరుగైన బలాన్ని కలిగిన పట్టు ఉత్పత్తి చేయగలిగారు. ఆ కొత్త పట్టు, చాలా బలంగా ఉండటం వల్ల, రక్షణ వంటి అవసరాలకు ఉపయోగపడుతుంది. దీనిని ఉపయోగించి బులెట్‌ప్రూఫ్ జాకెట్లు, తొందరగా చిరిగిపోని కవర్లు, ప్రత్యేక ఫైబర్ పదార్థాలను తయారు చేయడం సాధ్యమవుతుంది. ఇది అత్యంత కఠిన వాతావరణ పరిస్థితులను కూడా తట్టుకుంటుందని అంటున్నారు. జీన్ల మార్పు టెక్నాలజీ ద్వారా మరింత శక్తివంతమైన పదార్థాలను అభివృద్ధి చేయవచ్చనే వాదనకు ఈ పరిశోధన బలాన్నిస్తున్నది. ఈ ఆవిష్కరణతో పట్టు పురుగు ద్వారా అత్యధిక బలం కలిగిన ఫైబర్ ఉత్పత్తి సాధ్యమై, భద్రతా రంగంలోను, ఇతర ఉన్నత పరిశ్రమల్లోను విప్లవాత్మక మార్పులు వచ్చే అవకాశం ఉంది.

## ప్రభుత్వ ఉద్యోగులుగా మున్సిపల్ కార్మికులను గుర్తించాలి

### సంఘం రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం/వేములవాడ :** మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎఐటియుసి అనుబంధ మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి. జైపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ప్రథమ జిల్లా మహాసభ పట్టణంలోని గుమ్మి పుల్లయ్య భవన్‌లో నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా జైపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు సుప్రీంకోర్టు చెప్పిన విధంగా సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పిస్తూ, ప్రతి కార్మికుడికి ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు అధ్యక్షతన సభ నిర్వహించగా, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, కెవి అనసూర్య, పండుగ పోచమల్లు హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారుడిగా అజ్జ. వేణు, గౌరవ అధ్యక్షుడిగా కడారి రాములు, అధ్యక్షుడు సుంకపాక పర్శరాములు, ఉపాధ్యక్షులు పెంట నరేష్, గాజుల వజ్రవ్వ, తాండ్ర. రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా పందుల మల్లేశం, సహాయ కార్యదర్శిగా పిట్టల రాజశేఖర్, కార్యదర్శులుగా ముప్పిడి తిరుపతి, నామాల వేణు, తాండ్ర నర్సవ్వ, పెంట రాజవ్వ, కోశాధికారి పెంట భారతమ్మ, స భ్యులుగా వాల్మీకి ఊర్మిల, ఎదురుగట్ల దుర్గయ్య, బండ లక్ష్మ న్, పెరుమని నాగరాజు, గాజుల చంద్రయ్య, సుంకపాక నరేష్, గుడిసె రాజయ్య, గద్దపాక మహేష్, కుమ్మరి రాజేష్, కుమ్మరి నారాయణ, సంగెపు రాజు, కుంటాల హరీష్, నమిలికొండ రఘు, పెంట గట్టవ్వ, ఎడ్ల భాబు ఎన్నికయ్యారు.

## జిజిహెచ్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిజిహెచ్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. జిల్లా కేంద్ర జిజిహెచ్ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచి సానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ సిబ్బందిని పెంచటంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కార్మికులకు పెండింగ్‌లోని వేతనాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు స్వరూప, భారతి, సాయికిరణ్, వెంకట్, సానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## రిజర్వేషన్లకు అడ్డంకులు సృష్టిస్తున్న కేంద్రం

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాజకీయ పరమైన వక్రబుద్ధితోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లు అమలులో అడ్డంకులు సృష్టిస్తోందని, దీనిని తెలంగాణ సమాజం తిప్పికొట్టి కేంద్రానికి బుద్ధి చెప్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. రాష్ట్ర బిసి జెఎసి పిలుపు మేరకు శనివారం జరగనున్న బంద్‌ను విజయవంతం చేయాలని రాజకీయ పక్షాలు, బిసి, సమాజిక, జర్నలిస్టులు, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేండ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ బిసి వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తేనే వారికి సముచిత న్యాయం జరుగుతుందని, దీనిపై రాష్ట్రసభల్లో ఆమోదం చేసి పంపితే బిల్లుకు ఆమోదం తెలపకుండా కేంద్ర కుట్ర చేస్తోందని విమర్శించారు. తెలంగాణ చట్టసభలు, రాష్ట్ర ప్రజలు సంపూర్ణంగా మద్దతు తెలుపుతుంటే కేంద్రానికి వచ్చిన ఇబ్బందేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో బిసి వర్గాల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ వారికి సమాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాతనిధ్యంలో తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షలను మనోభావాలను కేంద్రం గుర్తించకుండా బిసి వర్గాల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వం పైన ఉన్నదని స్పష్టం చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జిఒతో పాటు స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణ మీద ఉన్న హైకోర్టుస్టే విధించడంతో రిజర్వేషన్ల అమలు స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిసిల పట్ల బిజెపికి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి ఆప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించి బిల్లుకు ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని, లేదం టే ఉద్యమాల ద్వారా కేంద్రానికి కునుకు లేకుం డా చేస్తామని హెచ్చరించారు. శనివారం జరిగే బంద్, నిరసన ఉద్యమాల ద్వారా కేంద్రానికి తెలంగాణ ప్రజల ఐఖ్యత, పోరాట సత్తాను చవిచూపించాలని పిలుపునిచ్చారు. ధీటి లక్ష్మీ పతి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో పార్టీలు, బిసి మైనార్టీ సమాజిక, జర్నలిస్టు సంఘాల నాయకులు కంచర్ల జమలయ్య, గొల్లపల్లి దయానంద్, రజాక్, అనుదీప్, కాసుల వెంకట్, వంగ వెంకట్, మద్దెల శివకుమార్, జక్కుల రాములు, యూసుఫ్ అబీద్, కురుమెళ్ల శంకర్, భూపతి శ్రీను, కోడి లింగయ్య, డి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## బిసి బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి

### ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపిలు బిసి బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి చేయాలని ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల సాధనకు వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన బిసి ఐక్య కార్యాచరణ కమిటీ బంద్ ఫర్ జస్టిస్ పేరుతో 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. శుక్రవారం పట్టణంలో జరిగిన రాష్ట్ర బంద్ సమాయత్తం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్ పెంపు అంశాన్ని నాన్చడం ఏమాత్రం తగదన్నారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాల ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితిని ఇప్పటికీ దాటిపోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు నిర్ణీత కాలపరిమితిలోగా ఆమోదం లభించకపోతే నోటిపై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు. కేంద్రంలో అధికారంలో బిజెపి ఉండడంతోనే రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో కేంద్రంలో బిజెపిని భూస్థాపితం చేయాలన్నారు.



## టైం స్కేల్ కార్మికుల కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఉద్యాన కళాశాల ఖాళీ సంబంధిత పోస్టులలో ప్రభుత్వ జిఒ ప్రకారం టైం స్కేల్ కార్మికుల కుటుంబాలకు అవకాశం కల్పించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారధిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. టైంస్కేల్ కార్మికుల కుటుంబాలకు అవకాశం కల్పించకుండా ఇష్టారీతిన జరిగిన నియామకాలను నిరసిస్తూ టైమ్ స్కేల్ ఉద్యోగులు, కార్మికులు జిల్లా కేంద్రంలోని ఉద్యాన కళాశాల ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈసందర్భంగా అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్లుగా పనిచేస్తున్న టైం స్కేల్ కార్మికులను వదిలి ప్రభుత్వ జిఒకు వ్యతిరేకంగా పోస్టులను భర్తీ చేయడం తగదన్నారు. టైం స్కేల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వయోపరిమితి 61సంవత్సరాల వరకు వర్తింపజేయాలని, సహజ మరణం పొందిన వారికి పది లక్షల రూపాయలు అందజేయాలని, గ్రాట్యూటీ రూ.మూడు లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆందోళనలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, నాయకులు వెలుగు శ్రావణ్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, బానోతు లింగ్యానాయక్, గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, శ్రీరాములు, ఇమామ్, హుస్సేన్, షరీఫ్, వెంకన్న, ఎల్లయ్య, సూరయ్య, మెహబూబి, ఐలమ్మ, ఎల్లమ్మ, యాకమ్మ, కతీజ, కళమ్మ, వేణు, ఉపేందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.




## వాడవాడలా శతాబ్ది ఉత్సవాల ప్రచారం

### భారీ బహిరంగ సభకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలి

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్




**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 26న జరిగే భారీ బహిరంగ సభకు సంబంధించి పార్టీ క్యాడర్‌ను సిద్ధం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ఖమ్మం నగరంలోని ప్రతి ఇంటికి శతాబ్ది ఉత్సవాల సందేశాన్ని అందించాలన్నారు. సిపిఐ నగర సమితి సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంలో అనేక పోరాట విజయాలు ఉన్నాయని వాటన్నింటిని నేటి తరానికి తెలియజేయాల్సి ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో మహోత్తర పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ వేదికగా నిలిచిందని నాటి సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటం నుంచి నిన్న మొన్నటి తెలంగాణ ఉద్యమం ఆ తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం వరకు కమ్యూనిసు పార్టీ ప్రజల పక్షాన నిలిచిందన్నారు. ఖమ్మం జిల్లాలో గ్రామ గ్రామాన సిపిఐ పోరాట గుర్తులు ఉన్నాయని యావత్ చరిత్రను నేటితరానికి తెలియజేసే లక్ష్యంతో శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనె శశిధర్, తాటి నిర్మల, వరదా నర్సింహారావు, బోడా వీరన్న, సైదా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### డిసెంబర్ 26 సభ చరిత్రలో నిలిచిపోవాలి

**చింతకాని :** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా జరపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం చింతకాని మండల సిపిఐ మండల సమితి సమావేశం చాట్ల రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని ఈసభకు వచ్చే విధంగా ఉత్తేజపరచాలన్నారు. కవాతు దళాలను, మహిళలను, రెడ్ షర్ట్ వలంటీర్లను చింతకాని మండలం నుంచి భారీగా తరలించాలన్నారు. పార్టీ వందేళ్ల పండుగను ప్రతి ఇంటి పండుగగా భావించే విధంగా గ్రామల్లో వాల్‌రైటింగ్, ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, కూచిపుడి రవి, దూసరి శ్రీరాములు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శులు మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, రైతు సంఘం మండల అధ్యక్షులు దొబ్బల వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## నాణ్యమైన ఆహారంతో పాటు విద్య అందించినప్పుడే మంచి ఫలితాలు



**ప్రజాపక్షం/షాబాద్ :** మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలను రాష్ట్ర ఆదర్శ పాఠశాల అదనపు సంచాలకులు శ్రీనివాసచారి శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్, విద్యార్థుల డైరీలు, విద్యార్థులకు సంబంధించిన సిలబస్ రికార్డులు పరిశీలించారు. పాఠశాల పరిసరాలను, పరిశుభ్రత, వంట గది, డైనింగ్‌హాల్, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కు నాణ్యమైన ఆహారంతో పాటు విద్యను అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ రవికుమార్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రాఘవేందర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి సహకారం



**ప్రజాపక్షం/శంషాబాద్ :** రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు, మూత్రశాలల గదుల పెంపు పనులు ఇంద్రరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు దిద్యాల జయమ్మ శ్రీనివాస్, డిసిసిబి డైరెక్టర్ బుర్కుంటా సతీష్, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## సిపిఆర్‌పై ప్రజలకు అవగాహన



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** గుండెపోటుకు గురైన వారికి ముందుగా సిపిఆర్ చేయడం ద్వారా వారిని బతికించే అవకాశం ఎక్కువగా ఉంటుందని గ్రీన్ హెల్త్ 108 సిబ్బంది తెలిపారు. శుక్రవారం ఎల్‌బి నగర్‌లో ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ సిబ్బంది రాజాబాబు, హయత్‌నగర్ ఇఎంటి గుండెబోయిన సత్యం మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చిన్న, పెద్ద తేడ లేకుండా గుండెపోటుకు గురైతున్నారని, ఆ క్షణంలో అందుబాటులో ఉన్న వారు సిపిఆర్ చేస్తే వారిని కాపాడుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. సిపిఆర్ అనంతరం దగ్గరలో ఉన్న ఆసుపత్రులకు తలరించాలని వారు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది నరసింహ, సురేష్, గోపి, పిలోట్ నరసింహ, సురేష్, మేహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో మంత్రులకు ఘనస్వాగతం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మక్తల్ నియోజక వర్గం పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ మీదుగా మక్తల్ వెళ్తున్న రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనరసింహ, వాకిట శ్రీహరికి షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని జిల్లాలోసంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాగం నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నారాయణపేట్ ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అలీఖాన్ బాబర్, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## పేదల కోసమే సిఎం సహాయనిధి

### యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివచరణ్ రెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సిఎం సహాయనిధి దోహదపడుతుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. ఎల్.బి నగర్ నియోజకవర్గం సాయినాథ్ కాలనీకి చెందిన దేప మణెమ్మ ఇటీవలే మోకాళ్ళ సమస్యతో బాధపడుతూ పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. చికిత్స కోసం శివచరణ్ రెడ్డిని సంప్రదించగా ఆయన ఎల్ఒసి చెక్కును మంజూరు చేయించి శుక్రవారం మణెమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎర్రమల రాంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొత్తకురుమ యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు

## పశు సంపద కాపాడుకోవాలి



**ప్రజాపక్షం/షాబాద్:** పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పని సరిగా వేయించాలని మండల పశు వైద్య అధికారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కక్కులూర్, కుమ్మరిగూడ, మద్దూర్, రేగడి దోస్వాడ, అంతిరెడ్డిగూడ గ్రామాల్లో పర్యటించి పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలన్నారు. పశు సంపదను కాపాడినప్పుడే మానవ మనుగడ ఆరోగ్యంగా ఉంటుందన్నారు.

## రాష్ట్ర బంద్ విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/మియాపూర్:** స్థానిక సంస్థ ఎన్నికల్లో బిసి లకు 42 శాతం రీజర్వేషన్ లు అమలు చేయాలని కోరుతూ శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం శేరిలింగంపల్లి అధ్యక్షుడు వల్లెపు మాధవరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల వాటా దక్కే వరకు పోరాడుతామని, అడ్డుకోవాలని చూస్తున్న వారి ఆటలు కొనసాగనివ్వమని హెచ్చరించారు. బంద్‌కు అన్ని వర్గాల వారు సహకరించి, రవాణా, విద్యా వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## గాంధీ ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ నర్సింగ్ సిబ్బంది వెంటనే జీతాలు చెల్లించాలి

### ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గాంధీ ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ నర్సింగ్ సిబ్బందికి గత జూలై మాసం నుండి సంబంధిత కాంట్రాక్టర్లు జీతాలు చెల్లించడం లేదని, వెంటనే జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని, గాంధీ ప్రభుత్వాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసింహా నేతృత్వంలోని యూనియన్ ప్రతినిధి బృందం శుక్రవారం గాంధీ ప్రభుత్వాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ దాదాపు 20 ఏళ్లుగా గాంధీ ఆసుపత్రిలో తక్కువ జీతాలతో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ నర్సింగ్ సిబ్బంది గత 4 నెలలుగా సంబంధిత కాంట్రాక్టర్లు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్టర్లు జీతాలు చెల్లించడంలో విఫలమైతే యజమానిగా ఉన్న గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ నర్సింగ్ సిబ్బందికి జీతాలు చెల్లించాలని కాంట్రాక్టు చట్టం స్పష్టం చేస్తున్నదన్నారు. పండగల సందర్భంగా కూడా ఉద్యోగులకు జీతాలు లేక పస్తులు ఉండే దుస్థితి కొనసాగుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం కాంట్రాక్టర్లతో చర్చించి జీతాలు ఇప్పించకపోతే ఆందోళన కార్యక్రమాలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నరసింహ ప్రకటించారు. కాంట్రాక్టర్లను కనీసం రెండేళ్లు ఉండే విధంగా కాంట్రాక్టు అగ్రిమెంట్లు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఏటా కాంట్రాక్టర్లు మారడం వల్ల ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లించడంలేదని, అదేవిధంగా ఎక్కువ మంది కాంట్రాక్టర్లను నియమించడంతో ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. అనంతరం సూపరిండెంట్ సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి శనివారం లోపు అందరికీ జీతాలు అందే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని యూనియన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గాంధీ ఆసుపత్రి నర్సింగ్ ఆఫీసర్స్ యూనియన్ నాయకులు డి.సుందరమ్మ, ఎం.నాగమణి, ఇ.అనిత, బి.పుణ్యమ్మ, ఎల్.శోభారాణి, ఎస్.లక్ష్మి, ఎ.ప్రభలత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## జువెనైల్ హోంలో 8 మంది బాలలపై అఘాయిత్యాలు

### నిందితుడిపై ఐదు కేసులు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైదాబాద్ జువెనైల్ హోంలోని బాలలపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు రెహమాన్ (30) కేసులో తవ్వినకొద్దీ ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఇతగాడు జువెనైల్ హోంలో ఎనిమిది మంది బాలలపై అఘాయిత్యానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. దీంతో శుక్రవారం నాటికి ఐదు కేసులు నమోదయ్యాయి. అతని భారిన పడిన బాధిత బాలుర సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. నాలుగు రోజుల క్రితం ఓ బాలుడి తల్లుదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెహమాన్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో సైదాబాద్ పోలీసులు లోతుగా విచారణ చేయగా రెహమాన్ నేరాలు ఘోరాలు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. ఇప్పటి వరకు ఇతగాడు ఐదుగురి బాలలపై అత్యాచారానికి పాల్పడినట్లు విచారణలో తేలడంతో ఐదు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం, ఇప్పటివరకు మొత్తం ఎనిమిది మంది బాలురు బాధితులుగా గుర్తించబడ్డారు. అయితే వారిలో కొంతమందిని ఇంకా గుర్తించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు సున్నిత స్వభావం దృష్ట్యా పోలీసులు అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా విచారణ చేపట్టారు. బాధితుల వాంగ్మూలాలు సేకరించడంతో పాటు, గృహంలోని సిబ్బంది, అధికారులు, పర్యవేక్షకులను విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణలో, రెహమాన్ కొంతకాలంగా బాలురపై లైంగిక వేధింపులు చేసినట్లు తేలినట్లు తెలుస్తోంది. బాధితుల మనసుకు మరల నష్టం కలగకుండా జాగ్రత్తగా విచారణ జరుపుతున్నాం అని సిఐ చంద్రమోహన్ పేర్కొన్నారు.

## నేడు బిసి ఉద్యోగుల నిరసనలు

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని బిసి ఉద్యోగులు శనివారం బిసి బంద్‌కు సంఘీభావంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని తెలంగాణ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. బిసి ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేపట్టాలని కోరారు. రిజర్వేషన్ల లేకపోవడం బిసి ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బిసిల అభివృద్ధికి కృషిచేయాలని, అప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం నేతలు రమాదేవి, జ్ఞానేశ్వర్, రామరాజు, శ్రీనివాస్, శంకర్, యాదయ్య, సాగర్, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## బంద్‌లో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాలి

### మాజీ ఎంపి మధు యాష్కిగౌడ్



**ప్రజాపక్షం/హయత్ నగర్:** తెలంగాణ వ్యాప్తంగా శనివారం జరిగే బిసి బంద్‌లో ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు తీవ్రంగా కృషి చేసింది కానీ కొంతమంది కోర్టుకు వెళ్లి అడ్డుకోవడం, కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడం తదితర పరిణామాలతో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో ఇక క్షేత్రస్థాయి నుంచి, ప్రజల మమేకంతో పోరాటానికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ సాధ్యం కాదు" అనే పరిస్థితులు ఏర్పడ్డాయి అన్నారు. బిసి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్ కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు తెలిపిందన్నారు. ఈ బంద్‌లో ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బిసి సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో కృషి

### కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్ర స్థాయిలో చిత్తశుద్ధితో కృషి చేయాలని రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరం నుంచి ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై, డబుల్ బెడ్రూంల పంపిణీ ప్రక్రియపై, వన మహోత్సవం ఎన్ఆర్ఇజిఎస్, పారిశుద్ధ్య, ఇందిరా మహిళా శక్తి తదితర అంశాలపై కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ఎంపిడిఒలు, హౌసింగ్ ఎఇలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపిఎంలతో సమీక్ష జరిపారు. ఈసందర్భంగా కలెక్టర్ ఒక్కో మండలం వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని, వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని ఇండ్లు ఏ దశలో నిర్మాణంలో ఉన్నాయి, ఇప్పటివరకు గ్రౌండింగ్ జరగని ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులచే పనులు ప్రారంభించేలా చేపట్టిన చర్యలు ఏమిటీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న ఆయా మండలాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, ఎందుకు పురోగతి సాధించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంట వెంటనే బిల్లులను మంజూరు చేస్తూ, తగిన తోడ్పాటును అందిస్తోందని, అలాంటప్పుడు ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహించడానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా చూడాలని, ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. నిరుపేద వారికి డిఆర్‌డిఏ ద్వారా రెండు లక్షల వరకు ఆర్థిక సహాయం అందించేందుకు నిజమైన వారిని గుర్తించాలని కలెక్టర్ సూచించారు. మహిళా సమైక్య గ్రూప్ల ద్వారా మహిళా శక్తి రుణాలను అందించేందుకు ఇటుకలు, సెంట్రింగ్ బాక్సులు తయారీదారులకు అందించేలా ప్రతి గ్రూపుల్లో రెండు యూనిట్లను యూనిట్లను ఎంపిక చేయాలని సూచించారు.వన మహోత్సవంపై సమీక్షిస్తూ నవంబర్ 1 నుండి ప్రతి గ్రామ, మునిసిపాలిటీ పరిధిలో అంగన్వాడి కేంద్రాలలో పాఠశాలల్లో ఇన్‌స్టిట్యూట్లో వైకుంఠ ధామాలలో, పల్లె ప్రగతి పార్కుల్లో నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి అయ్యేలా మొక్కలు నాటాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయని వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సూచించారు. అర్బన్ ఆవాస్ యోజనా గ్రామీణ పథకం ద్వారా చేపట్టిన ఇండ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పిడి శ్రీలత, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామారావు, విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో విధుల నిర్వహణ




### డిఎంహెచ్ఒ లలితాదేవి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, ముఖ్యంగా సమయపాలన పాటించాలని రంగారెడ్డి జిల్లా వైద్యా, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.లలితా దేవి వైద్యసిబ్బందికి సూచించారు. శుక్రవారం నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్స్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు జిల్లా డిప్యూటి డిఎం అండ్‌హెచ్‌ఒలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు పాల్గొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమంలో జరుగుతున్న పనితీరు, రిపోర్టు విధానం పై సమీక్ష సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అదేవిధంగా వైద్యాధికారులు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా సమయపాలన పాటించాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని డిఎం అండ్ హెచ్ఒ హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్కకాటుకు సంబంధించినటువంటి ఏఆర్వి మొదలగు మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిఎంఅండ్‌హెచ్ ఒ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిబి వ్యాధి పట్ల తీసుకుంటున్న చర్యలు గురించి డాక్టర్ పాపారావు వివరించారు. అదే విధంగా జిల్లాలో జరుగుతున్న ఎమునైజేషన్ కార్యక్రమం దిశా కార్యక్రమం ద్వారా హెచ్ఐవి మొదలవు కార్యక్రమాల పట్ల కూడా సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్‌పై దాడి నిందితుడిని శిక్షించాలి

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై దాడికి పాల్పడ్డ అడ్వకేట్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర రంగారెడ్డి జిల్లా ఇంచార్జి ముసాయిపేట యాదగిరి మాదిగ, ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం శంకర్ పల్లి అంబేద్కర్ విగ్రహం ఎదుట సిజెఐపై జరిగిన దాడికి నిరసనగా నల్ల రిబ్బన్లు ధరించి ఎమ్మార్పీఎస్ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో బండ్లగూడెం శ్రీనివాస్ మాదిగ, లింగం సాయి మాదిగ, సంపత్ మాదిగ, గోపాల్ మాదిగ, మహేష్ మాదిగ, అనిల్ మాదిగ, హరిష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

**గండిపేట:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా పుట్లగణేష్ మాదిగ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పుట్ల గణేష్ మాదిగ , పెద్దపులి శంకర్ మాదిగ, దుడ్డు దేవేందర్ మాదిగ, రంజిత్ మాదిగ , వెంకటేష్ మాదిగ, మిట్టు మాదిగ, నరేష్ మాదిగ, డి.ప్రకాష్ మాదిగ, రవి మాదిగ, దాసు మాదిగ, హరి మాదిగ తదితరులు పాల్గొన్నారు .




## 'రిజర్వేషన్లలో ఎంబిసిల వాటా తేల్చాలి'



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు ప్రకటించిన 42శాతం రిజర్వేషన్లలో వెనుకబడిన కులాలకు జనాభా దామాషా ప్రకారం వాటా తేల్చాలని తెలంగాణ ఎంబిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోగికార్ సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల చట్టబద్ధత సాధనలో భాగంగా ఈ నెల 18న జరిగే బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. బిసిలలో కొన్ని కులాలు మాత్రమే రిజర్వేషన్ ఫలాలు అందుకొని మెరుగైన స్థితిలో ఉన్నాయని తెలిపారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీపరంగా రిజర్వేషన్లు ఇస్తే తమకిచ్చే వాటాపై స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నేతలు మోహన్ బైరాగి, సత్యం, గురుచరణ్, జి.జె.రాజు, నరేశ్, చింతస్వామి, సుమిత్రబాయి తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ వ్యర్థాల తరలింపులో రాంకీ నిర్లక్ష్యం

### తక్షణ చర్యలు తీసుకోకపోతే చర్యలు తప్పవు
### సి అండ్ డి వేస్ట్ సంస్థకు కమిషనర్ కర్ణన్ హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలు (సి అండ్ వేస్ట్)ను రాంకీ ఏజెన్సీ సకాలంలో తొలగించకపోవడం పట్ల జిహెచ్ఎంసి తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సి అండ్ డి వేస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ నోటీసు జారీ చేశారు. నగరంలోని సర్కిల్ అధికారుల, ఏఎంఒహెచ్, డిఈఈ లు పదే పదే విజ్ఞప్తులు చేసినా వ్యర్థాల తొలగింపు పనులు తిరిగి ప్రారంభించకపోవడంతో కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతకు ముందు జూన్, జూలైలో కూడా ఇలాంటి నిర్లక్ష్యంపై అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ సి అండ్ డి వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సత్వరమే స్పందించి, వాహనాలతో పేరుకుపోయిన సి అండ్ డి వ్యర్థాలను తొలగించకపోతే ఒప్పందంలోని నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ హెచ్చరించారు. క్లాజ్ 7.4 మేరకు ఒప్పందం రద్దు చేయడం, భారీ జరిమానాలు విధించేందుకు వెనకాడబోమని స్పష్టం చేశారు. నగర పరిశుభ్రత తమకు ప్రధానామని, ప్రజల సౌకర్యార్థం వెంటనే సంస్థ సి అండ్ డి వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కమిషనర్ స్పష్టం హెచ్చరించారు.

### చెత్త తొలగింపులోనూ..

నగరంలోని చెత్త సేకరణ కార్యకలాపాల్లో నిర్లక్ష్యం కారణంగా జిహెచ్ఎంసి రాంకీ ఎన్వీరోకు శుక్రవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ నోటీసు జారీ చేశారు. నగర వ్యాప్తంగా ఉన్న 2,532 గార్బేజ్ వల్నరెబుల్ పాయింట్ (జివిఎస్)లలో, అలాగే బిన్ పాయింట్‌లలో ప్రతి రోజూ ఉదయం 10.30 గంటల కల్లా చెత్తను ఒప్పందం మేరకు సంస్థ తప్పనిసరిగా తొలగించాలి. అక్టోబర్ 16 నగర వ్యాప్తంగా ఉన్న 2,532 జివిఎస్‌లలో కేవలం 1,879 మాత్రమే నిర్దేశిత సమయంలో తొలగించింది. నిర్దేశిత సమయంలో జివిపి, బిన్ పాయింట్‌లలో చెత్తను తొలగించడంలో సంస్థ వైఫల్యం చెందుతుంది. నగరంలో ప్రతిపాదించిన 2,000 సెకండ్ స్టోరేజ్ బిన్‌లలో 850 బిన్‌లను మాత్రమే ఏర్పాటు చేసింది. మిగిలిన బిన్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉదయం 09.30 గంటల కల్లా వ్యర్థాలను తొలగించాలని కమిషనర్ సంస్థను ఆదేశించారు. ఈ ఆదేశాలను పాటించకపోతే, ఒప్పందంలోని నిబంధనల ప్రకారం భారీ జరిమానాలు విధించడంతో పాటు చర్యలు తీసుకుంటామని జిహెచ్ఎంసి జారీ చేసిన నోటీసులో సంస్థను కమిషనర్ కర్ణన్ హెచ్చరించారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## దుండగులను శిక్షించాలి : ఎంపి ఈటల



**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఆంజనేయస్వామి విగ్రహం ధ్వంసం చేసిన దుండగుల ను వెంటనే శిక్షించాలని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి విలేజ్‌లో హనుమాన్ దేవాలయంలోని ఆంజనేయస్వామి విగ్రహం గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడంతో ఎంపి రాజేందర్, మేడ్చల్ నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డిలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సురేష్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్‌దే గెలుపు

**ప్రజాపక్షం/దుండిగల్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారంగా నామినేషన్ దాఖలు చేయడానికి బయలుదేరిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏ.ఆర్ సాదు యాదవ్ మిత్రబృందం పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి జూబ్లీహిల్స్ నియోజకవర్గం యాదవ సామాజిక వర్గానికి కేటాయించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని సాదు యాదవ్ అన్నారు.

## ఫైర్‌సేఫ్టీ నిబంధనలు తప్పక పాటించాలి
### అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ధనుంజయరెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఫైర్‌సేఫ్టీ నిబంధనలను దుకాణాదారులు తప్పకుండా పాటించాలని, ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ధనుంజయరెడ్డి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట అగ్నిమాపక నివారణ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పటాకులు విక్రయించే దుకాణాల వద్ద పటాకులు కాల్చకూడదని చెప్పారు. బాణసంచా దుకాణాల్లో బాలకార్మికులను పనిలో పెట్టకూడదని, ఒకవేళ ఎవరైనా పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పటాకుల దుకాణాల వద్ద వాహనాలను నిలుపరాదని, కనీసం 10 మీటర్ల దూరంలో వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. పటాకుల డబ్బాలను, ఇతర కాగితాలను దకాణాల వద్ద డంప్ చేయకూదని చెప్పారు. కనీసం 2 డ్రమ్ముల నీటిని అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఇప్పటికి పటాకులు విక్రయించే దుకాణాదారులు 98 మంది దరఖాస్తు చేసుకున్నారని వారిలో 92 మందికి అనుమతులు ఇచ్చామని చెప్పారు. 6 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించడం జరిగిందన్నారు. ఎమర్జెన్సి ఫైర్ సేవలకు 100 డయల్ చేయాలని, ఇతర సేవలకు శామీర్‌పేట ఫైర్ స్టేషన్ కార్యాలయం మొబైల్ నెంబర్ 8712699398కు ఫోన్ చేయాలని కోరారు. దీపావళి పండగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలందరికి ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.




## తెలంగాణ జాగృతిలోకి చేరికలు

**ప్రజాపక్షం/ఉప్పల్:** ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకనగర్ డివిజన్ నివాసి యువ నాయకుడు శ్రామన్ దేవ్ శుక్రవారం తన అనుచరులతో కలిసి ఉప్పల్ నుండి బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి గోపు సదానంద్ సమక్షంలో తెలంగాణ జాగృతి పార్టీలో చేరారు. సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శ్రామన్ దేవ్‌కి తెలంగాణ జాగృతి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రామన్ దేవ్ మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత యువత ఆశయాలకు అనుగుణంగా చేస్తున్న సామాజిక పోరాటాలు, సీ బిల్లు సాధన కోసం చేస్తున్న కృషి తమను ఆకట్టుకుందని, తెలంగాణ జాగృతి నిర్వహించే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొని స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. బిసి సమాజాలకు న్యాయం చేయాలనే కవిత నిర్ణయం పట్ల తాను అంకితభావంతో కట్టుబడి ఉంటానని తెలిపారు.

## బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు
### విజయలక్ష్మి పండిత్

**ప్రజాపక్షం/వికారాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, బిసిల డిమాండ్ల న్యాయ సమ్మతమైనవనీ వికారాబాద్ జిల్లా సిపిఐ తరపున బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక న్యాయంకోసం బిసిలకు మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సిపిఐ నాయకులు, కర్యకర్తలు, బిసి నాయకులు పెద్దఎత్తున పాల్గోని విజయవంతం చేయాలని కోరారు.

## నేటి బిసి బంద్‌కు సంపూర్ణ మద్దతు
### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** తెలంగాణ బిసి జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బిసి బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతును ఇస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రకటించారు. 42శాతం బిసి రిజర్వేషన్ల విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని, బిసిలకు 42శాతం రిజర్వేషన్ల కోసం అన్ని విధాలుగా తాము పోరాడుతామని పేర్కోన్నారు. బిసి జెఎసి బంద్‌లో భాగంగా శనివారం నిర్వహిస్తున్న తాండూరులో నిర్వహిస్తున్న బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని ఎంఎల్ఎ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరు బంద్‌లో పాల్గోనాలని పిలుపునిచ్చారు.

**మద్దతు ప్రకటించిన మాజీ ఎంఎల్ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి....**
బిసి బంద్‌లో భాగంగా తాండూరు బంద్‌కు బిఆర్‌ఎస్ పార్టీకి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు మాజీ ఎంఎల్ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి ప్రకటించారు. బిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులందరు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గోనాలని పిలపునిచ్చారు.

## జన్మదినం సందర్భంగా దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలంగాణ రాష్ట్ర యువజన నాయకులు రేగళ్ల సతీష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అడిషనల్ డిసిపి వెంకటరమణలు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. సతీష్ రెడ్డి జన్మదినం సందర్భంగా బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ, నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా అటవీశాఖ క్రీడా పోటీలు
### ప్రారంభించిన వైల్డ్ లైఫ్ చీఫ్ ఈలు సింగ్ మేరు






**ప్రజాపక్షం/హైదరాబాద్:** దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అటవీ సిబ్బంది క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా ప్రముఖ భారతీయ షూటర్ ఇషాసింగ్ హాజరయ్యారు.. అన్ని జోన్లకు సంబంధించిన ఆటగాళ్ల మార్చ్ ఫాస్ట్ నిర్వహించి అటవీ శాఖ వన్యప్రాణి ప్రధాన సంరక్షణాధికారి(వైల్డ్ లైఫ్ చీఫ్) ఈలు సింగ్ మేరుకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సిబ్బంది వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి కఠినమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. శారీరకంగా దృఢంగా ఉండడంతో పాటుగా మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి సంవత్సరం ఇలా రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. చిన్న వయసులోనే ఈషా సింగ్ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గౌరవం తెచ్చిన యువ క్రీడాకారిణిగా అందరికీ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇషాసింగ్ మాట్లాడుతూ ఇంత గొప్ప కార్యక్రమానికి నన్ను ఆహ్వానించడం గర్వంగా ఉందన్నారు.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.. దీనిద్వారా అడవుల పెరుగుదలతో పాటుగా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు అటవీ అధికారులు చర్యలు అభినందనీయమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 7 జోన్లకు చెందిన సుమారు 750 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు.. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లు నవంబర్ రెండో వారంలో డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడల పోటీల్లో పాల్గొంటారని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిసిఎఫ్‌లు శర్వణన్,రామలింగం, ప్రియాంక వర్గీస్, ప్రభాకర్, భీమానాయక్, అకాడమీ డైరెక్టర్ ఎస్‌జె ఆశ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బంద్‌ను విజయవంతం చేసేందుకు కదలిరావాలి
### బిసి జెఎసి ప్రతినిధులు నిమ్మల నరసింహ



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి /జవహర్‌నగర్ :** శుక్రవారం చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేసేందుకు కదలిరావాలని జవహర్‌నగర్ బిసి జెఎసి పిలుపిచ్చింది. శుక్రవారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజినగర్ దళిత భవన్‌లో బంద్ సందర్భంగా సన్నాహ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేలా బిసి రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించేందుకు అన్ని కుల సంఘాలు, రాజకీయ పార్టీలు సంఘటితంగా ఎలుగెత్తిచాటాలన్నారు. కార్మిక సంఘాలు, వాణిజ్య సంఘాలు సహకరించాలన్నారున. ఈ సమావేశంలో సిపిఐ నేతలు నిమ్మల నరసింహ, తోటపల్లి శంకర్, శివబాబులతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన శ్రీకాంత్‌యాదవ్, కమలాకరచారి, ప్రసాద్‌గౌడ్, సోమాచారి, భాస్కర్, నరసింహ, శంకర్, క్రాంతి కళాబృందానికి చెందిన వెంకటాచారి, బుచ్చయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వరరెడ్డి బంద్‌ను విజయవంతం చేయాలంటూ పిలుపిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్ బిల్లుకు కట్టుబడి ఉందన్నారు.

## ఇందిరమ్మ రాజ్య స్థాపనకు కృషి
### టిపిసిసి ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఇందిరమ్మ రాజ్యం స్థాపించుటకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇళ్లు కట్టించే బాధ్యత తనదేనని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కేశవరం గ్రామంలో మామిండ్ల పద్మ మల్లేష్‌యాదవ్‌ల ఇందిర మ్మ ఇంటి గృహ ప్రవేశం చేశారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరికి ఇళ్లు కట్టించిన పాపన పోలేదని విమర్శించారు. గారడి మాటలు చెప్పి పదేళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించి తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. నియోజకవర్గంలో సుమారు 3 వేల ఇళ్లు కట్టిస్తున్నామని ఏ ఒక్కరు ఇల్లు లేకుండా ఉండకూడదని చెప్పారు. ప్రజలందరు కాంగ్రెస్ వైపే ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, కమిషనర్ పవన్‌కుమార్, ఎ బ్లాక్ మేడ్చల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి కల్పించినందుకు కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఆర్‌డివోలకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ లుగా పదోన్నతి కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ అర్‌డివోగా విధులు నిర్వహిస్తున్న వాసుచంద్రకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి వచ్చినందున తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు విజయేందర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అర్‌డివోను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీ నారాయణ, మునిరోద్దీన్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, అనిత, ఆర్‌ఐలు నరేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ గవాయ్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు
### జాతీయ కళామండళి అధ్యక్షుడు ఎన్ వై అశోక్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సుప్రీంకోర్టు జస్టిస్ బి ఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్ వై అశోక్ అన్నారు. శుక్రవారం శామీర్ పేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బిఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేయుటకు తహసీల్దార్ యాదగిరిరెడ్డికి వినతిపత్రం సమర్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బంగారిగల్ల శంకర్, మేడి ప్రేమ్‌కుమార్, డేవిడ్, తదితరులు పాల్గొన్నా రు.

## రూ.40వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన సెక్షన్ ఆఫీసర్




**ప్రజాపక్షం/పరిగి:** వికారాబాద్ జిల్లా పరిగి అటవిశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏసిబి రంగారెడ్డి జిల్లా రేంజ్ అధికారి డిఎస్‌పి అనంద్ అధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పరిగి లోని సీతాఫలాల టెండర్లలో భాగంగా రూ. 50 వేలు లంచం అడగడంతో రూ. 40వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబి అధికారులు పట్టుకున్నారు. 3మండలాల్లో రూ.18లక్షల టెండర్లు వేయగా ,ప్రతి రోజు పర్మిట్ కోసం 50వేలు డిమాండ్ చేసిన సెక్షన్ ఆఫీసర్లు సాయికుమార్ ,మహమ్మద్ మోహినోద్దీన్ ,డ్రైవర్ బాలకృష్ణను అదుపులోకి తీసుకోని విచారించి అనంతరం కోర్టులో ప్రవేశ పెట్టడం జరుగుతుంది అని తెలిపారు. అవరైన లంచం అడిగితే ఎసిబికి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

# నేర నియంత్రణలో సిసిటివిలు కీలకం
### ఎస్‌పి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ :** మహిళలు,బాలికలకు భద్రత అత్యంత ప్రాధాన్యత నేర నియంత్రణలో సీసీటీవీ కీలకం అని జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసులతో పెండింగ్ కేసులపై సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ,విచారణను వేగవంతం చేసి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ,పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచి నియంత్రించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు , ఆత్మహత్యలకు గల కారణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ,ప్రమాదాలు ఎక్కువగా నమోదువుతున్న ,హాట్ స్పాట్‌లలో నివారణ చర్యలు తీసుకోవలనపి ,ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. మహిళలు ,బాలకలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ,అటువంటి అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ఎటువంటి జాప్యం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ,అవసరమైతే నేర చరిత్రను పూర్తిగా పరిశీలించి రౌడి షీట్‌లు తెరవలని అన్నారు. పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడానికి రికార్డులను సిద్ధం చేయాలని అదేశించారు. మహిళలకు ,బాలికలకు పూర్తి భద్రత కల్పించడం పోలీసుల ప్రాథమిక బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరు డ్రగ్స్ నిర్మూలన కొరకు కష్టపడి పని చేయాలని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీటీవి కెమెరాల పాత్ర చాలా కీలకయని ఎస్పి తెలిపారు . డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను పట్టిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఇపెట్టి కేసులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అదేశించారు. కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్ ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కేసుల నన్విక్షన్‌శాతాన్ని పెంచాలని అదేశించారు. ప్రతి పోలీస్ అధికారు గ్రామలపై పూర్తి అవగాహన కలిగి ఉండలన్నారు. అనంతరం కేసులను పరిష్కరించన అధికారులను శాలువతో సత్కరించి మేమంటోలు అందజేశారు. ఈ సామవేశంలో అదనపు ఎస్‌పి రాములు నాయక్ తదితరులు పాల్గోన్నారు.

## సిఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలి : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** సిఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అదేశించారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలోని కమరెడ్డి గూడ గ్రామ పంచాయతీ పరిధిలోఉన్న శ్రీ వెంకటరమణ రైస్ మిల్లును తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ,ఈ సందర్భంగామాట్లాడుతూ రబీ 2024–25కి సంబంధించిన సిఎంఆర్ డెలివరీ డెలివరీల ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లు యజమానికి సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా అధికారి మోహన్‌కృష్ణ. తదితరులు పాల్గొన్నారు.

## నేటి బంద్‌లో సిపిఐ, అనుబంధ సంఘాల శ్రేణులు పాల్గొనాలి
### సిపిఐ కార్యదర్శి ఇ.ఉమామహేష్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** బిసి రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదించాలన్న డిమాండ్‌తో శనివారం నాటి రాష్ట్రవ్యాప్త బంద్‌లో సిపిఐతో పాటు అనుబంధ సంఘాల శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఇ.ఉమామహేష్ పిలుపిచ్చారు. బంద్‌లో పాల్గొన్న వారందరూ పార్టీ జెండాలు, కండువాలు, ప్లేకార్డులపై గవర్నర్ వ్యవస్థ వద్దు, రిజర్వేషన్లు ముద్దు, మేమెంతో మాకంత, బిసి బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలంటూ నినాదాలు రాయాలలన్నారు. పార్టీ సానుభూతిపరులు, ప్రజా సంఘాల నాయకులు, కార్మిక, కర్షకులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రధాన సెంటర్లలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధంచేయాలన్నారు. నేటి బంద్‌లో సిపిఐ, అనుబంధ సంఘాల శ్రేణులు పాల్గొనాలి

## 'బంద్ ఫర్ జస్టిస్ తెలంగాణ'కు ఎఐఎస్‌ఎఫ్ మద్దతు
### బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపి : ఎండి అన్వర్

**ప్రజాపక్షం/బోడుప్పల్:** తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన బిల్లును ఆరు నెలలైన ఆమోదించకుండా 42 శాతం బిసి బిల్లు జిఓ ని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చకుండా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్నదని అన్వర్ తెలిపారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు న్యాయం జరుగుతుందని, బిజెపి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు రావలసిన హక్కులను కాలరాస్తుందని, రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కోసం మద్దతుఅంటూ కేంద్రంలో బిజెపి బిసి బిల్లును అడ్డుకుంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థిలోకం కేంద్రం లోని బిజెపి అనుసరిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వ్యతిరేక విధానాలపై తల్లిదండ్రులను ఆలోచింపజేసి రానున్న రోజుల్లో బిజెపికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, రాష్ట్రంలో ఏనిమిది మంది ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న ఉపయోగం లేకుండా పోయిందని, బిజెపికి బిసిల పట్ల చిత్త శుద్ధి ఉంటే వెంటనే బిసి రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ రాష్ట్రపతి చేత ఆమోదింప చేసి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని 18వ తేదీన బిసి జెఎసి సంఘాల ఆధ్వర్యంలో బంద్ ఫర్ జస్టిస్ పేరుతో నిర్వహిస్తున్న తెలంగాణ బంద్‌కి ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని పేర్కొన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు బంద్ కి సహకరించాలని, ఈ బంద్ ద్వారానైనా అసెంబ్లీ ఆమోదించిన బిసిబిల్లుకు కేంద్రప్రభుత్వం ఆమోద ముద్రవేయాలని ఎఐఎస్‌ఎఫ్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్ డిమాండ్ చేశారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు శనివారం అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బాలరాజు తెలిపారు. చర్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వాసవి శివసాయి నగర్ 11 కెవి ఫీడర్‌ను శనివారం మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నిలిపివేయడంతో వాసవిశివ నగర్, సాయి నగర్, వైష్ణవి ఎన్‌క్లేవ్, సోనియాగాంధీ నగర్, మారుతీనగర్, గణేష్‌నగర్, శివసాయి నగర్, సామ్రాట్ నగర్, శోభోదయ నగర్, లక్ష్మి నరసింహ నగర్, నాగార్జున నగర్ రోడ్ నంబర్ 1 తదితర ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ తెలిపారు.

**తూంకుంటలో:**
నేడు తూంకుంట, గాయత్రీ ఫీడర్‌లలో విద్యుత్ అంతరాయం ఉంటుందని శామీర్‌పేట విద్యుత్ ఎఇ రాఘవేందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూంకుంట ఫీడర్, గాయత్రి ఫీడర్ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో తూంకుంట, ద్వారాకపురి కాలనీ, ఆర్‌టిసి కాలనీ, మున్సిపాలిటి కార్యాలయం, బ్యాంక్ కాలనీ, దేవరయాంజాల్ రోడ్డు, అనురాగ్ అపార్ట్‌మెంట్స్, మందాయిపల్లి రోడ్డు, నార్త్‌పార్క్, డోమస్ కాలనీలకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

## విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** హోం వర్క్ చేయలేదనే కారణంతో ఓ ఉపాధ్యాయురాలు విద్యార్థిని చితకబాదిన సంఘటన మూడుచింతలపల్లి మున్సిపాలిటి ఉద్దెమర్రిలోని గుడ్‌షెపర్డ్ స్కూల్లో గురువారం జరిగింది. బాధిత విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన కథనం ప్రకారం.. ఉద్దెమర్రి ప్రైవేట్ స్కూల్లో ముక్కెర్ల మహేష్‌బాబు 8 వ తరగతి చదువుతున్నాడు. మహేష్‌బాబు హోం వర్క్ చేయలేదని బయెలాజికల్ సబ్జెక్ట్ బోధించే శోభారాణి ఉపాధ్యాయురాలు మహేష్‌బాబును విచక్షణా రహితంగా కర్రతో చేతులపై, ఇతర ప్రైవేట్ పార్టులపై కొట్టింది. దీంతో విద్యార్థి చర్మం కమిలిపోయి ఏడుస్తు ఇంటికి వెళ్లి జరిగిన విషయం తల్లిదండ్రులకు తెలియజేశాడు. విద్యార్థి తల్లిదండ్రులు, నానమ్మ టీచర్‌ను అడగడానికి పాఠశాలకు వెళ్తే టీచర్ రాలేదని స్కూల్లో ఉన్న సిబ్బంది చెప్పారు. ఇట్టి విషయం మూడుచింతలపల్లి మండల విద్యాధికారి భాగ్యమణికి సమాచారం అందడంతో విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారని విద్యార్థి తల్లిదండ్రులు పేర్కొన్నారు.

## బిసి రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి : డిజి నరేంద్రప్రసాద్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమోదింపజేయాలని, నేడు జరుగబోయే బిసి రిజర్వేషన్ రాష్ట్ర వ్యాప్త బందుకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని శామీర్‌పేట మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ నేడు రాష్ట్రవ్యాప్తంగా జరుగబోయే బిసి బంద్‌కు సిపిఐ పార్టీతో పాటు ఇతర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, సానుబూతి పరులు బంద్‌కు సంపూర్ణ మద్దతుతో పూర్తి సహకారం అందించాలని కోరారు. భారతదేశంలో వెనకబడిన తరగతుల ప్రజలకు 42 శాతం రిజర్వేషన్ కోసం బిసి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయని పేర్కోన్నారు. బిసిలు చాల వెనకబడి ఉన్నారని, సమాన ప్రాతినిధ్యం కోసం డిమాండ్ చాలకాలంగా రాజకీయ చర్చగా ఉందన్నారు.విద్యా, ఉపాధి, శాసనసభలో వెనకబడిన తరగతులకు తగినంత ప్రాతినిధ్యం కల్పిస్తుందని, గణనీయమైన జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఉంటుందని ప్రతిపాదకులు వాదిస్తున్నారన్నారు.

## రాజ్యాంగ సవరణ జరగాలిః శుభప్రద్‌పటేల్


**ప్రజాపక్షం/వికారాబాద్ :** 42శాతం రిజర్వేషన్ కోసం రాజ్యాంగ సవరణ జరుగాలని మాజీ బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్‌పటేల్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో తన కార్యలయంలో మీడియ సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి,కాంగ్రెస్ ఆడుతున్న నాటకాలు అని అన్నారు. కామరెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తామని ఓట్లు వేయించుకొని బిసిలను మోసంచేసిన పార్టీ కాంగ్రెస్ ,బిజెపి అని విమర్శించారు.

# రీల్

## తిలక్ వర్మను సన్మానించిన చిరు



ఇండియ టీం క్రికేటర్ తిలక్ వర్మను మెగాస్టార్ చిరంజీవి ఘనంగా సన్మానించారు. మన శంకర వరప్రసాద్ షూటింగ్ జరుపుకుంటున్న సెట్ లోకి తిలక్ వర్మను ఆహ్వానించారు. ఇటీవల జరిగిన ఇండియా పాకిస్తాన్ చాంపియన్ ట్రోఫీలో పాకిస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు తిలక్ వర్మ. ఇండియా టీం విజయానికి కారణమైన తిలక్ వర్మను చిరంజీవి తో పాటు టీం అందరూ అభినందించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఇలాంటి ఆటగాడు మన గడ్డపై పుట్టడం గర్వకారణమని చిరంజీవి కొనియాడారు. తిలక్ వర్మ ప్రతిభను చిరంజీవి మెచ్చుకున్నారు. ఎంతో మంది యువతకు తిలక్ వర్మ ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.




## యాభై రోజుల్లో అఖండ తాండవం

నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న అఖండ సినిమా సీక్వెల్ అఖండ 2 తాండవం ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధం అవుతోంది. అఖండ సూపర్ హిట్ తరువాత బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న అఖండ 2 తాండవం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సరిగ్గా యాభై రోజుల తరువాత డిసెంబర్ 5వ తేదీన ఈ సినిమా జనం ముందుకు రానుంది. బాలయ్య సరసన ఈ సినిమాలో సంయుక్త హీరోయిన్ గా నటిస్తోంది. ఇందులో బాలకృష్ణ పూర్తిగా భక్తి పారవశ్యంతో కూడిన పాత్ర పోషిస్తున్నారు. అయితే ధర్మాన్ని కాపాడేందుకు బయలు దేరిన ఓ ముని ఏం చేశారు ఆనేది ఈ సినిమా కథ. ఫోర్టీన్ రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాను నందమూరి తేజస్విని సమర్పిస్తున్నారు. బోయపాటి, బాలకృష్ణ కాంబినేషన్‌లో ఇప్పటి వరకు వచ్చిన సినిమా ల్లో ఈ సినిమా భారీ బడ్జెట్ తో నిర్మించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం నమోదు చేసుకుంటుందని నిర్మాతలు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

## 31న బాహుబలి ఎపిక్ విడుదల




ప్రభాస్ హీరోగా, రాజ మౌళి దర్శకత్వంలో వచ్చిన బాహుబలి సినిమా తెలుగు సినిమా రికార్డులను తిరగరాసింది. తెలుగు తెరపై బాహుబలి కొత్త చరిత్రను సృష్టించింది. బాహుబలికి ముందు, బాహుబలి తరువాత అనే స్థాయిలో తెలుగు సినిమా ఎదిగింది. ఈ సినిమాతో ప్రభాస్, రాజ మౌళి ఇద్దరికి కూడా ప్రపంచ వ్యాప్తంగా పేరు వచ్చింది. రెండు భాగాలుగా విడుదల అయిన బాహుబలి సినిమాను ఇప్పుడు ఒకే భాగం చేసి బాహుబలి ఎపిక్ పేరుతో విడుదల చేయనున్నారు. ఈనెల 31 తేదీన ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేస్తున్నారు. మూడు గంటల నలభై అయిదు నిమిషాల నివిడితో రూపొందించారు. సెన్సార్ పనులు కూడా పూర్తయ్యాయి. యు/ఏ సర్టిఫికెట్ వచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికాలో ప్రీమియం షోస్ వేస్తున్నారు. 107 షోలు వేస్తున్నారు. ప్రభాస్ సరసన తమన్నా హీరోయిన్ గా నటించిన ఈ చిత్రంలో రమ్యకృష్ణ, నాజర్ అత్యంత కీలకమైన పాత్రలను పోషించారు. ఇందులో రాణా దగ్గుబాటి విలన్ పాత్రలో కనిపిస్తారు. కట్టప్ప పాత్ర ఈ సినిమాలో ఎంతటి ఆసక్తిని పెంచిన విషయం తెలిసిందే. బాహుబలి సినిమా విడుదలై పదేళ్ళు అవుతున్న సందర్భంగా బాహుబలి ఎపిక్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమాకు ఎం ఎం కీరవాణి సంగీతం అందించారు.

## 'ట్రెండ్ సెట్ చెయ్' పాట విడుదల



సుధీర్ బాబు హీరోగా నిర్మిస్తున్న ఫాంటసీ యాక్షన్ మూవీ జటాధర నుంచి ప్రమోషనల్ సాంగ్ 'ట్రెండ్ సెట్ చెయ్' రిలీజ్ అయింది. ఎంటర్‌టైనింగ్ బీట్స్, కలర్ఫుల్ విజువల్స్, సుధీర్ బాబు ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్‌తో పాట మంచి వైబ్ క్రియేట్ చేస్తోంది. రీస్ అండ్ జైన్ సామ్ కంపోజ్ చేసిన ఈ సాంగ్ యూత్‌ఫుల్ ఎనర్జీతో అదిరిపోయింది. పాట రచయిత శ్రీమణి తెలుగుతో ఇంగ్లీష్ మిక్స్ చేస్తూ, ఆకట్టుకునే వర్డ్ ప్లేతో సాంగ్‌ను ట్రెండీగా రాశారు. జితేందర్ ,రాజీవ్ రాజ్ వోకల్స్‌తో పాటకు మరింత ఎనర్జీ ఇచ్చారు స్టైలిష్ పబ్ సెట్‌లో తెరకెక్కిన వీడియోలో సుధీర్ బాబు, శ్రేయా శర్మతో కలసి స్టైలిష్ మూవ్ మెంట్ వేస్తూ అదరగొట్టారు. స్మార్ట్ కొరియోగ్రఫీ, కూల్ వైబ్‌తో ట్రేండ సెట్ చెయ్య నిజంగానే టైటిల్‌కి తగ్గట్టే కొత్త ట్రెండ్ సెట్ చేసింది. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మిస్తున్న ఈ మిథాలజికల్ స్పెక్టాకిల్‌లో బాలీవుడ్ స్టార్ సోనాక్షి సిన్హా తొలిసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా నవంబర్ 7న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.






## మద్యం షాపులకు ఊపందుకున్న దరఖాస్తులు..

ప్రజాపక్షం/హైదరాబాద్: మద్యం దుకాణాల కోసం శుక్రవారం రాత్రి వరకు ఎక్సైజ్ శాఖకు రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులకు శనివారం ఒక్కరోజే మిగిలి ఉండడంతో లక్ష వరకు దరఖాస్తుల సంఖ్య దాటే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 2620 మద్యం షాపులకు శుక్రవారం ఒక్కరోజే 25 వేల దరఖాస్తులు వచ్చాయి. గురు వారం వరకు 25 వేల దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. చివరి రోజున 50 వేల దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఇక హైదరాబాద్ డివిజన్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రాంతాల్లో 11 ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ఎక్సైజ్ స్టేషన్ల కింద 179 మద్యం షాపులకు శుక్రవారం సాయంత్రం వరకు 1809 దరఖాస్తులు వచ్చాయి. శని వారం మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ కావడంతో భారీగా దరఖాస్తులు వస్తాయని భావిస్తున్నట్లు హైదరాబాద్ డిప్యూటి కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని మద్యం షాపులకు దరఖాస్తులు వేయడానికి వచ్చె వారి వాహనాలు ఎగ్జిబిషన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రంగారెడ్డి డివిజన్‌లో పది వేల దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా కూడ దరఖాస్తుల వెల్లువ కొనసాగుతుంది. శక్రవారం సాయంత్రం 3 గంటల వరకు భారీగా 15వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. సాయంత్రం వరకు 20వేల నుంచి 25వేల వరకు దరఖాస్తులు వచ్చే అంచనాలు ఉన్నాయి.












## పాలన గాలికి వదిలి వ్యక్తిగత వివాదాలు

### మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: మంత్రివర్గంలో మంత్రులు అరడజన్ వర్గాలుగా చీలిపోయారని, ఒకరంటే మరొకరికి పడతలేదని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. సిఎం, మంత్రులు రాష్ట్ర పాలనను గాలికి వదిలి వ్యక్తిగత వివాదాలు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ మంత్రులు కమీషన్ల కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం మరొకరు, వాటాలు, కబ్జాలు ఇలా మంత్రివర్గం ఒక దండుపాళ్యం ముఠాగా మారిందని ఎద్దేవా చేశారు. పారిశ్రామిక వేత్తలను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను, సినిమా హీరోలను, కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతున్నప్పటికీ బిజెపి ఎందుకు మౌనంగా ఉన్నదని, ముఖ్యమంత్రే తుపాకీ పంపించారంటే ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. దీని పైన కేంద్ర ప్రభుత్వం వెంటనే స్వతంత్ర జ్యుడిషియల్ కమిషన్‌తో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ 23 నెలల పాలనలో ఏం చేశారని, ఏం సాధించారన్నారు. ఏం సాధించారని రాష్ట్ర ప్రభుత్వం విజయోత్సవాలను నిర్వహిస్తుందని మండిపడ్డారు. మంత్రివర్గంలో దీపావళి కానుకగా ప్రజలకు ఏదైనా తీపి వార్త చెబుతరేమో అని తాము బావించామని, కానీ ప్రజలకు తీవ్ర నిరాశను మిగిలించారన్నారు. ప్రజలకు కష్టం వస్తే బిఆర్ఎస్ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని హరీశ్ రావు తెలిపారు.










Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com